Joyalukkas
World's favourite jeweller

ఈనాడు

జోయాలుక్కాస్
వరల్డ్స్ ఫేవరేట్ జ్యువెలర్

విజయవాడ 23-1-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 163

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20

www.eenadu.net


Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


నిబద్ధత ఉన్న సేవకుడు..
సంకల్పం ఉన్న నాయకుడు..
జన్మదిన శుభాకాంక్షలు
అసమాన దీక్షా దక్షతతో అద్వితీయంగా సాగుతూ...
ఆంధ్రప్రదేశ్ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ..
రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యం దిశగా పయనిస్తున్న మీ సంకల్పం నిరూపమానం.
జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని ముందంజలో
ఉంచాలనే నిబద్ధతతో పనిచేస్తూ, ప్రతి కార్యకర్త నాయకునిగా
ఎదిగి రాష్ట్రాభివృద్ధికి దిక్సూచి కావాలని పిలుపునిచ్చిన
రాష్ట్ర విద్య ఐటి శాఖామాత్యులు
యువనేత
శ్రీ నారా లోకేష్ గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు...
అనగాని సత్యప్రసాద్
రాష్ట్ర రెవిన్యూ, స్టాంప్స్
& రిజిస్ట్రేషన్ శాఖామాత్యులు
గొట్టిపాటి రవికుమార్
రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
ఏలూరి సాంబశివరావు
శాసనసభ్యులు
పర్చూరు నియోజకవర్గం
రేపల్లె, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 23-1-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 163
రూ. 6-50 పేజీలు 20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ప్రపంచం కోసమే ఈ శాంతి మండలి

దావోస్ వేదికగా 'గాజా పీస్ బోర్డు'ను ప్రారంభించిన ట్రంప్



- ఐక్యరాజ్యసమితికి పోటీగా దీన్ని తెచ్చారన్న అనుమానాలు
- భారత్, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, రష్యా సహా పలు దేశాలు గైర్హాజరు


12లో

ఝార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

రూ.2.35 కోట్ల రివార్డున్న అనల్ దా సహా 16 మంది మావోయిస్టుల మృతి

- 149 కేసులున్న అన్మోల్ కూడా..
- మృతుల్లో ఐదుగురు మహిళలు..
- ఆపరేషన్‌లో పాల్గొన్న 1,500 మంది సీఆర్‌పీఎఫ్ కోబ్రా దళం

5లో



దేశాల మధ్య సరిహద్దులు, యుద్ధాలెందుకు?



'ఈనాడు - ఈటీవీ భారత్'తో భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్

- అంతరిక్షం నుంచి భూమిని చూస్తుంటే ఇదే అనిపిస్తుంది
- పదవీ విరమణ నన్ను బాధిస్తోంది
- ఐఎస్ఎస్ నుంచి భూమిని చూసే అవకాశం ఇక దొరకదు
- నా భవిష్యత్ ప్రణాళికలపై ప్రస్తుతానికి స్పష్టత లేదు
- పిల్లలతో మమేకమవుతూ ప్రత్యేక సెషన్లలో పాల్గొంటా
- అంతరిక్ష రంగంలో భారత్-అమెరికా మధ్య ప్రత్యేక అనుబంధం ఏర్పడాలని ఆకాంక్ష

కోళికోడ్ నుంచి 'ఈనాడు - ఈటీవీ భారత్' ప్రత్యేక ప్రతినిధి


అంతరిక్షం నుంచి భూమిని చూస్తుంటే.. దేశాల మధ్య సరిహద్దులు ఎందుకు, యుద్ధాలు ఎందుకు అని మనసులో అనిపిస్తుంటుందని భారత సంతతి అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ అన్నారు. మనుషులు చాలా విషయాల్లో తొందరపడుతున్నారన్న భావన కలుగుతుందని చెప్పారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ- 'నాసా' వ్యోమగామిగా పదవీ విరమణ చేయడం తనకు బాధగా అనిపిస్తోందని పేర్కొన్నారు. అంతరిక్షం నుంచి అందమైన భూమిని చూసే అరుదైన అవకాశం ఇకపై తనకు దొరకదన్నారు. కేరళలోని కోళికోడ్‌లో గురువారం ప్రారంభమైన కేరళ సాహిత్య ఉత్సవానికి విశిష్ట అతిథిగా హాజరైన సునీతా విలియమ్స్.. 'ఈనాడు - ఈటీవీ భారత్' ప్రత్యేక ప్రతినిధితో మాట్లాడారు. వ్యక్తిగత, వృత్తి జీవితం గురించి పలు అంశాలను పంచుకున్నారు. ఆ వివరాలివీ..

పదవీ విరమణ తర్వాత జీవితం ఎలా ఉంది?

సునీతా విలియమ్స్: నిజంగా నాసా నుంచి రిటైరయ్యానని ఇప్పటికీ నాకు అనిపించడం లేదు. అయితే ఇప్పుడు చాలా ప్రాంతాల్లో పర్యటిస్తున్నా. పిల్లలతో సెషన్లలో పాల్గొంటున్నా. ఎన్నో కార్యక్రమాల్లో ప్రసంగిస్తున్నా. అంతరిక్ష పరిశోధనల గురించి ఉత్సాహంగా మాట్లాడుతున్నా. (మిగతా 5లో)

కర్త, కర్మ, క్రియా రాజ్ కెసిరెడ్డే

- మద్యం కుంభకోణం గురించి అంతా ఆయనకే తెలుసు
- ఈడీ విచారణలో వైకాపా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడి
- మళ్లీ రాజకీయాల్లోకి వస్తాను..
- కూటమి ఇలాగే కొనసాగితే జగన్‌కు అధికారం కలే అని వ్యాఖ్య



ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో మద్యం కుంభకోణం గురించిన సమాచారం మొత్తం రాజ్ కెసిరెడ్డికి తెలుసని.. ఇందులో కర్త, కర్మ, క్రియా అంతా ఆయనేనని మాజీ ఎంపీ, వైకాపాకు రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి సూచన మేరకు సజ్జల శ్రీధర్‌రెడ్డికి తాను రూ.వంద కోట్లు సర్దుబాటు చేయించిన విషయాన్ని కూడా ఈడీకి చెప్పానన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాను ఈ కేసులో అప్రూవర్‌గా మారబోనని, ఆ అవసరం తనకు లేదని తేల్చి చెప్పారు. మద్యం కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులో అధికారులు గురువారం ఉదయం 11 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఏడుగంటలపాటు సుదీర్ఘంగా విచారించారు. అనంతరం విజయసాయిరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. 'మద్యం కుంభకోణం గురించి ఈడీ అధికారులు నన్ను సుదీర్ఘంగా విచారించారు. నేను చెప్పిన విషయాల్లో కొన్నింటిని రికార్డు చేశారు. మరికొన్నింటిని చేయలేదు. అసలు మద్యం కుంభకోణం జరిగిందా అని అడిగారు. అది నాకు తెలియదు.. ఈ కుంభకోణంలో ప్రమేయం ఉన్నవారే దానికి సమాధానం చెబుతారన్నాను. (వైకాపాలో నంబర్ 2 స్థానంలో ఉండి తెలియదనడం నిజం కాదేమో అని విలేకర్లు అడగ్గా) స్వయానా జగన్‌మోహన్‌రెడ్డే (మిగతా 5లో)

రూ.1.59 లక్షలకు చేరిన పసిడి



ఈనాడు వాణిజ్య విభాగం: బంగారం, వెండి ధరలు గురువారం మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర 4900 డాలర్లను, వెండి ఔన్సు ధర 96 డాలర్లను మించడం ఇందుకు కారణం. హైదరాబాద్ బులియన్ విపణిలో గురువారం రాత్రి 11.55 గంటలకు 10 గ్రాముల మేలిమి (999 స్వచ్ఛత) బంగారం ధర రూ. 1,59,000కి, కిలో వెండి ధర రూ. 3,26,000కి చేరింది.

క్రీడా నగరాల్లో పెట్టుబడులు పెట్టండి

- దావోస్‌లో టాటా సంస్థల ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో సీఎం
- రాష్ట్రంలో టాటా ప్రాజెక్టుల పురోగతిపై చర్చ

ఈనాడు, అమరావతి: ఏపీలో మూడు క్రీడా నగరాలు నిర్మించే ఆలోచనలో ఉన్నామని.. వాటిలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని టాటా సంస్థల ఛైర్మన్ చంద్రశేఖరన్‌కు సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. రాష్ట్రంలో టాటా గ్రూప్ చేపట్టిన పర్యాటక ప్రాజెక్టులు వేగవంతం చేయాలని కోరారు. దావోస్ పర్యటనలో భాగంగా సీఎంతో చంద్రశేఖరన్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. చంద్రబాబు మాట్లాడుతూ.. 'గత ఏడాది దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ రంగాల పారిశ్రామికవేత్తలతో జరిపిన చర్చల ద్వారా ఇప్పటికే రూ. 2.5 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండింగ్ అయ్యాయి. ప్రపంచ పారిశ్రామిక పోకడలు, పారిశ్రామికవేత్తల ఆలోచనలు తెలుసుకోవడానికి దావోస్ మంచి వేదిక. ఏపీని బ్రాండ్ చేయడానికి, కొత్త పాలసీలపై మార్కెట్ అంచనా వేసేందుకు పర్యటన దోహదపడింది. మూడు రోజుల్లో వివిధ సమావేశాల్లో గ్రీన్ ఎనర్జీ, సాంకేతికత, కృత్రిమ మేధ, వ్యవసాయం, పర్యాటక రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న విజయాల గురించి పారిశ్రామికవేత్తలకు (మిగతా 5లో)



చంద్రశేఖరన్‌తో భేటీ అయిన సందర్భంగా ఆయనను సత్కరించి, జ్ఞాపిక అందిస్తున్న సీఎం చంద్రబాబు

విశాఖలో సమీకృత ఐటీ అభివృద్ధి కేంద్రం నెలకొల్పండి

క్యాప్‌జెమిని సీఈవో ఐమన్ ఎజాత్‌తో మంత్రి లోకేశ్ భేటీ



ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో సమీకృత ఐటీ అభివృద్ధి కేంద్రం, జీసీసీ, వర్టికల్ బీపీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని క్యాప్‌జెమిని సీఈవో ఐమన్ ఎజాత్‌ను రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. దావోస్‌లో ఐమన్ ఎజాత్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఇంజినీరింగ్, ఎమర్జింగ్ (మిగతా 5లో)

టైరు పేలి స్లీపర్ బస్సు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన బస్సు

- డివైడర్ దాటి పక్క మార్గంలో పడిన బస్సు
- ఆ దారిలో కంటెయినర్ ఢీకొని మంటలు
- రెండు వాహనాల డ్రైవర్లు సహా ముగ్గురి మృతి
- క్లీనర్ అప్రమత్తతతో 36 మంది సురక్షితం
- నంద్యాల జిల్లాలో అర్ధరాత్రి దుర్ఘటన

కర్నూలు-కడప జాతీయ రహదారి-40పై నంద్యాల జిల్లాలో ఘోరం జరిగింది. తొలుత టైర్ పేలడంతో బస్సు అదుపు తప్పి, రోడ్డుకు అవతలి మార్గంలో పడిపోగా, ఎదురుగా వస్తున్న కంటెయినర్ ఢీకొనడంతో క్షణాల్లో మంటలు చెలరేగాయి. ఆ అగ్నికీలల్లో ఇరు వాహనాల డ్రైవర్ క్యాబిన్లలో ఉన్న (మిగతా 3లో)

రథసప్తమి వేడుకలకు తిరుమల సిద్ధం

5లో


యువనేతకు
జన్మదిన శుభాకాంక్షలు
అసమాన దీక్షాదక్షతతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును సుసాధ్యం చేసి..
నవ్యాంధ్రప్రదేశ్ భావితరాలకు భవ్య శుభోదయంగా నిలిచారు.
యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలనే సంకల్పంతో నిత్యం కృషిచేస్తూ..
నవ్యాంధ్రప్రదేశ్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలపాలనే లక్ష్యంతో పనిచేస్తున్న..
గౌరవ రాష్ట్ర ఐటి, విద్యాశాఖామాత్యులు
శ్రీ నారా లోకేష్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
మీ... భాష్యం ప్రవీణ్
శాసనసభ్యులు - పెదకూరపాడు


SRM UNIVERSITY AP
Andhra Pradesh
Shri Nara Chandrababu Naidu Garu
Honourable Chief Minister
HAPPY Birthday
Shri Nara Lokesh Garu
Minister of Information Technology, Electronics & Communications,
Real Time Governance and Human Resources Development,
Govt. of Andhra Pradesh
School of Engineering And Sciences (SEAS)
Easwari School of Liberal Arts (ESLA)
Paari School of Business (PSB)
SRM University-AP, Amaravati, Andhra Pradesh
https://www.SRMAP.edu.in

ఈనాడు

విజయవాడ 23-1-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 163
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 20 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

పోలవరం పనులు భేష్

- డయాఫ్రం వాల్ వేగంగా నిర్మించారు
- విదేశీ నిపుణుల బృందం కితాబు

ఈనాడు, అమరావతి: 'పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మా ఐదో పర్యటనకు, ఈ ఆరో పర్యటనకు మధ్య ఎంతో పురోగతి కనిపిస్తోంది. గడిచిన మూడు నెలల్లో ప్రాజెక్టు పనుల్లో మంచి ప్రగతి ఉంది. 2026 జూన్ వరకు డయాఫ్రం వాల్ పూర్తి చేయలేమని అప్పట్లో బావర్ కంపెనీ ప్రతినిధులు చెప్పారు. ఇప్పుడు ఫిబ్రవరి నాటికే డయాఫ్రం వాల్ పూర్తి కాబోతోంది' అని ఈ ప్రాజెక్టుకు సంబంధించిన విదేశీ నిపుణులు హించ్‌బెర్గర్, డేవిడ్ బి పాల్, ఫ్రాంకో డి సిస్కోలు ప్రశంసించారు. పోలవరంలో మూడు రోజుల సమీక్షల అనంతరం గురువారం రాజమహేంద్రవరంలో ప్రాజెక్టు అథారిటీ కార్యాలయంలో వారు అధికారులతో సమావేశం నిర్వహించారు. మూడు రోజుల సమావేశం వివరాలను మరోసారి పునఃశ్చరణ చేసి మౌఖికంగా వారి అభిప్రాయాలను తెలియజేశారు. ప్రధాన డ్యాంలో వాడుతున్న ఇసుక, రాయి, క్లే తదితర మెటీరియల్ నాణ్యత బాగుందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టులో ప్రస్తుతం గ్యాప్ 1 ప్రధాన డ్యాం నిర్మాణానికి అవసరమైన ఆకృతులకు ఆమోదం ఉంది. గ్యాప్ 2 ప్రధాన డ్యాంకు సంబంధించి ఇసుక రీచ్‌లో 23 అడుగుల వరకు ఆకృతులకు ఇప్పటికే ఆమోదం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన పనులు పూర్తయ్యేసరికి జూన్ వరకు సమయం పడుతుంది. గ్యాప్ 2 ప్రధాన డ్యాం బంకమన్ను రీచ్‌లో ఆకృతులకు సంబంధించిన అంశాలపై గడిచిన మూడు రోజులు చర్చలు జరిపారు. ఈ ఆకృతులకు సంబంధించి సూత్రప్రాయంగా మౌఖికంగా విదేశీ నిపుణులు ఆమోదం తెలిపారు.

2027 జూన్‌కు సాధ్యమే

'పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబరుకు పూర్తి చేయాలని మా ఐదో పర్యటన సమయంలో ఉన్న లక్ష్యం. తాజాగా ఈ లక్ష్యాన్ని 2027 జూన్‌కు మార్చారు. అప్పటిలోగా ప్రాజెక్టు పనులు పూర్తి చేసే సామర్థ్యం మీకు ఉంది. ఆ సామర్థ్యం కనబరుస్తున్నారు' అని విదేశీ నిపుణులు పేర్కొన్నారు.

'భారతి' వాటాల విక్రయ సొమ్ము అందుకోని

దాల్మియా సిమెంట్స్

రూ.146 కోట్లకు రికార్డులే లేవు • ఆ డబ్బు నిందితులకే వెళ్లింది

- కాగితాల్లోనే జయా మినరల్స్, ఈశ్వర్ సిమెంట్స్
- జగన్ అక్రమాస్తుల కేసులో తెలంగాణ హైకోర్టుకు నివేదించిన సీబీఐ



ఈనాడు, హైదరాబాద్: అక్రమాస్తుల వ్యవహారంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కంపెనీలో ముడుపుల చెల్లింపు కింద పెట్టిన వాటాలను విక్రయించడం ద్వారా వచ్చిన రూ.146.58 కోట్లు దాల్మియా సిమెంట్స్‌కు అందలేదని సీబీఐ గురువారం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. భారతి (రఘురాం) సిమెంట్స్‌లో దాల్మియాకు చెందిన వాటాలను విక్రయించడం ద్వారా రూ.146.58 కోట్లు రాగా ఆ సొమ్ము దాల్మియాకు కాకుండా వివిధ రూపాల్లో తిరిగి నిందితులకే (జగన్‌కే) వెళ్లిందని పేర్కొంది. జగన్‌కు చెందిన భారతి సిమెంట్స్‌లో లాభాలను ఆశించి పెట్టిన వాస్తవ పెట్టుబడే అయితే వాటాలను విక్రయించినపుడు ఆ డబ్బును దాల్మియా రికార్డుల్లో చూపాల్సి ఉందని, ఎక్కడా ఆ సొమ్ము కనిపించడంలేదంది. జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ దాల్మియా సిమెంట్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలం తలమంచిపట్నం, నవాబ్‌పేట గ్రామాల్లో 407.05 హెక్టార్ల లీజును అక్రమ పద్ధతుల్లో అప్పటి ప్రభుత్వం దాల్మియా సిమెంట్స్‌కు కట్టబెట్టిందని తెలిపారు. ఇందుకు ప్రతిఫలంగా దాల్మియా సిమెంట్స్ జగన్‌కు చెందిన భారతి సిమెంట్స్‌లో రూ.95 కోట్లు పెట్టుబడి పెట్టిందన్నారు. 1997లో జయా మినరల్స్ సున్నపురాయి నిక్షేపాల నిమిత్తం ప్రాస్పెక్టింగ్ లీజు దరఖాస్తు చేసిందని, అందులో పేర్కొన్న చిరునామాలో కంపెనీ లేదన్న కారణంగా దాన్ని పక్కన పెట్టారన్నారు. అనంతరం 2004లో జయా మినరల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సజ్జల దివాకర్‌రెడ్డికి చెందిన ఈశ్వర్ సిమెంట్స్ ఒప్పందం కుదుర్చుకుందన్నారు.

ఈ ఒప్పందం కూడా పాత తేదీతో చేసుకున్నట్లు ఉందన్నారు. ఒప్పందం కుదిరిన తేదీకి, స్టాంపు కొనుగోలు చేసిన తేదీకి పొంతన లేదని తెలిపారు. జయా మినరల్స్ దరఖాస్తు చేసిన లీజును బదిలీ చేయాలంటూ ఈశ్వర్ సిమెంట్స్ దరఖాస్తు చేసిందన్నారు. నిబంధనల ప్రకారం చిరునామా లేని జయా మినరల్స్ దరఖాస్తును తిరస్కరించాల్సి ఉందన్నారు. అయితే అదే అధికారులు 407.05 హెక్టార్లకు లీజు కోరుతూ దరఖాస్తు చేసిన కంపెనీ చిరునామా లేకపోయినా లీజు మంజూరైందని, ఒక వ్యవహారానికి సంబంధించి భిన్నమైన నిర్ణయాలు తీసుకోవడం కుట్రలో భాగమేనన్నారు. అప్పటి గనుల శాఖ డైరెక్టర్ నిబంధనలను పట్టించుకోకుండా ఈశ్వర్ సిమెంట్స్‌కు 3 నెలల్లో లీజును బదిలీ చేయాలన్న నిబంధనతో మంజూరైందన్నారు.

ప్రైవేటు న్యాయవాది అభిప్రాయాన్ని తీసుకున్న డైరెక్టర్

ఈశ్వర్ సిమెంట్స్‌కు చెందిన లీజును దాల్మియా సిమెంట్స్‌కు బదలాయింపునకు సంబంధించి నిబంధనలను వివరించాలని సీబీఐ గనుల శాఖ డైరెక్టర్‌కు లేఖ రాస్తే, ప్రైవేటు న్యాయవాది నుంచి పొందిన న్యాయ సలహా (లీగల్ ఒపీనియన్)ను పంపించారన్నారు. ఈశ్వర్ సిమెంట్స్‌కు చెందిన వాటాలన్నింటినీ దాల్మియా కొనుగోలు చేయడం ద్వారా అందులో విలీనమైందని, అందువల్ల లీజు బదలాయింపు చట్టబద్ధమని ప్రైవేటు న్యాయవాది ఇచ్చిన న్యాయ సలహాను పరిగణనలోకి తీసుకోవడం సరికాదన్నారు. అసలు జయా మినరల్స్, ఈశ్వర్ సిమెంట్స్ కాగితాల్లో మాత్రమే ఉన్నాయని, వాస్తవంగా కంపెనీలు లేవన్నారు. పేపర్లలోని కంపెనీలకు లీజు మంజూరు చేయకూడదని తెలిపారు. కంపెనీ అవసరాలకే మైనింగ్ లీజు మంజూరు చేయాలన్నారు. రికార్డుల్లోని పత్రాలు పరిశీలిస్తే ఈశ్వర్ సిమెంట్స్ పరిశ్రమ భౌతికంగా లేదన్నారు. మైనింగ్ డైరెక్టర్‌కు అన్ని విషయాలు తెలిసీ ఫైలును పంపగా అప్పటి కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, మంత్రి సబితా ఇంద్రారెడ్డి మైనింగ్ లీజును మంజూరు చేశారన్నారు. ఈశ్వర్ సిమెంట్స్‌కు చెందిన లీజు దాల్మియాకు బదలాయించడంలోనూ అక్రమాలేనన్నారు. మైనింగ్ లీజు బదలాయించాలంటే అయిన ఖర్చును మాత్రమే లీజు పొందే కంపెనీ చెల్లించాల్సి ఉందన్నారు. దీనికి భిన్నంగా ఈశ్వర్ సిమెంట్స్ అదనంగా రూ.2.14 కోట్ల లాభం పొందిందన్నారు. ఈ విషయాలన్నీ తెలిసీ అధికారులు తొక్కిపెట్టి లీజు మంజూరు చేశారన్నారు. దీనిపై తదుపరి విచారణ వారానికి వాయిదా పడింది.



నూతన రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే అరవిందబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

హామీ నెరవేర్చిన పవన్‌కల్యాణ్

కోటప్పకొండ - కొత్తపాలెం రోడ్డు ప్రారంభం

ఈనాడు, నరసరావుపేట: కోటప్పకొండకు భారీ ప్రభలతో భక్తులు వచ్చే మార్గాల్లో ఒకటైన కోటప్పకొండ-కొత్తపాలెం రోడ్డు నిర్మాణాన్ని శివరాత్రిలోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్న హామీని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నెరవేర్చారు. గురువారం పల్నాడు జిల్లా కోటప్పకొండకు వచ్చిన ఆయన రోడ్డును ప్రారంభించారు. తొలుత త్రికోటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించి, పూజలు చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు ఈ రోడ్డు నిర్మించాలని ఉప ముఖ్యమంత్రికి విన్నవించారు. శివరాత్రి లోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని అప్పట్లో పవన్ మాటిచ్చారు. ఈ మేరకు రూ.3.90 కోట్ల పంచాయతీ రాజ్ నిధులతో కోటప్పకొండ-కొత్తపాలెం మధ్య 8 కి.మీ. మేర రహదారి నిర్మాణాన్ని పూర్తి చేశారు.




త్రికోటేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు అందిస్తున్న పవన్‌కల్యాణ్

చర్లపల్లి-తిరువనంతపురం మధ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్

- నేడు ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: కొత్తగా అమృత్ భారత్ 2.0 ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రానుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. కేరళలోని తిరువనంతపురం నుంచి బయలుదేరే ఈ రైలును ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఇప్పటికే చర్లపల్లి-ముజఫర్‌పూర్ (బిహార్) మధ్య ఒక అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. అమృత్ భారత్ 2.0 రైలు (నం.17041) ప్రతి మంగళవారం ఉదయం 7.15 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు (బుధవారం) మధ్యాహ్నం 2.45 గంటలకు తిరువనంతపురం చేరుకుంటుంది. తిరిగి అదేరోజు సాయంత్రం 5.30 గంటలకు తిరువనంతపురం నుంచి రైలు (నంబరు 17042) బయలుదేరి... గురువారం రాత్రి 11.30 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. తెలంగాణలోని నల్గొండ, మిర్యాలగూడ, ఆంధ్రప్రదేశ్‌లోని సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుందని కిషన్‌రెడ్డి తెలిపారు.

పతాకస్థాయికి అభిరుచి!



తిరుపతి వెస్ట్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సురేష్‌రెడ్డి 2001 నుంచి పురాతన, అరుదైన నాణేలు సేకరిస్తున్నారు. ఈ అభిరుచికి 25 సంవత్సరాలు పూర్తికావడంతో వినూత్నంగా వేడుక చేసుకున్నారు. గణతంత్ర దినోత్సవం కూడా వస్తుండటంతో తన ఇంటిపైన 25 పైసల నాణేలతో 12 అడుగుల పొడవు, 42 అడుగుల వెడల్పుతో జాతీయ జెండా నమూనాను తీర్చిదిద్దారు. ఇందుకు ఏకంగా 450 కిలోల బరువున్న 1.60 లక్షల నాణేలు ఉపయోగించారు. – ఈనాడు, తిరుపతి

హవాలా మార్గంలో చిన్నఅప్పన్నకు సొమ్ము

- కేజీ నెయ్యికి రూ.25 కమీషన్ డిమాండ్ చేశారు
- ఎవరి ప్రోద్బలంతో వసూలు చేశారో దర్యాప్తులో తేలాలి
- బెయిల్ పిటిషన్ను కొట్టేయండి
- హైకోర్టులో సీబీఐ వాదనలు
- తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన టెండర్ల వ్యవహారంలో వైకాపా రాజ్యసభ సభ్యుడు, తితిదే పూర్వ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అప్పటి పీఏ చిన్నఅప్పన్న జోక్యం చేసుకున్నారని సీబీఐ స్టాండింగ్ కౌన్సెల్ పీఎస్‌పీ సురేశ్‌కుమార్ గురువారం హైకోర్టులో వాదనలు వినిపించారు. నకిలీ నెయ్యి సరఫరా చేసిన భోలేబాబా తదితర డెయిరీల నుంచి చిన్నఅప్పన్న కేజీకి రూ.25 చొప్పున కమీషన్ డిమాండ్ చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. హవాలా మార్గంలో చిన్నఅప్పన్నకు వివిధ సందర్భాల్లో సొమ్ము చేరిందని తెలిపారు. రూ.కోట్ల మొత్తానికి బ్యాంక్ లావాదేవీలు నిర్వహించారన్నారు. 2019 నుంచి 2024 మధ్యలో దిల్లీలోని ఏపీ భవన్‌లో అప్పన్న లైజనింగ్ ఆఫీసర్‌గా పనిచేశారని.. అంతకు ముందు సుబ్బారెడ్డికి పీఏగా వ్యవహరించారని తెలిపారు. ఎవరి ప్రోద్బలంతో ఆయన కమీషన్ వసూలు చేశారో తేల్చాల్సి ఉందన్న కారణంతో హైకోర్టు అప్పన్న బెయిల్ పిటిషన్ను గతంలో ఓసారి కొట్టేసిందన్నారు. పరిస్థితుల్లో ఎలాంటి మార్పూ లేకుండానే ప్రస్తుత పిటిషన్ వేశారన్నారు. దానిని కొట్టివేయాలని కోరారు. గురువారం జరిగిన విచారణలో అప్పన్న బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలూ ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు. అంతకు ముందు పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. 'నెయ్యి సరఫరా టెండర్లతో అప్పన్నకు సంబంధం లేదు. నెయ్యి సరఫరా చేసిన నిందితులందరూ ఇప్పటికే బెయిలు పొందారు. 87 రోజుల నుంచి పిటిషనర్ జైల్లో ఉన్నారు. బెయిలు మంజూరు చేయండి' అని కోరారు.

సుప్రీంకోర్టులో ఓ మాట.. ట్రైబ్యునల్‌లో మరోమాటా?

- కృష్ణా తొలి ట్రైబ్యునల్‌కు రక్షణ కావాలంటూ సుప్రీంలో..
- ఆ కేటాయింపులు మార్చాలంటూ ఇక్కడ వాదిస్తారా?
- బ్రిజేశ్ ట్రైబ్యునల్‌లో తెలంగాణ వైఖరిని ప్రశ్నించిన ఏపీ
- సాగర్ జలాలు మాత్రమే 2 రాష్ట్రాలకు పంచాలని వాదన

ఈనాడు, అమరావతి: 'కృష్ణా రెండో ట్రైబ్యునల్ నిర్ణయాలను తెలంగాణ రాష్ట్రం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. తొలి ట్రైబ్యునల్ నిర్ణయాలకు రక్షణ ఉండాలని అక్కడ వాదిస్తోంది. అదే రాష్ట్రం మళ్లీ మీ ముందుకొచ్చి కృష్ణా తొలి ట్రైబ్యునల్ కేటాయింపులను తిరగదోడాలని చెబుతోంది. ఇదేం వైఖరి?' అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా.. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో తెలంగాణ వినిపించిన వాదనల డాక్యుమెంట్‌ను కూడా అందించారు. 'ఎన్ బ్లాక్ కేటాయింపులు.. రాష్ట్ర విభజన ముందువరకు మాత్రమే వర్తిస్తాయి. విభజన తర్వాత వర్తించవు. ఉమ్మడి ఏపీకి కృష్ణా తొలి ట్రైబ్యునల్ తీర్పులో ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు ఉన్నాయి. వాటిని మార్చకుండా, యథాతథంగా రక్షణ కల్పించాలి. ఒక్క నాగార్జునసాగర్‌లో మాత్రమే ఉమ్మడి కేటాయింపులు ఉన్నాయి. సాగర్‌కు ఉన్న 264 టీఎంసీల్లో కుడి కాలువ కింద రాష్ట్ర విభజన నాటికి ఆయకట్టు ఎంత? ఎడమ కాలువ కింద తెలంగాణ, ఏపీల్లో ఎంతెంత ఉందో పరిశీలించి ఆ ప్రకారం సాగర్ జలాలను రెండు రాష్ట్రాల మధ్య పంచాల్సి ఉంటుంది' అని జయదీప్ గుప్తా పేర్కొన్నారు. దిల్లీలో బ్రిజేష్ ట్రైబ్యునల్ ఎదుట గురువారం ఆయన తెలంగాణ వాదనలకు కౌంటర్ వాదనలు కొనసాగించారు. న్యాయవాదులు ఎస్.సంజయ్, జె.శరత్‌చంద్ర సహకరించారు. ఇప్పటికే తొమ్మిది రోజుల పాటు ఈ వాదనలు సాగాయి. జస్టిస్ బ్రిజేష్ కుమార్, సభ్యులు జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్రలు వాదనలు విన్నారు.

జయదీప్ గుప్తా వాదనలు

★ తుంగభద్రలో హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీలకు 78.50 టీఎంసీల నీటి కేటాయింపులను ఇప్పటికే ట్రైబ్యునల్ ఖరారు చేసింది. మిగతా ప్రాజెక్టులకు కూడా ఇలాగే కేటాయింపులు నిర్ణయించాలి. కృష్ణా ట్రైబ్యునల్ నిర్ణయం ప్రకారం తెలంగాణ, ఏపీకి ఉన్న కేటాయింపులు నిర్ధారించాక ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం మొత్తం కేటాయింపులను ఎన్-బ్లాక్‌గా పరిగణించవచ్చు. అప్పుడు ఆ రాష్ట్రం తమ వాటాలో ఆదా అయిన నీటితో వారి అవసరాల తీర్చుకోవచ్చు.

★ ఇతర బేసిన్లకు నీటి మళ్లింపు చట్టబద్ధమే. అంతర్జాతీయ న్యాయసూత్రాలు, జాతీయ నీటి విధానం, కావేరి ట్రైబ్యునల్ అవార్డు దీన్ని సమర్థిస్తున్నాయి. బ్రిజేష్ ట్రైబ్యునల్‌లో 12వ ఛాప్టర్ ఇదే అంశాన్ని చర్చించింది. అందులో భారతీయ చట్టాలు, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, అంతర్జాతీయ చట్టాలను చర్చించారు. కృష్ణా తొలి ట్రైబ్యునల్ తీర్పులో ప్రస్తుత కేటాయింపులకు రక్షణ కల్పించిన అంశాలను వివరించారు. రెండో ట్రైబ్యునల్ క్లాజ్-2లో కూడా ఇప్పుడున్న నిబంధనలకు రక్షణ కల్పించిన అంశాలను ఉదహరించారు. ట్రైబ్యునల్ అవార్డులు మురిగిపోవడమంటూ ఉండదు.

★ 2002కు ముందు ట్రైబ్యునళ్లు పరిష్కరించిన వివాదాలను తిరగదోడలేం. వారసత్వ రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇందుకు కట్టుబడి ఉండాల్సిందే. ట్రైబ్యునల్ అవార్డులు సుప్రీంకోర్టు తీర్పులతో సమానం. రాష్ట్ర విభజన వల్ల పరీవాహక ప్రాంతం, జనాభాలో మార్పు లేదు. ఇక్కడ గోదావరి జలాల లభ్యతను పరిగణనలోకి తీసుకోకూడదు. గోదావరి నీటి కేటాయింపులపై వివాదాలకు వేరే ట్రైబ్యునల్ అవసరం. రాష్ట్ర విభజన చట్టం ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులను గుర్తిస్తుంది. కాబట్టి, విభజన చట్టాన్ని కూడా ట్రైబ్యునల్ పరిగణనలోకి తీసుకోవాలి.

కావేరి ట్రైబ్యునల్ అవార్డుదీ అదే మాట

సీనియర్ న్యాయవాది ఉమాపతి వాదిస్తూ.. కావేరి ట్రైబ్యునల్ అవార్డు ఇతర బేసిన్లకు నీటి మళ్లింపులకు రక్షణ కల్పించిందని ఉదహరించారు. 1924 నాటి ఒప్పందాలను కావేరి ట్రైబ్యునల్ అవార్డులో చేర్చినట్లు ప్రస్తావించారు. అప్పటికే అభివృద్ధి చెందిన ఆయకట్టుకు ఈ అవార్డు సాగునీటి రక్షణ కల్పించిందని, తర్వాత దాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని గుర్తుచేశారు. కావేరి ట్రైబ్యునల్ అప్పటికే ఉన్న ఆయకట్టును, ఉపయోగాలను పట్టించుకోలేదంటూ తెలంగాణ చేస్తున్న వాదన తప్పు అని పలు ఉదాహరణలను ఉమాపతి ప్రస్తావించారు.

జేఈఈ మెయిన్స్‌లో రెండో రోజూ గణితం కఠినమే!

ఈనాడు, అమరావతి: జేఈఈ మెయిన్స్‌లో గురువారం ఇచ్చిన ప్రశ్నపత్రాలు బుధవారం నాటి పేపర్లలాగే కఠినంగా ఉన్నట్లు అభ్యర్థులు తెలిపారు. షిఫ్టు-1లో గణితం నుంచి వచ్చిన ప్రశ్నలు ఎక్కువ సమయం తీసుకున్నాయని పేర్కొన్నారు. ప్రశ్నల్లో సందిగ్ధత కనిపించలేదని శ్రీచైతన్య ఆల్ ఇండియా ఐఐటీ కోఆర్డినేటర్ ఎం.ఉమాశంకర్ తెలిపారు. బుధవారం నాటి పేపర్‌తో పోల్చితే భౌతికశాస్త్రం కొంత కఠినంగా ఉందని, 2 ప్రశ్నలు సందిగ్ధంగా ఉండటం, వాటికి సరైన సమాధానం గుర్తించేందుకు విద్యార్థులకు ఎక్కువ సమయం పట్టిందని వెల్లడించారు. రసాయనశాస్త్రం ఓ మోస్తరు నుంచి కఠిన స్థాయిలో ఉందని, కొన్ని ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యాంశాలకు మించినవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి వచ్చిన ప్రశ్నలు ఎక్కువ సమయం తీసుకునేలా ఉన్నాయని తెలిపారు. మొత్తమ్మీద మంచి సన్నద్ధత కలిగి పరీక్ష రాసిన విద్యార్థులు 90 నుంచి 110 మార్కులు సాధించడం సాధ్యమేనని, 300 మార్కులు సాధించడం కష్టమని పేర్కొన్నారు.

★ షిఫ్టు-2లో గణితంలో సుదీర్ఘ ప్రశ్నలు ఇచ్చారని, సుమారు 4 నుంచి 5 ప్రశ్నలు ఎక్కువ సమయం తీసుకునేలా ఉన్నాయని ఎం.ఉమాశంకర్ తెలిపారు. మొత్తం మీద గణితం కఠినంగా ఉందని.. అన్నింటికి జవాబులు రాసేందుకు 80 నిమిషాల వరకు సమయం అవసరమైందని, భౌతికశాస్త్రంలో ప్రాక్టికల్ ఫిజిక్స్ నుంచి వచ్చిన ప్రశ్నలు ఎక్కువ సమయం తీసుకున్నాయని విద్యార్థులు తెలిపారు. రెండో షిఫ్టులో అత్యుత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులు సుమారు 290పైగా మార్కులు సాధించే అవకాశం ఉందని తెలిపారు. షిఫ్టు-1లో రసాయన శాస్త్రంలో ఆర్గానిక్, ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీకి ప్రాధాన్యం ఇచ్చారని శ్రీ విద్య సంస్థల ఐఐటీ గణిత నిపుణులు విఘ్నేశ్వరరావు వెల్లడించారు. షిఫ్టు-2 భౌతిక శాస్త్రం నుంచి ఆధునిక భౌతిక శాస్త్రం, విద్యుదయస్కాంతత్వం నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చాయని పేర్కొన్నారు.



ఉద్యోగ జీవితం భద్రంగా ఉండాలంటే..

అధునాతన సాంకేతికత కారణంగా అన్ని రంగాల తీరుతెన్నులు శరవేగంగా మారుతున్నాయి. ఎప్పటికప్పుడు కొత్త టూల్స్ పుట్టుకొస్తున్నాయి. ఇప్పుడున్న ఉద్యోగ నైపుణ్యాలు పనికిరాకుండా పోతున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా మిమ్మల్ని మీరు సంసిద్ధులను చేసుకుంటేనే భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. నిత్య విద్యార్థిలా ఉంటూ నేర్చుకోవడం అలవాటుగా మార్చుకోవడమే ఏకైక మార్గం.

–టొలులోప్ మైఖేల్, అంత్రప్రెన్యూర్

నేటి నుంచి 'ఏకాత్మ మానవ దర్శన్ పునఃస్మరణ'

ఈనాడు, అమరావతి: విజయవాడలో 1965లో జరిగిన జనసంఘ్ మహాసభల స్మృతులను స్మరించుకునేలా 'ఏకాత్మ మానవ దర్శన్ పునఃస్మరణ' సదస్సు జరగనుంది. విజయవాడలోని ... శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్న ఈ సదస్సుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భాజపా మూల సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఇచ్చిన ఏకాత్మ మానవ దర్శనాన్ని పార్టీ అధికారిక మార్గదర్శక సిద్ధాంతంగా విజయవాడలోనే ప్రకటించారు. ఆ సందర్భానికి 60 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో భాజపా ఈ పునఃస్మరణ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. సదస్సు తొలిరోజు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, భాజపా జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, పార్టీ సీనియర్ నేత రామ్ మాధవ్, చరిత్రకారుడు ముడిగొండ శివప్రసాద్, ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు. రెండోరోజు భాజపా సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ ఇతర ప్రముఖులు హాజరవుతారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఇతర నాయకులు గురువారం సదస్సు ఏర్పాట్లు పరిశీలించారు.

విజయ్ పార్టీకి విజిల్

- ఎంఎన్ఎంకు టార్చిలైట్
- తమిళనాట పార్టీలకు చిహ్నాలు కేటాయించిన ఈసీ

చెన్నై, న్యూస్‌టుడే: రాబోయే తమిళనాడు శాసనసభ ఎన్నికలకు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)కు విజిల్ గుర్తును, ఎంపీ కమల్‌హాసన్ నేతృత్వంలోని మక్కల్ నీది మయ్యం(ఎంఎన్ఎం) పార్టీకి టార్చిలైట్ గుర్తును ఎన్నికల కమిషన్ కేటాయించింది. ఎంఎన్ఎం పార్టీ 2019లో తొలిసారి పోటీ చేసినప్పుడూ టార్చిలైట్ గుర్తునే కేటాయించింది.

మూడు ముక్కల్లో ముగిసిన గవర్నర్ ప్రసంగం

- కర్ణాటక అసెంబ్లీలో కలకలం
- గహ్లోత్ తీరుపై భగ్గుమన్న కాంగ్రెస్



కర్ణాటక శాసనసభ నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోతున్న గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్.. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ సభ్యులు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ రాష్ట్ర విధానసభలో ప్రసంగాన్ని రెండు వరుసలే చదివి సభ నుంచి నిష్క్రమించడం దుమారం రేపింది. మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగంలో కొన్ని అభ్యంతరకర అంశాలున్నాయని, వాటిని తొలగించాలని గవర్నర్ సూచించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆయన అర్ధాంతరంగా వెళ్లిపోయారు. కొత్త ఏడాదిలో తొలి విధానసభ సమావేశాల ప్రారంభ సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించేందుకు గవర్నర్ గురువారం అసెంబ్లీకి వచ్చారు. 'సభ్యులందరికీ స్వాగతం. మరోసారి అసెంబ్లీలో ప్రసంగించే అవకాశం దక్కినందుకు సంతోషంగా ఉంది. మా ప్రభుత్వం ఆర్థిక, సామాజిక, భౌతిక ప్రగతిని ద్విగుణీకృతం చేసే దిశగా కట్టుబడి ఉంది. జైహింద్, జై కర్ణాటక' అని మూడు వాక్యాల్లో ముగించి బయటకు నడిచారు. అధికారపక్ష సభ్యులు గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగాన్ని చదవకుండా వదిలేసి గవర్నర్ సభను అగౌరవపరిచారని, రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధ్వజమెత్తారు. రాజ్యాంగంలోని 176, 163 ఆర్టికల్స్ ప్రకారం ఏటా మంత్రివర్గం తయారు చేసిన ప్రసంగాన్ని గవర్నర్ చదివి తీరాల్సిందేనన్నారు. రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఉపాధి హక్కుకు భంగం కలిగించేలా కేంద్రం అమలు చేసిన 'వీబీ జీ రామ్ జీ' పథకాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించిందని చెప్పారు. గవర్నర్ చర్యలను సుప్రీంకోర్టులో సవాలు చేసేందుకు న్యాయ నిపుణులతో చర్చిస్తున్నట్లు సీఎం వెల్లడించారు.

అభ్యంతరకర అంశాలున్నాయి.. తొలగించాలన్న గవర్నర్

మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగంలో 'రాష్ట్ర ఆర్థిక దుస్థితికి కేంద్రమే కారణం. వీబీ జీ రామ్ జీతో గ్రామీణ ప్రజల పరిస్థితి దయనీయంగా మారుతోంది. సమైక్య వ్యవస్థను కేంద్రం దెబ్బతీస్తోంది' అనే అంశాలున్నాయి. వీటిని తొలగించాలని గవర్నర్ బుధవారమే సూచించారు. శాసనసభ వ్యవహారాల మంత్రి నేతృత్వంలోని బృందం కలిసి వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించినా ఆయన అంగీకరించలేదు. తాను సూచించిన అంశాలను సవరించని కారణంగా ప్రసంగాన్ని పూర్తిగా చదవకుండానే సభ నుంచి వెళ్లిపోయారు. గవర్నర్ ప్రసంగాన్ని ఆమోదిస్తున్నట్లు స్పీకర్ యూటీ ఖాదర్ రూలింగ్ ఇచ్చారు. తమిళనాడు, కేరళ గవర్నర్లూ ఇదే రీతిలో రాష్ట్ర ప్రభుత్వంపై కినుక ప్రదర్శించడం తెలిసిందే.

'మౌంట్ ఏకాంకాగ్వా'ను అధిరోహించిన శాప్ ఎండీ



'ఏకాంకాగ్వా' శిఖరంపై ఎస్.భరణి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: దక్షిణ అమెరికాలోని అత్యంత ఎత్తయిన పర్వతం 'మౌంట్ ఏకాంకాగ్వా' (6,962 మీటర్లు)ను రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఎండీ ఎస్.భరణి అధిరోహించారు. ఈ మేరకు శాప్ కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. "శాప్ ఎండీగా ఉన్న ఓ అధికారిణి తొలిసారిగా ఏకాంకాగ్వా శిఖరాన్ని అధిరోహించడం చరిత్రాత్మకం. ఆమె క్రీడాకారులు, యువతకు ప్రేరణగా నిలిచారు" అని కొనియాడింది.

ఎల్ఆర్ఎస్ గడువు మరో 3 నెలల పెంపునకు ప్రతిపాదనలు

ఈనాడు, అమరావతి: అనుమతులు లేని లేఔట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకోవడానికి మరో 3 నెలలు గడువు పొడిగించాలని అధికారులు ప్రతిపాదించారు. లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్)లో దరఖాస్తులు చేసుకోవడానికి ప్రభుత్వం ప్రకటించిన గడువు శుక్రవారంతో ముగియనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 53 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. మరో 25 వేల వరకు రావొచ్చని అధికారుల అంచనా. ఈ క్రమంలోనే పట్టణ స్థానిక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థల నుంచి గడువు పెంపునకు విజ్ఞప్తులు వస్తుండటంతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

వైద్య విద్య పరీక్షల్లో పారదర్శకత పెంచేలా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం

ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీలో ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్న సత్యకుమార్

ఈనాడు, అమరావతి: వైద్య విద్య పరీక్షల్లో పారదర్శకత పెంచేలా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ఏర్పాటుచేసినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలోని ఎన్టీఆర్ విజ్ఞాన విశ్వవిద్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మంత్రి గురువారం ప్రారంభించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'రాష్ట్రంలోని 37 ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో జరిగే వైద్య విద్య యూజీ, పీజీ వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల తీరును ఈ కేంద్రం నుంచి పర్యవేక్షిస్తారు. కొత్త వ్యవస్థ ఏర్పాటుతో కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్‌లకు అవకాశం ఉండదు. ప్రస్తుతం ఐదు వైద్య కళాశాలల్లో జరిగే పరీక్షలను ఈ కేంద్రం ద్వారా గురువారం నుంచి పరిశీలిస్తున్నారు' అని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు

‘సంచార్ సాథీ’ యాప్ ద్వారా రాష్ట్రంలో 46,488 ఫోన్ల రికవరీ

టెలికాం అడిషనల్ డైరెక్టర్ జనరల్ నగేశ్‌రావు

ఈనాడు, అమరావతి : పోలీసుశాఖ సహకారంతో సంచార్ సాథీ యాప్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో చోరీకి గురైన మొబైల్ ఫోన్లలో 46,488 ఫోన్లు రికవరీ చేసినట్లు టెలికాం శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ నగేశ్‌రావు తెలిపారు. ఈ యాప్‌లోని చక్షు విభాగం ద్వారా మోసపూరిత కాల్స్, ఎస్ఎంఎస్‌లు ఏ నంబర్ల నుంచి వస్తున్నాయో గుర్తించి వాటిని బ్లాక్ చేస్తున్నట్లు వివరించారు. అలా దేశవ్యాప్తంగా 36,49,493 మొబైల్ నంబర్లను గుర్తించి.... 17,27,096 కనెక్షన్లు తొలగించామన్నారు. సంచార్ సాథీ యాప్ ద్వారా పౌరుల వ్యక్తిగత సమాచారం తీసుకుంటున్నారనే ఆరోపణలు పూర్తి అవాస్తవమని వెల్లడించారు. విజయవాడలోని టెలికాం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

సిట్ ఎదుట హాజరుకు మిథున్‌రెడ్డికి మినహాయింపు

ఉత్తర్వులిచ్చిన విజయవాడ ఏసీబీ కోర్టు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో సిట్ ఎదుట వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి రెండు రోజుల హాజరు విషయంలో కోర్టు మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టు గురువారం ఉత్తర్వులిచ్చింది. తనకు జనవరి 23న పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశం ఉందనీ, 26న దిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనాల్సి ఉందనీ. . ఈ రెండు తేదీల్లో సిట్ ఎదుట హాజరు విషయంలో మినహాయింపు ఇవ్వాలని ఇటీవల మిథున్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు రోజులకు మినహాయింపు ఇస్తూ న్యాయాధికారి భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో అనిల్ చోఖ్రా, రోనక్‌ల బెయిల్ పిటిషన్లపై విచారణ ఈ నెల 27కు వాయిదా పడింది. వెన్నునొప్పికి ప్రకృతి చికిత్సకు అనుమతించాలన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి పిటిషన్‌పై తీర్పు శుక్రవారానికి వాయిదా పడింది.

రాష్ట్రాన్ని అప్పులపాల్జేస్తున్న తీరును పార్లమెంట్‌లో ప్రస్తావించండి

వైకాపా ఎంపీలతో మాజీ సీఎం జగన్

ఈనాడు, అమరావతి: ‘ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మారుస్తోంది. అప్పుల కోసం రాజ్యాంగాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తండి’ అని వైకాపా ఎంపీలకు ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సూచించారు. గురువారం ఎంపీలతో తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ‘రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై సమగ్ర నివేదికను జాతీయ ఎస్సీ కమిషన్‌కు అందజేయాలని ఎంపీలకు చెప్పారు. ‘రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన సాగుతోంది. రాజకీయ కక్ష సాధింపులు పెరిగిపోయాయి. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు చేస్తున్న అన్యాయాన్ని పార్లమెంట్ వేదికగా ఎండగట్టాలి. ప్రజల హక్కులను కాలరాస్తున్న తీరును కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి’ అని జగన్ సూచించారు.

గ్రహం అనుగ్రహం

23–1–2026 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘమాసం, శుక్లపక్షం

పంచమి: రా. 12-30 తదుపరి షష్ఠి

పూర్వాభాద్ర: మ. 2-00 తదుపరి ఉత్తరాభాద్ర

వర్జ్యం: రా. 11-19 నుంచి 12-52 వరకు

అమృత ఘడియలు: ఉ. 7-40 వరకు

దుర్ముహూర్తం: ఉ. 8-51 నుంచి 9-36 వరకు తిరిగి మ. 12-34 నుంచి 1-18 వరకు

రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు

సూర్యోదయం: ఉ.6.38; **సూర్యాస్తమయం:** సా.5.46

శ్రీ పంచమి

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	11.5	29.8
అనంతపురం	15.0	32.3
విజయనగరం	16.0	29.0
హైదరాబాద్	16.7	27.7
కర్నూలు	16.7	31.5
కడప	17.0	29.0
రాజమహేంద్రవరం	17.0	33.5
విశాఖపట్నం	17.6	30.2
తాడేపల్లిగూడెం	18.0	30.0
విజయవాడ	18.2	29.5
నరసాపురం	18.8	31.4
శ్రీకాకుళం	19.0	29.0
గుంటూరు	19.0	30.0
ఒంగోలు	20.0	29.5
నెల్లూరు	20.0	30.6

ఇదీ సంగతి!



ఇంకెంత.. సంవత్సరంన్నరే కదా.. అప్పుడు బయటికి వస్తారు.. కలుద్దువు!!





శిరివెళ్ల మెట్ట సమీపంలో కాలిపోతున్న బస్సు ◆కంటెయినర్‌లో కాలిపోయిన ద్విచక్రవాహనాలు ◆ట్రావెల్స్ బస్సులో కిరోసిన్ స్టవ్‌లు

టైరు పేలి స్లీపర్ బస్సు దగ్ధం

(మొదటి పేజీ తరువాయి)



బస్సు డ్రైవర్ ఓబులేసు



కంటెయినర్ డ్రైవర్ అభిషేక్



కంటెయినర్ రెండో డ్రైవర్ నవీన్‌కుమార్

ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడగా, 36 మంది ప్రాణాలతో బయటపడ్డారు. కొంత కాలంగా స్లీపర్ బస్సుల్లో వరుస ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో.. ఈ దుర్ఘటన తీవ్ర భయాందోళన రేపింది. తాము అప్పటిదాకా ప్రయాణించిన బస్సు.. క్షణాల్లో అగ్నికీలల్లో కాలి బూడిదైపోయిన వైనాన్ని చూసిన ప్రయాణికులు షాక్ నుంచి తేరుకోలేకపోయారు. పోలీసులు, ప్రయాణికుల కథనం మేరకు..ఏఆర్‌బీసీవీఆర్ ట్రావెల్స్ స్లీపర్ బస్సు బుధవారం రాత్రి 8.20 గంటలకు నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు బయల్దేరింది. అర్ధరాత్రి దాటాక 1.05 గంటల సమయంలో నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం శిరివెళ్ల మెట్ట వద్ద బస్సు ముందుభాగం కుడి వైపు టైరు ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో బస్సు అదుపు తప్పింది. ఆ సమయంలో వేగంగా ప్రయాణిస్తుండడంతో డివైడర్ మీదుగా అటుపక్క దారిలోకి పడిపోయింది. అదే సమయంలో ఎలక్ట్రిక్ వాహనాలతో కర్నూలు నుంచి కడప వైపు వెళ్తున్న కంటెయినర్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ భాస్కర్ అలియాస్ ఓబులేశ్(37), కంటైనర్ డ్రైవర్ అభిషేక్(25), రెండో డ్రైవర్ నవీన్‌కుమార్(25) దుర్మరణం చెందారు. నవీన్‌కుమార్ మృతదేహాన్ని బయటకు తీసినప్పటికీ, ఇరు వాహనాల డ్రైవర్లు క్యాబిన్లలోనే సజీవ దహనమయ్యారు. మృతులు ముగ్గురూ కడప వాసులే. కంటెయినర్, బస్సు యజమానులిద్దరిదీ వైఎస్సార్ కడప జిల్లాగా గుర్తించారు.

అత్యవసర ద్వారాలు తెరిచి..

ప్రమాద తీవ్రతకు మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన బస్సు క్లీనర్ వెంటనే కిందకు దూకేసి, రాడ్డుతో బస్సు అద్దాలన్నీ బద్దలుకొట్టి ప్రయాణికులను అప్రమత్తం చేశారు. బస్సు వెనక వైపున్న రెండు అత్యవసర ద్వారాలూ తెరిచాడు. దీంతో బస్సులోని 36 మంది ప్రయాణికులు స్థానికుల సహకారంతో కిందకు దూకేశారు. ఈ క్రమంలో నలుగురు గాయపడ్డారు. ఆ తర్వాత కొద్ది క్షణాల్లోనే మంటలు చెలరేగి బస్సు పూర్తిగా దగ్ధమైంది. పలువురు ప్రయాణికుల లగేజీ కూడా కాలిపోయింది.

కారణాలపై నిపుణుల పరిశీలన

◆ బస్సు టైర్ పేలడానికి కారణాలను అధికారులు అన్వేషిస్తున్నారు. కాలం చెల్లిన/ రీబటన్ చేసిన టైరును వాడారా అని ఆరా తీస్తున్నారు. టైర్లు పూర్తిగా కాలిపోగా, వాటిలోని సన్నని ఇనుప చువ్వలు మాత్రమే మిగిలాయి.

◆ రెండు వాహనాల ఇంజిన్లూ వేడిగా ఉండడం, పరస్పరం ఢీకొన్న సమయంలో బస్సు కింది భాగంలో మంటలు చెలరేగి క్షణాల్లోనే వ్యాపించాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

◆ బస్సులో మూడు కిరోసిన్ స్టవ్‌లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిలో నింపిన కిరోసిన్‌తో పాటు రీఫిల్ కోసం విడిగా బాటిల్‌లో కిరోసిన్ నిల్వ చేసినట్లు భావిస్తున్నారు. బస్సు పూర్తిగా కాలిపోవడంతో ఆ కిరోసిన్ డబ్బా ఎక్కడా కనిపించలేదు. బస్సు డీజిల్ ట్యాంక్ నుంచి అవసరమైనప్పుడు ఆ స్టవ్‌లలో డీజిల్ పోస్తున్నట్లు కొందరు పోలీసులకు చెప్పారు.

◆ హైదరాబాద్ నుంచి 32 ‘వర్కాస్’ ఎలక్ట్రిక్ వాహనాలతో కంటెయినర్ బయల్దేరగా, కర్నూలులో 16 వాహనాలను డీలర్‌కు అప్పగించారు. మరో 16 వాహనాలను వైఎస్సార్ కడప జిల్లాలోని పోరుమామిళ్లలో దింపాల్సి ఉంది. ఈ ఘటనలో ఎలక్ట్రిక్ వాహనాలన్నీ దగ్ధమయ్యాయి. వాటిలోని బ్యాటరీలు పేలి ప్రమాద తీవ్రత పెరిగినట్లు అంచనా వేస్తున్నారు.

◆ ప్రమాదం జరిగిన సుమారు 45 నిమిషాలకుగానీ అగ్నిమాపక శకటాలు రాలేదు. సకాలంలో మంటలు నియంత్రించి ఉంటే, లగేజీ అయినా దక్కేదని ప్రయాణికులు వాపోయారు.

–ఈనాడు–కర్నూలు; న్యూస్‌టుడే–శిరివెళ్ల, నంద్యాల నేరవిభాగం

అమ్మో.. ఆ సీటే ఉండి ఉంటే!

ఈనాడు, నెల్లూరు: కర్నూలు నగర శివారులో గతేడాది అక్టోబరు 24న జరిగిన బస్సు ప్రమాదంలో 19 మంది చనిపోయారు. ఆ దుర్ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. నిబంధనలు పాటించని ప్రైవేట్ ట్రావెల్స్‌పై కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఆ సమయంలో అధికారులు నెల్లూరు జిల్లాలో 36 బస్సులను సీజ్ చేశారు. వాటిలో తాజాగా నంద్యాల జిల్లాలో ప్రమాదానికి గురైన బస్సు కూడా ఒకటి కావడం గమనార్హం! అప్పట్లో చేపట్టిన తనిఖీల్లో భాగంగా ఈ బస్సులో డ్రైవర్ క్యాబిన్‌లో రెండో డ్రైవర్ పడుకునేందుకు అమర్చిన బెర్త్‌ను అధికారులు తొలగించారు. గురువారం జరిగిన ప్రమాదంలో బస్సు, లారీ క్యాబిన్లు రెండూ నుజ్జునుజ్జయ్యాయి. ఇరు వాహనాల్లోని డ్రైవర్లు దుర్మరణం చెందారు. గతంలో మాదిరిగా ఈ బస్సులో రెండో డ్రైవర్ నిమిత్తం అమర్చిన బెర్త్ ఉండి ఉంటే.. మరొకరి ప్రాణాలకూ ముప్పు ఉండేదని అధికారులు చెబుతున్నారు. పైగా ప్రమాద సమయంలో ఇంతమంది వేగంగా బయటకు వచ్చేందుకు వీలుండేది కాదని అభిప్రాయపడ్డారు.

సమీక్ష సమావేశంలో కుప్పకూలిన ఎస్ఈ

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి



సమీక్షలో ఎస్ఈ గోవిందరావుతో మాట్లాడుతున్న కొమ్మారెడ్డి పట్టాభిరామ్. చిత్రంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు



కుప్పకూలిన గోవిందరావు

గాజువాక, న్యూస్‌టుడే: మహావిశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) గాజువాక జోనల్ కార్యాలయంలో గురువారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో విషాదం చోటుచేసుకుంది. ఛైర్మన్ ప్రశ్నలకు బదులిచ్చే క్రమంలో గుండెపోటుకు గురైన మెకానికల్ సెక్షన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) గోవిందరావు (59) అక్కడే కుప్పకూలి అపస్మారక స్థితికి చేరుకున్నారు. సపర్యలు చేసి వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, అతని ప్రాణాలు నిలవలేదు. గాజువాకలో జనావాసాల మధ్యనున్న డంపింగ్ యార్డులో రోజుల తరబడి చెత్త పేరుకుపోవడంతో వారం రోజులుగా స్థానికులు ధర్నా చేస్తున్నారు. ఈనెల 19న గేటుకు తాళం వేసి, చెత్త వాహనాలు రాకుండా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ గుత్తేదారుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? కొత్త గుత్తేదారుకు ఏ లెక్కన టెండర్ ఇచ్చారు? ఈ యార్డు నుంచి చెత్తను తరలించడానికి రోజూ ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయి? అన్న అంశాలపై పట్టాభిరామ్.. ఎస్ఈ గోవిందరావును వివరణ అడిగారు. అప్పటికే ఒత్తిడితో ఉన్న ఎస్ఈ.. సమాధానమిచ్చిన కాసేపటికి కొబ్బరి నీరు తాగి సేదదీరారు. అంతలోనే అస్వస్థతకు గురై వెనక్కి కుప్పకూలిపోయారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వెంటనే వైద్యుల్ని రప్పించారు. వారు వచ్చి గుండెపోటుగా గుర్తించి సీపీఆర్ చేశారు. గాజువాకలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ హఠాత్పరిణామంతో పట్టాభిరామ్, పల్లా శ్రీనివాసరావు ఖిన్నులై, సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి ఆసుపత్రికి వెళ్లారు. గోవిందరావును పరామర్శించారు. గుండెపోటుతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో మెరుగైన చికిత్స నిమిత్తం మరో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆయన సాయంత్రానికి మరణించారు. గోవిందరావు కుటుంబసభ్యులు, జీవీఎంసీ ఉద్యోగులు విషాదంలో మునిగిపోయారు. ఇది దురదృష్టకరమని, పాజిటివ్‌గా మాట్లాడుతూనే ఒక్కసారిగా కుప్పకూలడం ఊహించలేకపోయామని పట్టాభిరామ్ తదితరులు విచారం వ్యక్తంచేశారు.

బ్రిటిష్ వాళ్ల తర్వాత భూ సర్వే చేసింది నేనే

- ఆ మహాయజ్ఞాన్ని అడ్డుకునేందుకు కుట్ర చేసిన చంద్రబాబు
- నిషేధిత జాబితాల్లోని భూములపై వాటి యజమానులకు హక్కు కల్పించిందీ నేనే
- మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా స్పీకర్‌ను ఎవరు ఆపారు?
- మాజీ సీఎం జగన్

ఈనాడు, అమరావతి: ‘బ్రిటిష్ వాళ్లు ఎప్పుడో 1923లో భూ సర్వే చేస్తే.. 2019లో మేం అధికారంలోకొచ్చాకనే సమగ్ర రీ సర్వే చేశాం. ఆ మహాయజ్ఞాన్ని రాక్షసుడిలా అడ్డుకునేందుకు చంద్రబాబు కుట్రలు చేశాడు’ అని మాజీ సీఎం జగన్ తెలిపారు. ‘సర్వేలో 2 విమానాలు, 4 హెలికాప్టర్లు, 200 డ్రోన్లు ఉపయోగించాం, 40 వేల మంది వీఆర్‌ఓలు, సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు 70 సార్లు శిక్షణనిప్పించాం. కోట్ల సర్వే రాళ్లను ఉచితంగా గ్రామాలకు సరఫరా చేశాం. 2024 ఎన్నికల నాటికే 6,800 గ్రామాల్లో సర్వే చేసి, తప్పుల్లేకుండా క్యూఆర్ కోడ్‌తో కూడిన పాస్ పుస్తకాలను 30 లక్షల మంది రైతులకిచ్చాం’ అని వివరించారు. గురువారం జగన్ తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 2016, 2017లో చంద్రబాబు హయాంలో నిషేధిత జాబితాలోకి ఎక్కించిన భూములను అందులోంచి తొలగించి వాటి యజమానులకు హక్కులను కల్పించిందీ మేమేనని జగన్ చెప్పారు.

ముఖ్యమంత్రిపై దూషణలు

ప్రెస్‌మీట్‌లో జగన్.. సీఎం చంద్రబాబు గురించి పలుమార్లు ప్రస్తావిస్తూ, ఏక వచనంతో



దూషణలు చేశారు. ‘ఈ మనిషి నాయకుడు కాదు. పాలకుడూ కాదు. అన్నీ చెడ్డ గుణాలున్న తప్పుడు మనిషి. భూ సర్వే అంటే ఏంటో కూడా ఈ మనిషికి తెలియదు. చంద్రబాబును సూటిగా అడుగుతున్నా 80 ఏళ్లున్న నువ్వు ఎప్పుడైనా ఇలాంటివి విన్నావా? చూశావా? చేశావా? మేం రీ సర్వే చేసి కోట్ల హద్దు రాళ్లను పాతించాం. వాటిపైనున్న పథకం పేరును ఇప్పుడు రూ.కోట్లు పెట్టి తుడిపిస్తున్నాడు. అంత పనికిమాలినోడు చరిత్రలో ఎవడూ ఉండడు. ఆయన కొడుకు వయసున్న నాతో పోటీకి అవస్థ పడుతున్నాడు. ఇంత దారుణంగా క్రెడిట్ చోరీ చేయగలిగిన వ్యక్తి భూ మండలంపై ఇంకొకడెవరైనా ఉండగలడా’ అని సీఎంపై విరుచుకుపడ్డారు.

కోర్టులపై ఒత్తిడి తెస్తాం: ‘పిన్నెల్లిలో వైకాపా కార్యకర్త సాల్మన్ హత్య కేసులో అక్కడి సీఐ, ఎస్ఐ, తెదేపా ఎమ్మెల్యే, చంద్రబాబూ దోషులే. కోర్టులపై ఒత్తిడి తెస్తాం. పిన్నెల్లిని వీడిన 300 కుటుంబాలు కోర్టు రక్షణతో తిరిగి గ్రామంలోకి ప్రవేశిస్తాయి. చంద్రబాబు ఇప్పుడు నాటిన విత్తనాలు వృక్షాలైతే ఎలా ఉంటుందో ఆయనకూ తెలుస్తుంది’ అని జగన్ వ్యాఖ్యానించారు.

అంత పేదవాళ్లెవరూ లేరు: సభకు రాని ఎమ్మెల్యేలకు ‘నో వర్క్ నో పే’, ‘రీ కాల్’ చేయాలని స్పీకర్ అంటున్నారు కదా అని విలేకర్లు అడగ్గా.. ‘అసెంబ్లీలో మేం తప్ప వేరే ప్రతిపక్ష పార్టీ ఉందా ? అలాంటప్పుడు మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా స్పీకర్‌ను ఎవరు ఆపారు ? సభానాయకుడితో సమానంగా మాకూ మాట్లాడే సమయమివ్వకుండా.. సభలోని 175 మందితో సమానంగా ఇస్తామంటే వెళ్లి ఏం చేయాలి’ అని జగన్ అన్నారు. ‘నో వర్క్ నో పే’ గురించి మాట్లాడుతూ. . ‘ఎవరూ పేదవాళ్లు కారు.. దాని గురించి అడగాలని కోరుకోవడం లేదు’ అని జగన్ చెప్పారు.

జగన్‌కు ఉన్నది క్రిమినల్ క్రెడిట్.. దాన్నెవరైనా చోరీ చేస్తారా?

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ క్రెడిట్‌ను చోరీ చేయాల్సిన దుర్గతి తమకు లేదని, కోడికత్తి, గులకరాయి, బాబాయి-గొడ్డలి. . ఇవే ఆయన క్రెడిట్ అని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎద్దేవా చేశారు. జగన్‌కు ఉన్న ఇలాంటి క్రిమినల్ క్రెడిట్‌ను ఎవరైనా చోరీ చేస్తారా? అని ప్రశ్నించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సత్యప్రసాద్ విలేకర్లతో మాట్లాడారు. “అబద్ధాలను అలవాటుగా చేసుకున్న జగన్ మరోసారి రీసర్వేపై విషం కక్కారు. 2018లో తెదేపా ప్రభుత్వంలో భూధార్ అని పెట్టింది. అప్పుడే అత్యాధునిక సాంకేతికతతో రీసర్వే చేసేందుకు ఆర్వోఆర్ చట్టంలో మార్పులు తీసుకొస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చాం. కానీ, జగన్ మాత్రం తనే రీసర్వేను కనిపెట్టినట్లు మాట్లాడుతున్నారు. వైకాపా ప్రభుత్వం రీసర్వేను తప్పుల తడకగా చేసింది. అందుకే మా ప్రభుత్వానికి 2.7 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ల్యాండ్ టైట్లింగ్ యాక్టును అడ్డుపెట్టుకొని ప్రజల భూములను భక్షించేందుకు రీసర్వేను నీరుగార్చారు. వైకాపా నేతలకు విక్రయించకపోతే ఆ భూములను నిషేధిత జాబితాలో పెట్టారు. రెవెన్యూ క్లినిక్‌లతో ‘22ఏ’ భూములను చాలా వరకు నిషేధిత జాబితా నుంచి తొలగించాం. హద్దు రాళ్లపై జగన్ బొమ్మలు వేసేందుకు రూ.700 కోట్లు దుర్వినియోగం చేశారు. జగన్ తీసుకొచ్చింది ‘జగనన్న భూరక్ష’ కాదు.. అది భూభక్ష పథకం’ అని పేర్కొన్నారు.

దృష్టి మరల్చడానికే జగన్ సమావేశం

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధ్వజం

ఈనాడు, అమరావతి : మద్యం కుంభకోణంలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిలను ఈడీ విచారిస్తున్న నేపథ్యంలో... దాన్నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే వైకాపా అధినేత జగన్ ప్రెస్‌మీట్ పెట్టి అబద్ధాలు వల్లెశారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. వైకాపా ప్రభుత్వంలో 5 లక్షలకు పైగా అసైన్డ్ భూములు కబ్జా అయ్యాయని ఆరోపించారు. సర్వే రాళ్లు, పాస్‌పుస్తకాలపై ఫొటోలు వేసుకోవడం కోసం రూ.700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది నిజం కాదా? అని జగన్‌ను ప్రశ్నించారు. మీ హయాంలో భూముల రీ సర్వేలో అవకతవకలు జరగకపోతే.. ప్రస్తుతం 70 శాతానికి పైగా ఫిర్యాదులు వాటిపైనే ఎందుకు వస్తున్నాయని గురువారం ఓ ప్రకటనలో నిలదీశారు. వైకాపా ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలు, అక్రమాలపై పలు ప్రశ్నలు సంధించారు. “మీ భూ కబ్జాల్ని కప్పిపెట్టుకోవడానికి మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలోని దస్త్రాల్ని తగలబెట్టించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టం తెచ్చి కబ్జాలకు భారీ కుట్ర చేశారు. సొంత చిన్నాన్నను చంపిన వారిని కాపాడుతున్నారు” అని పల్లా ఆరోపించారు. పల్నాడు ప్రాంతాన్ని అరాచకాలకు అడ్డాగా మార్చిన పిన్నెల్లి సోదరులు 12 మందిని పొట్టన పెట్టుకున్నారని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. దావోస్‌కు వెళ్లి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పెద్దఎత్తున పెట్టుబడులు సాధించడాన్ని చూసి జగన్ ఓర్చుకోలేకపోతున్నారని మండిపడ్డారు.

ఈనాడు

ప్రపంచ శాంతికి ట్రంప్ ప్రమాదం!

ఎప్పుడో 1787లో ఫిలడెల్ఫియా భేటీలో అమెరికా రాజ్యాంగం మీద సంతకం చేసి వస్తున్న బెంజమిన్ ఫ్రాంక్లిన్‌ను ఎలిజబెత్ పావెల్ అనే మహిళ ఓ ప్రశ్న అడిగారు- 'సమావేశంలోని ప్రతినిధులు రాచరికానికి ఓటేశారా... గణతంత్రాన్ని ఎంచుకున్నారా?' అని! 'గణతంత్రమే... మీరు దాన్ని నిలబెట్టుకోగలిగితే' అని ఫ్రాంక్లిన్ బదులిచ్చారు. విశ్వమంతటికీ ఆదర్శప్రాయమైన ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగా ఎదగాలి తప్ప ప్రపంచాన్ని భయపెట్టే సామ్రాజ్యవాద శక్తిగా తమ దేశం మారకూడదని అమెరికా జాతినిర్మాతలు ఆశించారు. విదేశాలతో నిజాయతీగా స్నేహసంబంధాలు, శాంతియుతంగా వాణిజ్య సంబంధాలు నెరపుతూ మానవాళి సౌభాగ్యానికి పాటుపడాలని జార్జి వాషింగ్టన్, థామస్ జెఫర్సన్ వంటివారు తమ రాబోయే తరాలకు పిలుపిచ్చారు. వారి కలలను కాలరాస్తూ ఆధిపత్యవాదానికి మారుపేరుగా తయారైన అమెరికా- కిందటి శతాబ్దంలో ఎన్నో దేశాల్లో లెక్కలేనన్ని రాజకీయ, సైనిక కుట్రలకు ఘాతుకాలకు తెగబడింది. అదే వికృత చరిత్ర ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ జమానాలో మరింత ఉద్ధృతంగా పునరావృతమవుతోంది. అసత్యాలపై ఆధారపడిన కుటిల రాజకీయ భావజాలం, విస్తరణవాదం, యుద్ధప్రియత్వం, అసమ్మతిని అణచివేయడం, ప్రత్యర్థులను వేటాడటం, ఆర్థిక లాభాలకోసం ఎంతకైనా తెగించడం వంటి అవలక్షణాలకు పేరుమోసిన ట్రంప్- అంతర్జాతీయ శాసనాలూ ప్రజాతంత్ర సంప్రదాయాలను కసిగా కాలరాస్తున్నారు. పరాయి దేశాల సార్వభౌమత్వ హక్కులకు పూచికపుల్ల పాటి విలువ ఇవ్వకుండా ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తూ ప్రపంచాన్ని పెనుఉద్రిక్తతల వైపు నెట్టుకుపోతున్నారు!

ప్రపంచ యుద్ధాలు ఒకేసారి సామూహిక హత్యాకాండలతో మొదలుకావు. అతిజాతీయవాదం, అహంకారం, స్వార్థ ప్రయోజనాలకోసం అంతర్జాతీయ కట్టుబాట్లను కాలదన్నడం, బలాధిక్యతను బూచిగా చూపించి ప్రపంచ నియమాలను తిరగరాయాలనుకునే విపరీత మనస్తత్వం వంటివి అగ్రరాజ్యాల పాలకుల్లో ఎగదన్నితే- అవే వినాశకర సమరాలకు ఆజ్యంపోస్తాయి. దాదాపు పది కోట్ల మంది ప్రాణాలను పొట్టన పెట్టుకున్న రెండు ప్రపంచ యుద్ధాలూ అలాగే ఆరంభమయ్యాయి. అంతర్జాతీయ వ్యవస్థలను లెక్కచేయని ట్రంప్ దురహంకారం మూలంగా నేడవే ఆందోళనకర పరిస్థితులు ముప్పిరిగొంటున్నాయి. ఒక అంచనా ప్రకారం మొత్తం 4.4లక్షల కోట్ల డాలర్ల విలువైన ఖనిజరాశికి నిలయమైన గ్రీన్‌లాండ్‌ను ఎలాగైనా గుప్పిటపట్టే తీరతామంటున్న ట్రంప్ వదరుబోతు వ్యాఖ్యలు యూరప్ దేశాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అగ్రరాజ్యాధిపతికి జీ హుజూర్ అనడానికి తామేమీ బానిసలం కాదని అవి ఆత్మగౌరవ ప్రకటనలు చేస్తున్నాయి. దాంతో సుంకాల బెదిరింపుల భాష నుంచి ట్రంప్ కాస్త వెనక్కితగ్గినప్పటికీ ఆయన చపలచిత్తంతో చివరికి పరిస్థితులు ఎలా పరిణమిస్తాయన్నదే అందరినీ కలవరపరుస్తోందిప్పుడు!

అవాస్తవ ప్రచారంలో ఆరితేరిన డొనాల్డ్ ట్రంప్- అమెరికా అధ్యక్షుడిగా తన తొలి పాలనాకాలంలోనే 30,573 అబద్ధాలు తప్పుడు సమాచారాలను వల్లెవేశారని అక్కడి పత్రికలు లెక్కగట్టాయి. రెండోసారి అధికారంలోకి వచ్చాక వివిధ దేశాల్లో ఆయన చేయించిన వైమానిక, డ్రోన్ దాడులు నిరుడు సంవత్సరాంతానికే 622కు చేరాయి. డ్రగ్స్ సరఫరా అడ్డగింత పేరిట సముద్ర జలాల్లో హత్యాకాండలు, అక్రమ వలసదారుల ఏరివేత నెపంతో మానవహక్కుల ఉల్లంఘనలు... ఇలా చెప్పుకుంటూ వెళ్తే ట్రంప్ పాపాలు అన్నీఇన్నీ కావు. స్వేచ్ఛా సమానత్వాలను హరిస్తున్న ఆయన నిరంకుశ పాలనను అమెరికన్ సమాజమే గట్టిగా నిరసించాలి. అంతర్జాతీయ వ్యవహారాల్లో పెత్తందారీతనం కుదరదంటూ అన్ని దేశాలూ తేల్చిచెప్పాలి. ప్రపంచ శాంతికి ప్రమాదకరమైన ట్రంప్ దుందుడుకుతనానికి పగ్గాలు వేసేందుకు ఏకతాటిపైకి రావాలి!



రిస్క్ తీసుకోవాల్సిన అవసరం రాకపోతే, ఎలాంటి పోరాటమూ లేకపోతే... జీవితం మీద ఆసక్తి సగం చచ్చిపోతుంది. యువత కేవలం చదువుకుంటే సరిపోదు, ఆ చదువును సమాజం కోసం వినియోగించాలి. అన్యాయాలూ అక్రమాలతో రాజీపడటానికి మించిన నేరం లేదు.

– నేతాజీ సుభాష్ చంద్రబోస్

విద్యాధనం

మన పూర్వీకులు పేర్కొన్న అష్టైశ్వర్యాలలో విద్య ఒక్కటే శాశ్వతమైనది. మిగతా ఏడు- పదవి, ధనం, జీవిత భాగస్వామి, సంతానం, వినయం, ధైర్యం, స్థైర్యం... ఏవీ స్థిరమైనవీ శాశ్వతమైనవీ కావు. అందుకే వేదోపనిషత్తులు, పురాణేతిహాసాలు, ధర్మశాస్త్రాలు, కావ్యాలు సందర్భోచితంగా విద్యా ప్రాశస్త్యాన్ని వెల్లడించాయి. 'విద్యయా అమృతమశ్నుతే'- అమృతత్వం పొందడానికి విద్య ఒకటే మార్గమని ఈశావాస్యోపనిషత్ ప్రవచించింది. మానవాళికి జీవితాన్ని ప్రసాదించే విద్య పూజనీయమైనది, దైవ సమానమైనదని విష్ణుపురాణం ఉద్బోధించింది. ప్రణోదేవీ సరస్వతీ... అని విద్యాధిదేవతను కీర్తించింది రుగ్వేదం. ఆ వాగ్దేవి ఆవిర్భవించిన రోజు మాఘ శుక్ల పంచమి. ఈ రోజు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించడం సంప్రదాయం.

అయిదో శతాబ్దికి చెందిన భర్తృహరి తన సుభాషిత త్రిశతిలో విద్యా ప్రాధాన్యాన్ని చక్కగా వివరించాడు. విద్య దొంగిలించడానికి వీలుకాని ధనం. ముఖానికి ఒక వర్చస్సునిస్తుంది. కీర్తిని, సుఖాలను ప్రసాదిస్తుంది. గురువుగా, బంధువుగా నిరంతరం వెన్నంటి ఉంటుంది. ఎంతగా దానం చేస్తే అంతగా పెరిగే సంపద విద్య ఒక్కటేనని భర్తృహరి ఉపదేశించాడు. 'స్వదేశే పూజ్యతే రాజా విద్వాన్ సర్వత్ర పూజ్యతే' అని ఆర్యోక్తి. అందుకే అవతార పురుషులు శ్రీరామ శ్రీకృష్ణులు సైతం ఆశ్రమాలకు వెళ్లి గురువుల దగ్గర విద్యనభ్యసించారు. వేయిన్నర సంవత్సరాల క్రితం భారతావనిలో నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా భాసించాయి. కొండవీటి రెడ్డి రాజుల ఆస్థానంలో కవిసార్వభౌముడు శ్రీనాథుడు విద్యాధికారిగా వ్యవహరించాడు. అంటే అప్పటికే విద్యకు సంబంధించిన విభాగమొకటి పరిపాలనలో స్థిరపడిందన్న మాట. 'చదివిన సదసద్వివేక చతురత కల్గున్' అన్నాడు పోతన. 'చదువు చదువకున్న సౌఖ్యంబులును లేవు' అన్నాడు వేమన. సమాజ పరిణామక్రమంలో అన్ని కాలాలలో విజ్ఞులు విద్యనొక జీవితావసరంగా గుర్తించారు. గౌరవించారు. అదే పరమ సంపదగా భావించారు. విద్యతో వినయం, విద్యా వినయాలతో అర్హత, అర్హతతో ధనం, ధనంతో ధర్మం, ధర్మంతో సుఖం లభిస్తుంది. విద్య సకలార్థ ప్రదాయిని.



అంతర్యామి


దైనందిన జీవితంలో పౌరసమాజం సంపద కన్నా విద్యకు ప్రాధాన్యమివ్వడం చూడవచ్చు. మీరేం చదువుకున్నారు? పిల్లలేం చదువుతున్నారు? అని అడుగుతారే తప్ప ధన సాధన సంపత్తి గురించి ప్రశ్నించరు. అలాగే పేరుకు ముందో వెనకో విద్యార్హతలుంటాయి తప్ప కూడబెట్టిన సంపదల వివరాలు ఉండవు. డబ్బు, నగలు, భవనాలు, వాహనాలు.. . మరణించాక అన్యాక్రాంతమవుతాయి. వాటిని సమకూర్చిన వారి పేరు కాలక్రమంలో కనిపించకుండాపోతుంది. విద్యాకీర్తి ఒక్కటే ఎన్నటికీ చెరిగిపోదు. కనుక విద్యాదీపం నిరంతరం కాంతులు వెదజల్లాలి. తల్లిదండ్రులు పిల్లలకిచ్చే అత్యంత విలువైన సంపద విద్య ఒక్కటే. విద్యార్థులు చదువే సర్వస్వంగా శ్రమించాలి. విద్యావ్యవస్థ పరిపుష్టికి ప్రభుత్వాలు యథాశక్తి సహకరించాలి. విద్యాధనం మహాధనం. విద్యాదానం మహాదానం అన్న ఆర్యోక్తి జనజీవన సంస్కృతిలో భాగం కావాలి.

– డాక్టర్ అయాచితం శ్రీధర్

ఏఐపై భారీ పెట్టుబడులు... ఆశల పందేలు

ఇప్పుడు కృత్రిమ మేధ(ఏఐ) చేయలేని పనులేమైనా ఉన్నాయా? కార్మికులు, కర్షకుల పనులూ చేస్తుంది. కోడింగ్ రాస్తుంది. క్యాన్సర్ చికిత్స మొదలు, మానవుణ్ని కుజ గ్రహానికి పంపడందాకా అన్నీ చేసేస్తుందని చెబుతున్నారు. ఇలాంటి ప్రచార హోరుతో ప్రపంచమంతటా ఏఐ రంగంలోకి భారీగా పెట్టుబడులు ప్రవహిస్తున్నాయి. అదే సమయంలో ఏఐపై మరీ అతిగా ఆశలు వద్దనే హెచ్చరికలూ వినిపిస్తున్నాయి.

కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడుల విషయంలో అమెరికా, చైనాలు అగ్రగాములుగా నిలుస్తున్నాయి. అమెరికా జీడీపీలో 1.5 శాతాన్ని ఏఐ, సెమీకండక్టర్ల వంటి అధునాతన టెక్నాలజీలపై వెచ్చిస్తోందనీ, ఈ పెట్టుబడులు 4 నుంచి 5 లక్షల కోట్ల డాలర్లకు చేరాయని అంచనా. సంవత్సర కాలంలో కేవలం డేటా సెంటర్ల మీదనే గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి కంపెనీలు 40వేల కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. దానికోసం గూగుల్ తప్ప మిగతా కంపెనీలన్నీ రుణాల బాట పట్టనున్నాయి. ఏఐతో తమకు స్వర్ణ యుగం వస్తుందనే ఆశతోనే అప్పులు చేస్తున్నాయి. మరోవైపు, ఏఐపై ఇంత వేలంవెర్రి తగదని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) తన తాజా నివేదికలో హెచ్చరించింది. ఏఐ వల్ల ఉత్పాదకత అమాంతం పెరిగిపోతుందనే ఆశతో పెట్టుబడులను గుమ్మరిస్తున్నారనీ, అది నెరవేరకపోతే పెట్టుబడులు పడిపోతాయనీ, కొత్తవి రావనీ, స్టాక్ మార్కెట్లు దారుణంగా పతనమై ప్రపంచమంతటా ఆర్థికంగా గడ్డుపరిస్థితులు ఏర్పడతాయని ఐఎంఎఫ్ స్పష్టం చేసింది.



అవసరమున్నా లేకున్నా అదే పరుగు...

ఆధునిక చరిత్రలో ఈ తరహా పరిణామాలు ఇంతకుముందు కూడా జరిగాయి. 1850-1880ల మధ్య బ్రిటన్, అమెరికాలలో రైల్వే ప్రాజెక్టుల కోసం కంపెనీలు భారీగా అప్పులు తెచ్చిపోశాయి. 18వ, 19వ శతాబ్దాలలో రైల్వే, మోటారు కార్లు, విద్యుత్ రంగాల్లోకి భారీపెట్టుబడులు ప్రవహించాయి. తరవాత ఇంటర్నెట్, టెలికమ్యూనికేషన్ రంగాల వంతు వచ్చింది. 1990లలో వై2కె సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వాలకు, కంపెనీలకు 30 వేల కోట్ల నుంచి 60వేల కోట్ల డాలర్ల వరకు చేతిచమురు వదిలింది. ఇప్పుడు ఏఐ హవా నడుస్తోంది. ఇలాంటి రంగాల్లో మొదట ఎంతో హడావిడి, ఆర్భాటాలు కనిపించి అపారంగా పెట్టుబడులు, రుణాల మీద తెచ్చిన సొమ్మును ఆకర్షిస్తాయి. తరవాత పెట్టుబడిదారుల ఆశలకు తగ్గ ఫలితాలు లభించక నేలకు దిగిరావడం జరుగుతుంది. అమెరికా కంపెనీలు ఇలా భారీ పెట్టుబడులు పెడుతుంటే, చైనా చౌకగా డీప్ సీక్‌ను వెలువరించి నిర్ఘాంతపరచింది. అప్పటి నుంచి ఏఐలో పైచేయి కోసం అమెరికా, చైనా మధ్య పోటీ తీవ్రమైంది. భవిష్యత్తు అంతా ఏఐదేననే భావన ప్రపంచమంతటికీ పాకిపోయింది. దీంతో తమకు ఏఐ నిజంగా అవసరం ఉన్నా, లేకున్నా ప్రతి కంపెనీ అదేబాటలో పరిగెత్తక తప్పని స్థితి నెలకొంది. ఇది కంపెనీలకే పరిమితం కాలేదు- ప్రభుత్వాలు, కుటుంబాలు కూడా ఏఐ లేనిదే భవితే లేదని నమ్ముతున్నాయి. నిజంగానే ఏఐ తమ పనిపాటలకు అదనపు విలువ జోడిస్తుందా, ఈ సాంకేతికతను ఎలా వాడుకోవాలనే అంశాలపై సరైన అవగాహన లేకుండానే ఏఐ జోరులో కొట్టుకుపోతున్నాయి.

గతంలో వచ్చిన ప్రతి సాంకేతిక, ఆర్థిక విజృంభణ మొదట నింగికి లేచి తరవాత కుప్పకూలింది. ఆర్థిక పరిభాషలో దీన్ని బూమ్, బస్ట్ సైకిల్‌గా వ్యవహరిస్తారు. అధిక లాభాల కోసం యావే ఈ చక్రభ్రమణానికి మూలకారణం. 1636-40 మధ్యకాలంలో నెదర్లాండ్స్‌లో తులిప్ పుష్పాలు భారీ లాభాలు తెచ్చిపెడతాయని వేలంవెర్రి ఏర్పడి, తరవాత తుస్సుమనడంతో భారీగా నష్టాలకు దారితీసింది. 1720లలో బ్రిటన్‌లో బానిసల వ్యాపారం కోసం ఏర్పడిన సౌత్ సీ కంపెనీ ఇలాగే దివాలా తీసి, మదుపరులను నష్టాల్లోకి నెట్టింది. 1793-1820లలో ఫ్రాన్స్, బ్రిటన్‌లలో కాలువల నిర్మాణ జోరు, 1840-1880 మధ్య అమెరికా, బ్రిటన్‌లలో రైల్వే లైన్ల నిర్మాణం, 1929లో అమెరికాలో మహా ఆర్థిక కుంగుబాటు, 2008లో బ్యాంకింగ్ బుడగ బద్దలవడం... ఇలాంటివన్నీ సాంకేతికంగా, ఆర్థికంగా స్వర్ణయుగంలోకి ప్రవేశించనున్నామనే అత్యాశతో మొదలుపెట్టి హతాశులైన క్రమాన్ని గుర్తుచేసే ఉదంతాలే.

ఇంకా డబ్బు కావాలట!

ఏఐ డేటా సెంటర్లకు కావాల్సిన విద్యుత్తు ఎక్కడి నుంచి వస్తుందనే ప్రశ్న ఇప్పుడు కీలకమైనది. ఇంతవరకు ప్రకటించిన డేటా సెంటర్ ప్రాజెక్టులకు వచ్చే 20 ఏళ్లలో భారీగా విద్యుత్తు అవసరమవుతుంది. ఉదాహరణకు అమెరికాలోని టెక్సస్ రాష్ట్రంలో ప్రస్తుతం 63 గిగావాట్ల విద్యుదుత్పాదన జరుగుతుండగా, డేటా సెంటర్ల నుంచి 226 గిగావాట్ల విద్యుత్తు కావాలంటూ విజ్ఞప్తి వచ్చింది. ఒరాకిల్-ఓపెన్ ఏఐ ప్రాజెక్టుకే వచ్చే రెండేళ్లలో ఏటా 4.5 గిగావాట్లు కావాలి. భారతదేశం ఇంతటి కరెంటు గిరాకీని తీర్చగలదా అనే ప్రశ్న అనివార్యంగా వ్యక్తమవుతోంది. భారీ డిమాండును నెరవేర్చేందుకు హరిత ఇంధనాలకన్నా బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాలపై ఆధారపడితే కర్బన ఉద్గారాలు, వాతావరణ మార్పులు పెరిగిపోతాయి. ఓపెన్ ఏఐ సంస్థ రానున్న సంవత్సరాల్లో 1.4 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరం పడతాయని చెబుతోంది. 2030కిగాని తనకు లాభాలు రావనీ వెల్లడిస్తోంది. ఇప్పుడప్పుడే లాభాలు రానప్పుడు అంతటి భారీ పెట్టుబడులు ఎక్కడి నుంచి వస్తాయి? స్టాక్ మార్కెట్ విజృంభణతో తమ షేర్లలోకి డబ్బు ప్రవహిస్తుందని ఆ సంస్థ ఆశిస్తోందా? ఏ టెక్నాలజీ అయినా దానంతట అదే పనిచేయదు, అది మనిషి చేతిలోని సాధనంగా మాత్రమే పని చేయగలుగుతుంది. అదనపు విలువను ఇవ్వగలుగుతుంది. ఏఐ వల్ల లాభం పొందేవారు ఉంటారు, నష్టపోయేవారూ ఉంటారు. బాధితుల సంఖ్య మరీ ఎక్కువగా ఉండకుండా జాగ్రత్తపడాలి. ఏఐ రాకతో కొత్తగా ఉపాధి, వ్యాపార అవకాశాలు విస్తరిస్తాయనే అంచనాలు ఉన్నాయి. అయితే, అలాంటి సరికొత్త అవకాశాల్ని అందిపుచ్చుకునేలా మన యువతరాన్ని ఇప్పట్నుంచే సంసిద్ధుల్ని చేయాల్సిన అవసరం ఉంది.



డాక్టర్ ఎస్.అనంత్

ఆర్థిక సామాజిక విశ్లేషకులు

అమ్మానాన్నలే ఆడపిల్ల బరువనుకుంటే, సర్వస్వం అనుకున్న భర్తే నిండు చూలాల్ని ఇంటి నుంచి గెంటేస్తే... అలాంటి కష్టాలు పగవాళ్లకూ రాకూడదనుకుంటాం. కష్టాలు, కన్నీళ్లు చాలామందిని అతలాకుతలం చేస్తాయి. ఆత్మహత్యకు ప్రేరేపిస్తాయి. అరుదుగా కొందరు మాత్రమే అన్నిటినీ తట్టుకుని నిలబడతారు. తమలా మరెవరూ బాధపడకూడదనుకుంటారు. అందుకోసమే తమ జీవితాన్ని అంకితం చేస్తారు. మహారాష్ట్రలోని వార్ధా జిల్లాలో చిన్న పల్లెలో పుట్టిన సింధుతాయి సప్కాల్ కూడా అదే కోవకు చెందుతారు. బాగా చదువుకోవాలని ఎంతో ఆశపడ్డ సింధుతాయికి పన్నెండేళ్లకే పెళ్లి చేసి బరువు దించేసుకున్నారు అమ్మానాన్నలు. అదికూడా ఆమెకన్నా ఇరవైఏళ్ల పెద్ద

అనాథలకు అమ్మయ్యారు!



వాడితో. ఆ తరవాత గృహహింస వైవాహిక జీవితాన్ని దుర్భరం చేసింది. తొమ్మిదినెలల గర్భంతో ఉన్నామెను అనుమానంతో నిర్దాక్షిణ్యంగా బయటికి గెంటేశాడు భర్త. పుట్టెడు దుఃఖంలో ఉన్న కన్నకూతుర్ని పుట్టింటివాళ్లూ ఆదరించలేదు. దాంతో అందరూ ఉన్న అనాథలా మిగిలి.. ఓ పశువుల పాకలో ఆడపిల్లకు జన్మనిచ్చారు సింధుతాయి. బొడ్డుతాడును రాయితో తనే తెంచి పసిదాన్ని ఒడిలోకి తీసుకున్నారు. తాగుబోతుల నుంచి తనను తాను కాపాడుకోవడానికి ఆ రాత్రి చంటి బిడ్డతో శ్మశానంలో తలదాచుకున్నారు. ఆకలేస్తే అంత్యక్రియల్లో భాగంగా ఎవరో అక్కడ పెట్టివెళ్లిన పిండితో రొట్టె చేసుకుని మండుతున్న చితి కట్టెల మీద కాల్చుకుని తిన్నారు. తరవాత రైళ్లలో భిక్షాటన చేస్తూ కన్నబిడ్డ ఆకలి తీర్చారు. తనలాగే రోడ్డున పడ్డ చిన్నారులను చూస్తూ చలించిపోయిన ఆమె వారి కోసం ఏమైనా చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నారు.

నెమ్మదిగా ధైర్యం కూడదీసుకుని పనులు చేసుకుంటూ కూతురితోపాటు మరో నలుగురు అనాథ పిల్లలనూ చేరదీసి పెంచడం మొదలుపెట్టారు సింధుతాయి. ప్రేమను పంచడంలో కన్నకూతురికి, అనాథలకు మధ్య ఎక్కడ తేడా వస్తుందోననే ఉద్దేశంతో కూతుర్ని ఇంటికి దూరంగా ఒక ట్రస్ట్‌లో చేర్పించి చదివించారు. ఆ తరవాత దాతల సాయంతో పుణెలో అనాథాశ్రమాన్ని స్థాపించారు. ఎందరో అనాథ బాలలకు అమ్మయ్యారు. ఆమె దగ్గర ఆశ్రయం పొంది చదువుకున్న వారిలో ఎందరో డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లుగా స్థిరపడ్డారు. తమను ఆ స్థాయికి తెచ్చిన ఆశ్రమానికి తమ వంతు సహకారం అందిస్తుంటారు ఇప్పటికీ.


మహారాష్ట్రలో టైగర్ ప్రాజెక్టు నిర్మాణంతో నిరాశ్రయులైన 84 గ్రామాల ఆదివాసీల పునరావాసానికీ ధైర్యంగా పోరాడిన సింధుతాయి, వారికి న్యాయం జరిగేలా చూశారు. సింధుతాయి సేవలకు గుర్తింపుగా నారీశక్తి పురస్కారంతోపాటు పలు ఇతర అవార్డులూ లభించాయి. అవార్డులతో వచ్చిన డబ్బునూ ఆశ్రమానికే వాడేవారామె. ప్రభుత్వమూ 2021లో 'పద్మశ్రీ'తో గౌరవించింది. సింధుతాయి జీవితగాథ ఆధారంగా మరాఠీలో నిర్మించిన సినిమా, సీరియల్ కూడా ఎంతో ప్రజాదరణ పొందాయి. తాను ఎవరి నుంచీ కనీస ప్రేమకు నోచుకోకపోయినా.. రెండువేల మందికి పైగా అమ్మ ప్రేమను పంచిన సింధుతాయి మూడేళ్ల కిందట కన్నుమూశారు. 'కంటేనే అమ్మ అని అంటే ఎలా? కరుణించే ప్రతి దేవత అమ్మే కదా..' అన్న సినారె మాటలు సింధుతాయి విషయంలో అక్షర సత్యాలు!

– నరుకుల లక్ష్మి



లాభం అరకొరే...

భారతీయ రైల్వే దేశానికి జీవనాడి వంటిది. కానీ, అధిక నిర్వహణ వ్యయాలు, మౌలిక వసతులపై ఖర్చులు తదితరాల వల్ల రైల్వేల నికర ఆదాయం చాలా తక్కువగా ఉంటోంది. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో రైల్వేల ఆదాయం, ఖర్చులు (కోట్ల రూపాయల్లో)...



(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

చమురు దేశానికి హరిత ఇంధనం

శిలాజ ఇంధనాల వినియోగంతో వాతావరణ మార్పులు సంభవించడంపై ఆందోళన పెరుగుతోంది. చమురుకు ప్రపంచం త్వరలో వీడ్కోలు చెప్పడం ఖాయమని యూఏఈ గ్రహించింది. కర్బన ఉద్గారాలకు తావులేని సౌర, పవన, అణు విద్యుత్తులవైపు అడుగులు వేస్తోంది. భవిష్యత్తులో విద్యుదుత్పాదనకు అణు కేంద్రాలు ప్రధాన వనరుగా మారతాయని గ్రహించింది. ఇప్పటికే దక్షిణ కొరియా సహకారంతో బారకాహ్ అణు విద్యుత్కేంద్రాన్ని నిర్మించుకుంది. తాజాగా భారతదేశంతో చేతులు కలపడం ద్వారా, అణు విద్యుదుత్పాదనలో పూర్తిగా పాశ్చాత్య సహకారంపైనే ఆధార పడదలచుకోలేదని సంకేతాలు అందిస్తోంది. ముమ్ముందు వర్ధమాన దేశాలకు పౌర అణు విద్యుదుత్పాదనలో సహాయ సహకారాలు అందించుకోవడానికి భారత్, యూఏఈలు సిద్ధమవుతున్నాయి.



పౌర ప్రయోజనాల కోసం అణుశక్తిని వినియోగించడంలో సహకార వృద్ధికి భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నిర్ణయించడం విశేష పరిణామం. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ (ఎంబీజడ్) ఇటీవలి భారత సుడిగాలి పర్యటనలో ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని టెక్నాలజీ సీమకూ విస్తరించాలని నిర్ణయించారు. దీర్ఘకాలిక దృష్టితో సంబంధాలను మరింత పటిష్ఠం చేసుకోవాలని నిశ్చయించారు.

పరస్పర ప్రయోజనాలతో ముందడుగు

సుస్థిరంగా అణు విద్యుత్తును ఉపయోగించడానికి వీలుగా ఇండియా 2025లో తీసుకొచ్చిన శాంతి చట్టం యూఏఈతో సహకారానికి ప్రాతిపదికగా నిలుస్తోంది. దీనికింద రెండు దేశాలు భారీ అణు రియాక్టర్లు, చిన్న మాడ్యులర్ రియాక్టర్లు (ఎస్ఎంఆర్), అత్యాధునిక రియాక్టర్ సిస్టమ్స్, అణు విద్యుత్కేంద్రాల నిర్వహణ, అణు భద్రత తదితర అంశాల్లో భాగస్వాములుగా నడుస్తాయి. ఇండియాకు అణు శక్తి రంగంలో యూఏఈ నుంచి భారీ పెట్టుబడులు లభిస్తాయి. అణు విద్యుదుత్పాదనను విస్తరించినప్పుడు చమురు దిగుమతులపై ఆధారపడాల్సిన అగత్యం తగ్గిపోతుంది. అణు విద్యుత్కేంద్రాల స్థాపన, నిర్వహణలో ఆధునిక సాంకేతికతలను ఉపయోగించే సౌలభ్యం ఏర్పడుతుంది. ఇప్పటికే వాణిజ్య ప్రాతిపదికపై అణు విద్యుత్కేంద్రాలను నిర్వహిస్తున్న యూఏఈ తాజా ఒప్పందంతో హరిత ఇంధన ఉత్పత్తి, వినియోగాలలో ప్రముఖ స్థానానికి చేరగలుగుతుంది. భారతదేశ సహకారంతో అణు రంగంలో అధునాతన సాంకేతికతలను రూపొందించుకుని వినియోగించే వెసులుబాటును పొందుతుంది. అణు రంగంలో భారత్, యూఏఈ సహకార వృద్ధికి శాంతి చట్టం తోడ్పడుతుందని భారత విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ వివరించారు. ఆ చట్టం కర్బన ఉద్గారాల తటస్థత(నెట్ జీరో)ను సాధించే దిశగా పడిన కీలకమైన ముందడుగు. దాన్ని ఇండియా, యూఏఈ అణు సహకారానికి ప్రాతిపదికగా తీసుకోవడం ద్వారా రెండు దేశాలూ పరస్పర ప్రయోజనాలతో ముందడుగు వేయగలుగుతాయి.

శిలాజ ఇంధనమైన చమురుకు భవిష్యత్తు లేదని యూఏఈ గ్రహించిందని దిల్లీకి చెందిన మేధోసంస్థ ఇమేజిండియా అధ్యక్షుడు రవీందర్ సచ్‌దేవ్ వివరించారు. అందుకే అణు శక్తి, గ్రీన్ హైడ్రోజన్‌పై యూఏఈ దృష్టి కేంద్రీకరించి, వాటిలో భారీగా పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. బారకాహ్ అణు కేంద్రం నిర్మాణాన్ని ఉదాహరించారు. ఇవాళ యూఏఈ వినియోగించే విద్యుత్తులో 25 శాతాన్ని అదే అందిస్తోందని వివరించారు. ఇలాంటి భారీ అణు విద్యుత్కేంద్రాలకు తోడు చిన్న మాడ్యులర్ రియాక్టర్లపైనా యూఏఈ ఆసక్తి కనబరుస్తోంది. వీటి తయారీ, నిర్వహణకు భారత్ సొంత పరిజ్ఞానాలను రూపొందించుకుందనీ, అందుకే భారత్‌తో యూఏఈ చేతులు కలిపిందని రవీందర్ పేర్కొన్నారు.

ద్వైపాక్షిక వాణిజ్య వృద్ధి

ఆర్థిక వ్యవస్థ ఆధునికీకరణలో నిమగ్నమైన యూఏఈ అందుకు అణు శక్తి వంటి హరిత ఇంధనాలను ఆశ్రయిస్తోందని లండన్ కింగ్స్ కాలేజ్ ఆచార్యుడు హర్ష్ పంత్ వివరించారు. అణు విద్యుదుత్పాదనలో చిరకాల అనుభవం, పరిజ్ఞానం ఉన్న ఇండియా సహకారం యూఏఈకి ఎంతగానో ఉపకరిస్తుందన్నది ఆయన అంచనా. భారతదేశం అణ్వస్త్ర వ్యాప్తి నిరోధ ఒప్పందంపై సంతకం చేయకపోయినా శాంతియుత ప్రయోజనాలకు అణు శక్తి వినియోగం కోసం 2008లో అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆపైన రష్యా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, నమీబియా, అర్జెంటీనా, కజఖ్‌స్థాన్, దక్షిణ కొరియా, చెక్ రిపబ్లిక్, శ్రీలంకలతో కూడా భారత్ ఇలాంటి ఒప్పందాలనే కుదుర్చుకుంది. తాజాగా యూఏఈతో సదరు ఒప్పందంపై సంతకాలు చేసింది. మరోవైపు సౌదీ అరేబియా, పాకిస్థాన్ రక్షణ ఒప్పందం కుదిరిన వెంటనే యూఏఈ అధ్యక్షుడు ఎంబీజడ్ భారత్‌కు వచ్చి రక్షణ సహకార ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి సన్నాహాలు ప్రారంభించడం విశేష పరిణామం. సౌదీ అరేబియా, పాక్‌లతో తుర్కియే కూడా రక్షణ భాగస్వామిగా మారే అవకాశం ఉంది. పొరుగున ఇరాన్ పరిస్థితి అనిశ్చితంగా మారడం, యెమెన్‌లో పలుకుబడి కోసం తనతో సౌదీ పోటీపడటం యూఏఈని భారత్‌కు దగ్గర చేస్తోంది. ఎంబీజడ్ భారత్ పర్యటనలో ద్వైపాక్షిక వాణిజ్య వృద్ధికి ఒప్పందం కుదరడం కూడా ముఖ్యమైన పరిణామమే.

– అరూణిం భుయాన్


కంప్యూటర్ కథ

హాయ్! బుజ్జీ!!

కంప్యూటర్ అనగానే స్కూల్‌లో మనం డ్రాయింగ్ వేసుకునేది, లేదంటే ఇంట్లో మన పెద్దవాళ్లు పని చేసుకునే ల్యాప్‌టాప్ గుర్తొస్తాయి కదా! ఇంతకీ మొట్టమొదటగా కనిపెట్టిన కంప్యూటర్ ఎలా ఉండేదో? అసలు దాన్ని ఎందుకు కనిపెట్టారో తెలుసుకుందామా ఫ్రెండ్స్!

మనం ఏవైనా లెక్కలు చేస్తుంటే కొన్నిసార్లు తొందరగా సరైన జవాబు వస్తుంది. ఇంకొన్నిసార్లు చాలా సమయం పడుతుంది కదా! కొన్నిసార్లు పొరపాటున తప్పు జవాబు కూడా రావొచ్చు. కానీ అలాంటి పొరపాట్లేవీ జరగొద్దు అనుకున్నారు, గణితశాస్త్రవేత్త చార్లెస్ బాబేజ్. అందుకే మెషీన్ లెక్కలు చేస్తే ఎలా ఉంటుందని అనుకుని ఆయనే అలాంటి మెషీన్‌ను తయారు చేయాలని 1812-13 ప్రాంతంలో నిర్ణయించుకున్నారు. కానీ అది తయారుచేయడానికి తగినన్ని డబ్బులు లేక మధ్యలోనే ఆపేశారు. తరవాత కొన్నిరోజులకు డిఫరెన్స్ ఇంజిన్, డిఫరెన్స్ ఇంజిన్ 2 అనే సాంకేతికతలతో సొంతంగా దానికదే లెక్కలు చేసే యంత్రాన్ని తయారుచేసి.. అనుకున్నది సాధించారు చార్లెస్. అలా ఆయన కంప్యూటర్ తయారీకి పునాదులు వేశారు. కానీ అది పూర్తవ్వడానికి చాలా సమయం పట్టింది. అందుకే చార్లెస్‌ని 'ఫాదర్ ఆఫ్ కంప్యూటర్' అంటారు. ఆయన తయారు చేసిన అనలిటికల్ ఇంజిన్ అనే మెషీన్‌కు మరో గణిత శాస్త్రవేత్త, రచయిత్రి అయిన 'అడా లవ్‌లేస్' కోడ్ రాశారు. ఆ తరవాత కంప్యూటర్లు కేవలం లెక్కలు చేయడానికే కాకుండా అంతకు మించి ఇతర అవసరాలకూ ఉపయోగించవచ్చని తేల్చారు. మరో విషయం ఏంటంటే.. అడా లవ్‌లేస్ మొట్టమొదటి కోడర్ కూడా! సాధారణంగా మనకు తెలిసిన కంప్యూటర్లు అయితే ఒక గదిలో టేబుల్ మీద పెట్టి ఉంటాయి. ఇక ల్యాప్‌టాప్ అయితే బ్యాగ్‌లో కూడా పెట్టుకోవచ్చు. కానీ మొట్టమొదటి కంప్యూటర్ మాత్రం ఒక గది మొత్తం నిండిపోయేంత పెద్దగా ఉండేదట తెలుసా! ★





రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. సరైన వాటిని కలిపి రాయండి చూద్దాం.

తీర	ముగ్గు	ముద్ద	దండ
తీగ	దడ	గాజులు	పొద
కాటు	కొలను	ముత్యాల	మల్లె
పూల	గుండె	ప్రాంతం	గోరు
ముళ్ల	ఈత	పాము	మట్టి

దేశాల మధ్య సరిహద్దులు.. యుద్ధాలు ఎందుకు?

ప్రశ్న: అంతరిక్ష యాత్రలకు దూరమైనందుకు ఎలా అనిపిస్తోంది?

సునీతా విలియమ్స్: రాబోయే రోజుల్లో అంతరిక్షాన్ని కచ్చితంగా మిస్ అవుతాను. ఐఎస్ఎస్ నుంచి అందమైన భూమిని చూసే అవకాశం కోల్పోతాను. నాసా ఇంజినీర్లు, పరిశోధకులను కూడా మిస్ అవుతాను. ఇవన్నీ కోల్పోతున్నందుకు బాధేస్తోంది.

భారత అంతరిక్ష కార్యక్రమం గురించి ఏమంటారు?

అంతరిక్ష పరిశోధనలు అంటే తెలియనివాటిని తెలుసుకోవడం మాత్రమే కాదు. ఇది అంతర్జాతీయ సహకారానికి సంబంధించిన విషయం. ఐఎస్ఎస్‌లో చాలా దేశాలు, సంస్థలకు భాగస్వామ్యం ఉంది. ఏ దేశమూ తనను ఒంటరిగా జయించలేదు అనే సత్యాన్ని అంతరిక్షం చాటిచెబుతుంది. అందుకే అంతరిక్ష రంగంలో భారత్, అమెరికా లాంటి దేశాలు సహకరించుకుంటే బాగుంటుంది. దిల్లీ, వాషింగ్టన్ మధ్య ప్రత్యేక అంతరిక్ష అనుబంధం ఏర్పడాలి. భారత అంతరిక్ష కార్యక్రమానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆశిస్తున్నా.

అంతరిక్ష యాత్రల్లో ఎదురైన మర్చిపోలేని ఓ అనుభవం గురించి చెప్పండి?

నా పెంపుడు శునకాల పేర్లు గన్నర్, గోర్బీ. 2024లో చివరి అంతరిక్ష యాత్రకు బయలుదేరే ముందు నా భర్తతో ఒక మాట చెప్పా. 10 రోజుల్లోపే అంతరిక్షం నుంచి తిరిగొచ్చి, నా కుక్కలను చూసుకుంటానన్నా. కానీ నేను నెలల తరబడి అంతరిక్షంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. దీంతో అంతరిక్షంలో చాలా ఉద్వేగానికి లోనయ్యా. అలాంటి సమయంలో ఒక కార్గో స్పేస్‌క్రాఫ్ట్ ఐఎస్ఎస్‌కు వచ్చింది. అది నాకు రెండు అనూహ్య ప్యాకేజీలను అందించింది. ఒకదాంట్లో భారతీయ ఆహారం ఉంది. దాన్ని అమెరికాలోని మా ఇంట్లోనే వండించారు. మరొక దాంట్లో నా పెంపుడు కుక్కల త్రీడీ ప్రింటెడ్ నమూనాలు ఉన్నాయి. వాటిని అద్భుతంగా, జీవకళ ఉట్టిపడేలా పెయింట్ చేయించారు. నా కుక్కల త్రీడీ ప్రింట్‌లు మైక్రోగ్రావిటీలో తేలియాడటం చూసి సంతోషించాను. భూమి నుంచి 400 కిలోమీటర్ల ఎత్తులోనూ మనిషికి ఆనందాన్ని ఇచ్చేది ప్రేమ మాత్రమేనని దాంతో రుజువైంది.



8 రోజులని వెళ్లి.. 9 నెలలు ఐఎస్ఎస్‌లోనే

సునీతా విలియమ్స్ నాసాలో 27 ఏళ్లపాటు పనిచేశారు. నిరుడు డిసెంబర్ 27న అధికారికంగా పదవీ విరమణ చేశారు. ఆమె మూడుసార్లు అంతరిక్షంలోకి వెళ్లొచ్చారు. 608 రోజులు అంతరిక్షంలో గడిపారు. తొమ్మిదిసార్లు అంతరిక్షంలో నడిచారు. కొంతకాలం ఐఎస్ఎస్‌కు సారథ్యం వహించారు. చివరగా 2024 జూన్‌లో కేవలం 8 రోజులపాటు అంతరిక్ష యాత్ర కోసం బయలుదేరి వెళ్లిన ఆమె.. వ్యోమనౌకలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా ఏకంగా 9 నెలలపాటు ఐఎస్ఎస్‌లో ఉండిపోయారు. ఎట్టకేలకు 2025 మార్చిలో భూమికి తిరిగొచ్చారు.

వ్యోమగామి కావడం సులభమేనా?

వ్యోమగామి కావడం అంత సులభమైన విషయం కాదు. అంతరిక్షంలో నడవడం కూడా చాలా కష్టం. ఇందుకోసం మేం నీటి అడుగున ముమ్మర సాధన చేస్తాం. తీవ్రంగా అలసిపోయేవరకు ఈ ప్రాక్టీస్ కొనసాగుతుంది. శరీరానికి నిరంతరం శిక్షణ అందిస్తేనే వ్యోమగామి కావడం సాధ్యమవుతుంది. స్పేస్ మిషన్లకు వెళ్లాలంటే మానసికంగానూ బలంగా ఉండాలి. ఇరుకుగా ఉండే బరువైన సూట్ ధరించి అంతరిక్ష వాతావరణంలో సమయం గడపడం పెద్ద సవాల్. అంతరిక్షంలో వ్యోమగాములు తేలియాడే వైరల్ ఫొటోలు మాత్రమే అందరికీ తెలుసు. కానీ వాళ్లు పడే శ్రమ తెలియదు. నేను చివరి అంతరిక్ష యాత్రకు వెళ్లినప్పుడు సాంకేతిక సమస్య వల్ల అంతరిక్షంలో చిక్కుకుపోయాను. మేం ఇక భూమికి తిరిగి రాకపోవచ్చని అప్పట్లో కొందరు జోస్యం చెప్పారు. అలాంటి సమయంలోనూ మానసికంగా బలంగా ఉండగలిగే వాళ్లే వ్యోమగాములు అవుతారు. నేను, నా సహచర వ్యోమగామి బుచ్ విల్మోర్ కొన్ని నెలలపాటు అంతరిక్షంలో ధైర్యంగా గడిపాం. చివరకు మా మానసిక స్థైర్యం, నమ్మకమే గెలిచాయి.

అంతరిక్షం నుంచి భూమిని చూస్తే ఏమనిపిస్తుంది?

అంతరిక్షం నుంచి భూమిని చూస్తే.. మనుషులు భూమిపై చాలా విషయాల్లో తొందరపడుతున్నారని అనిపిస్తుంది. భూమి మ్యాప్‌పై రేఖలు ఎందుకు? దేశాల మధ్య సరిహద్దులు ఎందుకు? దేశాల మధ్య ఈ పోరాటాలు ఎందుకు? అనే ప్రశ్నలు మెదడులో ఉదయిస్తాయి.

పుస్తక పఠనం, వ్యాయామంపై మీ అభిప్రాయం ఏంటి?

నాకు గ్లామర్ పట్ల ఆసక్తి లేదు. విశ్రాంతి తీసుకోవడానికి ఇష్టపడను. ఎముకల సాంద్రత, కండరాల ద్రవ్యరాశిని పెంచుకోవడానికి రోజూ వ్యాయామం చేస్తా. నాకు కాల్పనిక సాహిత్యం అంటే ఇష్టం ఉండదు. చిన్నప్పుడు జంతువులు, రహస్యాల పుస్తకాలు చదివేదాన్ని. ఇప్పుడు చరిత్ర, చారిత్రక కల్పనల పుస్తకాల వైపు ఆకర్షితురాలిని అవుతున్నా. ప్రస్తుతం స్లొవేనియా సంస్కృతిపై ఒక నవల చదువుతున్నాను. ఇటీవలే నాకు బహుమతిగా అందిన సద్గురు పుస్తకాన్ని కూడా ప్రస్తుతం చదువుతున్నా.

సద్గురు పుస్తకం చదువుతున్నానంటున్నారు..! 'సచేతన భావన'ను మీరు కూడా విశ్వసిస్తారా? అంతరిక్షంలో దాన్ని సాధన చేశారా?

అవును. 'సచేతన భావన'ను నేను విశ్వసిస్తా. ఐఎస్ఎస్ కిటికీ నుంచి భూమిని చూడగలగడం మా అదృష్టం. మనకు పరిచయమున్న వ్యక్తులు, మనం పెంచుకునే జంతువులు, మొక్కలు.. అన్నీ ఉండే గ్రహాన్ని ఐఎస్ఎస్ నుంచి చూస్తున్నప్పుడు.. అన్నింటికీ ప్రధాన కేంద్రం మనమేనేమో అనిపిస్తుంది! భూమిపై ఉన్నప్పుడు మన దృష్టిని మళ్లించే విషయాలు, ఏకాగ్రతకు భంగం కలిగించే అంశాలు చాలా ఉంటాయి. కాబట్టి అంతరిక్షంలో ఉండటం నిజంగా ఓ విలాసంలాంటిదే. అక్కడ మనం మంచి ఏకాగ్రతతో పనిచేయొచ్చు.

విశ్వంలో భూమి 'లేత నీలిరంగు చుక్క'లా ఉందని అమెరికా వ్యోమగామి కార్ల్ సేగన్ గతంలో అన్నారు. మీకూ అలాగే అనిపించిందా?

నిజంగా అలాగే అనిపించింది. ఐఎస్ఎస్ నుంచి భూమిని చూసినప్పుడు అది మన 'ఇల్లు'గానే కాదు.. సజీవమైనదిగానూ అనిపిస్తుంది. సీజన్లు మారేకొద్దీ వాతావరణ మార్పులు, మంచు ఏర్పడటం, మహాసముద్రాల్లో మార్పుల వంటివన్నీ గుర్తిస్తుంటాం. అవన్నీ చూస్తుంటే మన గ్రహం సజీవమైనదనిపిస్తుంది. విశ్వంలో మన స్థానం ఎంత సూక్ష్మమైనదో ఆలోచించేలా కూడా చేస్తుంది.

అంతరిక్షంలో మీరు 9 నెలలు చిక్కుకుపోయారు. ఆ సమయంలో మీలోని జిజ్ఞాస, హాస్య చతురత దెబ్బతినకుండా ఎలా ఉండగలిగారు?

ఐఎస్ఎస్‌లో ప్రతిరోజూ చాలా భిన్నంగా అనిపిస్తుంది. అక్కడ నేర్చుకోవడానికి చాలా ఉంటుంది. కాబట్టి మన జిజ్ఞాస ఉత్కృష్ట స్థాయికి వెళ్తుంది. నాకు నేర్చుకోవడం అంటే చాలా ఇష్టం. పలు రకాల ప్రయోగాల గురించి ఐఎస్ఎస్ నుంచి శాస్త్రవేత్తలతో నేను మాట్లాడుతూ ఉండేదాన్ని. వారు నాకు ఎన్నెన్నో అద్భుత సైన్స్ విషయాలు చెబుతుండేవారు. భూమి మీది శాస్త్రవేత్తలకు నేను ఐఎస్ఎస్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌లా పనిచేసేదాన్ని.

కల్పనా చావ్లాతో మీ స్నేహం ఎలాంటిది?

దిల్లీలో దివంగత వ్యోమగామి కల్పనా చావ్లా తల్లి, సోదరీమణులను తాజాగా కలిశాను. కల్పన నా స్నేహితురాలు. నేను, కల్పన కలిసి చాలాసార్లు హైకింగ్, సైక్లింగ్ చేశాం. కొన్ని సంబంధాలు.. గ్రహాల కక్ష్యల తరహాలో దూరం జరిగినట్లు అనిపిస్తాయి. వాస్తవానికి అవి దూరం కానే కావు.

మీ జీవిత లక్ష్యం ఏంటి?

నా కుటుంబం, స్నేహితులు, పెంపుడు కుక్కలతో కొంత సమయం గడపాలనుకుంటున్నా. తర్వాత ఏం చేయబోతున్నాను అనేదానిపై నాకే స్పష్టత లేదు. అయితే నేను కీర్తి కోసమో, మరొక వ్యక్తిగత లక్ష్యం కోసమో వ్యోమగామి కాలేదు. భవిష్యత్ తరాలను ప్రోత్సహిస్తా. యువత తమ జీవితంలో రాణించాలి. బాలలకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలి. అందుకే పిల్లల కోసం నేను ప్రత్యేక సెషన్లలో పాల్గొంటా.

ఏఎస్‌సీ అర్జున్ ఆన్ డ్యూటీ సర్!



రైల్వేలో మొదటిసారి విశాఖ రైల్వే స్టేషన్‌లో 'రోబో కాప్'ను విధుల్లోకి తీసుకున్నారు. దీన్ని గురువారం ఆర్పీఎఫ్ ఐజీ అలోక్ బోహ్రా, డీఆర్ఎం లలిత్ బోహ్రా ఆవిష్కరించారు. 'ఏఐ, ఐఓటీ సాంకేతికత ఉన్న ఈ రోబో స్టేషన్‌లో నిత్యం పహారా కాస్తూ అనుమానితులను గుర్తిస్తుంది. తరచూ దొంగతనాలకు పాల్పడేవారి చిత్రాలు తీసి విశ్లేషించి వారిని గుర్తించడంలో సహాయపడుతుంది. రద్దీ పెరిగితే ప్రయాణికులను అప్రమత్తం చేస్తుంది' అని అధికారులు వివరించారు. విశాఖకు చెందిన ఓ కంపెనీ తయారు చేసిన ఈ రోబోకు రైల్వే పోలీసులు 'ఏఎస్‌సీ అర్జున్' అని పేరు పెట్టారు. డివిజనల్ సెక్యూరిటీ కమాండెంట్ ఏకే దుబే తదితరులు పాల్గొన్నారు.

–ఈనాడు, విశాఖపట్నం



కానిస్టేబుల్ జయశాంతికి హోం మంత్రి ఆతిథ్యం

రాత్రివేళ ట్రాఫిక్ విధులు నిర్వర్తించడంపై ప్రశంసలు



జయశాంతికి బొట్టుపెట్టి చీర బహూకరిస్తున్న మంత్రి అనిత

రంగంపేట, న్యూస్‌టుడే: రాత్రివేళ చలిలో బిడ్డను ఎత్తుకొని ట్రాఫిక్ విధులు నిర్వర్తించిన తూర్పు గోదావరి జిల్లా రంగంపేట పోలీసు స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ జయశాంతికి హోంశాఖ మంత్రి అనిత గురువారం ఆతిథ్యం ఇచ్చారు. ఆ దంపతులకు దుస్తులు పెట్టి అభినందించారు. జయశాంతి ఈనెల 17న విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా సామర్లకోట కెనాల్ రోడ్డులో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో తన మూడేళ్ల కుమారుడిని ఎత్తుకొని వెళ్లి రాకపోకలు క్రమబద్ధీకరించారు. ఆ వీడియో సామాజిక మాధ్యమంలో వైరలై మంత్రి దృష్టికి వచ్చింది. దీంతో గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో జయశాంతి కుటుంబానికి మంత్రి ఆతిథ్యం ఇచ్చారు. జయశాంతి, ఆమె భర్త ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ తాతారావు, వారి కుమారులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. జయశాంతికి బొట్టు పెట్టి చీర, పండ్లను అందించారు. తాతారావుకూ దుస్తులు బహూకరించారు.

రథసప్తమి వేడుకలకు తిరుమల సిద్ధం

తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి

తిరుమల, న్యూస్‌టుడే: ఈనెల 25 నుంచి నిర్వహించనున్న రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. స్థానిక అన్నమయ్య భవనంలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రథసప్తమికి సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తూ వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు తెలిపారు. భక్తులకు పంపిణీ చేసేందుకు 14 రకాల అన్నప్రసాదాలు సిద్ధం చేస్తున్నామన్నారు. గ్యాలరీల్లోని భక్తులకు 85 కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రివరకు అన్నప్రసాదాలు అందజేసేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

రథసప్తమి రోజున ఉదయం సూర్యప్రభ వాహన సేవ, ఆ తర్వాత చిన్నశేష, గరుడ, హనుమంత వాహన సేవలు ఉంటాయి. మధ్యాహ్నం 2-3 గంటల మధ్య చక్రస్నానం, అనంతరం కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ సేవలు నిర్వహించనున్నారు.

విశాఖలో సమీకృత ఐటీ అభివృద్ధి కేంద్రం నెలకొల్పండి

(మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీ ల్యాబ్‌ల కోసం ఏపీ విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యం కావాలని, స్టార్టప్‌లకు మార్గదర్శకత్వం వహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఎజాత్ తెలిపారు.

టెక్ మహీంద్ర క్యాంపస్‌ను విస్తరించండి: లోకేశ్

విజయవాడలో టెక్ మహీంద్ర ఐటీ క్యాంపస్, విశాఖపట్నంలో డెలివరీ విస్తరణ పనులను వేగవంతం చేయాలని టెక్ మహీంద్ర సీఈవో, ఎండీ మోహిత్ జోషీని మంత్రి లోకేశ్ కోరారు. దావోస్‌లో ఆయనతో మంత్రి భేటీ అయ్యారు. లోకేశ్ మాట్లాడుతూ.. ఏఐ, ఎంఎల్, క్లౌడ్ ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ, ఇండస్ట్రీ-4.0 కోసం విజయవాడ లేదా విశాఖలో టెక్ మహీంద్ర నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఏపీ ఆధారిత టెక్నాలజీ స్టార్టప్‌లకు మార్గదర్శకత్వం, స్కేల్ చేయడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్‌పై దృష్టిసారించి తిరుపతి ఐఐటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. క్వాంటమ్ వ్యాలీలో క్వాంటమ్ కంప్యూటింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని, ఏఐ, ఎంఎల్, క్వాంటమ్ టెక్నాలజీల్లో శిక్షణ, అప్లైడ్ రీసెర్చ్ కోసం ఏపీ విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యం కావాలని కోరారు. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని మోహిత్ జోషీ తెలిపారు.



దావోస్‌లో టెక్ మహీంద్ర సీఈవో, ఎండీ మోహిత్ జోషీతో చర్చిస్తున్న మంత్రి లోకేశ్

మిక్స్‌డ్ యూజ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టండి

మిక్స్‌డ్ యూజ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని బ్లాక్‌స్టోన్ ఛైర్మన్, సీఈవో, సహ వ్యవస్థాపకుడు స్టీఫెన్ ఎ.స్క్వార్జ్‌మాన్‌ను మంత్రి లోకేశ్ కోరారు. దావోస్‌లో ఆయనతో మంత్రి భేటీ అయ్యారు. లోకేశ్ మాట్లాడుతూ.. ఎంబీసీ ఆఫీస్ పార్క్స్, నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ లాంటి సంస్థల ద్వారా విశాఖపట్నంలో గ్రేడ్ ఏ ఆఫీస్ స్పేస్, ఇంటిగ్రేటెడ్ మిక్స్‌డ్ యూజ్ డెవలప్‌మెంట్‌లో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. మాన్యుఫ్యాక్చరింగ్ లెడ్ సప్లయ్ చైన్స్, పోర్టు లింక్డ్ లాజిస్టిక్స్, రీజనల్ డిమాండ్‌ను లక్ష్యంగా చేసుకుని చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్, విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌ల పరిధిలో లాజిస్టిక్ పార్కుల అభివృద్ధిపై దృష్టిసారించాలని కోరారు. అమరావతితో సహా ఏపీలో ప్రధాన పట్టణాల్లో సంస్థాగత స్థాయి రిటైల్, బహుళ వినియోగ ఆదాయాన్ని సృష్టించే వాణిజ్య సముదాయాల ఏర్పాటును పరిశీలించాలని, విశాఖపట్నంలో హైపర్ స్కేల్ డేటా సెంటర్ పెట్టుబడులను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రతిపాదనలపై పరిశీలిస్తామని స్టీఫెన్ ఎ.స్క్వార్జ్‌మాన్ తెలిపారు.



బ్లాక్‌స్టోన్ ఛైర్మన్ స్టీఫెన్ స్క్వార్జ్‌మాన్‌తో పెట్టుబడులపై చర్చిస్తున్న మంత్రి లోకేశ్

కర్త, కర్మ, క్రియా రాజ్ కెసిరెడ్డే

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలో నంబర్ 2 ఉండరని చెప్పిన విషయాన్ని వారికి గుర్తు చేశాను. జగన్ అధికారంలోకి వచ్చిన సంవత్సరం వరకూ ఆయన నాకు నంబర్ 2 స్థానం ఇచ్చారు. పక్కన ఉన్న కోటరీ ఆయనలో అభద్రతాభావం కలిగించడం మొదలుపెట్టిన తర్వాత 2020 నుంచి నన్ను క్రమంగా పక్కనపెడుతూ వచ్చారు. నేను పార్టీ వదిలేసిన తర్వాత, వాళ్లను కేసులు చుట్టుముట్టిన తర్వాత మళ్లీ నన్ను నంబర్ 2 అని ప్రచారం చేస్తున్నారు. ఈ విషయాలన్నీ ఈడీ అధికారులకు చెప్పాను. పార్టీ వదిలి వెళ్లడానికి కూడా మద్యం కుంభకోణమే కారణమా అని ఈడీ అధికారులు అడిగితే నిజం కాదని చెప్పాను. నేను వందల కోట్లు దోచేశానని జగన్ సోషల్ మీడియా దుష్ప్రచారం చేస్తోంది. ఇది నిజం కాదు. నా ఆస్తుల వివరాలన్నీ ఇచ్చేందుకు సిద్ధం. అరబిందో వాళ్ల ఆస్తులు నావి కాదు. అవసరమైతే దర్యాప్తు సంస్థలు విచారణ చేసుకోవచ్చు' అని పేర్కొన్నారు.

మద్యం పాలసీ గురించి నాకేం తెలియదు: వైకాపా హయాంలో రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిని విచారించారు. విచారణ అనంతరం ఈడీ కార్యాలయం నుంచి రాత్రి 8 గంటల సమయంలో ఆయన బయటికి వచ్చారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. అప్పటి ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన విజయసాయిరెడ్డిని మద్యం కుంభకోణం పూర్వాపరాలన్నింటిపైనా ఈడీ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఆయన అల్లుడిదిగా చెబుతున్న డిస్టిలరీ సంస్థకు పెద్దఎత్తున మద్యం సరఫరా కాంట్రాక్టులు దక్కడం గురించి అడగ్గా ఇదంతా నిబంధనల ప్రకారమే జరిగిందని ఆయన సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. మద్యం పాలసీ రూపకల్పనలో మీ పాత్రేమిటి అని అడిగినప్పుడు ఇందులో తన ప్రమేయమేమీ లేదని ఆయన తోసిపుచ్చినట్లు తెలుస్తోంది. 2019 నుంచి 2024 మధ్య ఆయన పెట్టుబడులు పెట్టిన సంస్థల గురించి కూడా అడిగినట్లు, వాటికి సంబంధించి కొన్ని పత్రాలను కూడా సమర్పించాలని కోరినట్లు తెలుస్తోంది. విజయసాయిరెడ్డిని ఈడీ మరోమారు విచారించే అవకాశం ఉంది.

25 తర్వాత కొత్త రాజకీయ ప్రస్థానం

ఈ నెల 25వ తేదీకి తాను రాజీనామా చేసి ఏడాదవుతుందని, ఆ తర్వాత కొత్త రాజకీయ ప్రస్థానం మొదలుపెడతానని విజయసాయిరెడ్డి ప్రకటించారు. తనపై దుష్ప్రచారం చేసేవారికి బుద్ధి చెబుతానని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని, జగన్ కూడా తాను 25 ఏళ్లు అధికారంలో ఉంటానని అనుకున్నారని గుర్తు చేశారు. ఈ కూటమి ఇలాగే కొనసాగితే జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రశ్నే లేదని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. 14 ఏళ్లపాటు తాను జగన్‌కు పాలేరులా పనిచేశానని, కోటరీ పుణ్యమాని బయటకు వచ్చానని, వారిని నమ్ముకున్నంత కాలం జగన్ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఏ రాజకీయ పార్టీలో చేరనంటూనే.. భాజపా నుంచి ఆహ్వానం అందితే పరిశీలిస్తానని విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కూటమి ప్రభుత్వంపైనా పెద్దఎత్తున ఆరోపణలు చేశారు.

ఈడీకి విజయసాయి ఏం చెబుతారోనని జగన్ భయం

- **ప్రజల దృష్టి మరల్చడానికే ప్రెస్‌మీట్ పెట్టారు**
- **ఆర్థిక మంత్రి పయ్యావుల ధ్వజం**



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణం విచారణలో ఈడీ ముందు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తన గురించి ఏం చెబుతారోనని జగన్‌కు భయం పట్టుకుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఎద్దేవా చేశారు. అందుకే లేని సమస్యలు ఉన్నట్టు చూపిస్తూ.. ప్రజల దృష్టి మరల్చడానికే విలేకర్ల సమావేశం పెట్టి అసత్యాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులు తరలివస్తున్నాయనే అక్కసుతో... శాంతిభద్రతలు లేవంటూ వారిని తరిమేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతగా అమరావతిలో పర్యటిస్తున్న చంద్రబాబుపై రాళ్లు వేయించి వాక్ స్వాతంత్ర్యం అని సమర్థించుకున్న వ్యక్తి ఇప్పుడు శాంతిభద్రతలపై మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వైకాపా ప్రభుత్వంలో వాలంటీర్ నుంచి డీజీపీ వరకూ అందరూ ప్రజల్ని భయపెట్టడానికే పని చేశారని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో కేశవ్ గురువారం విలేకర్లతో మాట్లాడారు. 'జగన్ అరాచకాల్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదు. పాస్‌పుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ బొమ్మలు వేసుకున్నారు. ఇందు కోసం రూ.700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. ఇవన్నీ ప్రజల భూముల్ని కాజేసే కుట్ర కాదా? జగన్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, భూముల రీ సర్వేకు ముడిపెట్టి మాట్లాడుతున్నారు. ఈ రెండూ వేర్వేరు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా ఆయన దోపిడీకి ప్రయత్నించారు' అని కేశవ్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడిగా మారిన దువ్వూరి సుబ్బారావు

విజయనగరం జిల్లాలో విద్యార్థులకు పాఠాలు బోధన



విద్యార్థినిని ప్రశ్నలు అడుగుతున్న సుబ్బారావు

గజపతినగరం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు గురువారం సందర్శించారు. గజపతినగరం మండలం గంగచోళ్లపెంట ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన ఆయన ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. 5, 3 తరగతుల విద్యార్థులతో గణిత సాధన చేయించారు. పాఠ్యపుస్తకాల్లో అంశాలపై విద్యార్థులను ప్రశ్నించి.. ఆంగ్లంలో సమాధానాలు రాబట్టారు. బొండపల్లి, రామభద్రపురం, తెర్లాం, రాజాంలలోనూ ఎంపీపీ పాఠశాలలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి పి.సన్యాసిరాజు, జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఝార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

రూ.2.35 కోట్ల రివార్డున్న అనల్ దా సహా 16 మంది మావోయిస్టుల మృతి

చాయిబాసా, దిల్లీ: మావోయిస్టులకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఝార్ఖండ్‌లో గురువారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 16 మంది మరణించారు. ఇందులో రూ.2.35 కోట్ల రివార్డున్న అత్యంత కీలక అగ్ర నేత, కేంద్ర కమిటీ సభ్యుడు అనల్ దా ఉన్నారు. బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు అన్మోల్ అలియాస్ సుశాంత్ మృతుల్లో ఉన్నారు. 149 కేసుల్లో అతడు నిందితుడు. అతడిపై రూ.95 లక్షల రివార్డు ఉంది. మృతుల్లో ఐదుగురు మహిళలున్నారు. పశ్చిమ సింహభూమ్ జిల్లాలోని సారండా అటవీ ప్రాంతంలో ఉన్న కిరిబురు పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంబీవద్ద ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఆపరేషన్‌లో 1,500 మంది సభ్యుల సీఆర్పీఎఫ్ కోబ్రా దళం పాల్గొంది.



అనల్ దా

పశ్చిమ సింహభూమ్ జిల్లాలో గురువారం సీఆర్పీఎఫ్, ఝార్ఖండ్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించారు. భారీ విజయం సాధించారు. మావోయిస్టుల కేంద్ర కమిటీ సభ్యుడు అనల్ దా సహా 16 మంది మృతి చెందారు' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎక్స్‌లో ప్రకటించారు. మిగిలినవారు హింసా సిద్ధాంతాన్ని వీడాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

■ చనిపోయిన మావోయిస్టుల్లో ప్రాంతీయ కమిటీ సభ్యుడు అమిత్ ముండా (రూ.62 లక్షల రివార్డు, 96 కేసుల్లో నిందితుడు), సబ్ జోనల్ కమిటీ సభ్యుడు పింటూ లోహార్ (రూ.5 లక్షల రివార్డు, 47 కేసుల్లో నిందితుడు), లాల్జీత్ ఎలియాస్ లాలు (రూ.5 లక్షల రివార్డు), ఏరియా కమిటీ సభ్యులు రాజేశ్ ముండా, బుల్‌బుల్ ఆల్డా, బబిత, పూర్ణిమ ఉన్నారు.

'16 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాం. అందులో అగ్ర నేత పతీరామ్ మాఝీ ఎలియాస్ అనల్ దా ఉన్నారు. మిగిలిన వారిలో 11 మందిని గుర్తించాం. భారీ ఎత్తున ఆయుధాలను, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాం. ఉదయం 6 గంటలకు ఎన్‌కౌంటర్ జరిగింది. ఇంకా రాష్ట్రంలో 60 నుంచి 65 మంది వరకూ మావోయిస్టులు ఉన్నారు' అని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. మావోయిస్టుల ఏరివేతకు మంగళవారం నుంచి సిబ్బంది అడవిలో గాలిస్తున్నారని, గురువారం ఉదయం ఎదురు కాల్పులు జరిగాయని వెల్లడించారు.

■ గిరిడీహ్ జిల్లాలోని పీర్‌టాండ్‌కు చెందిన అనల్ దా.. 1987 నుంచి మావోయిస్టు ఉద్యమంలో కొనసాగుతున్నాడు. అతడి కోసం పోలీసులు చాలాకాలంగా వెతుకుతున్నారు. అతడిపై ఝార్ఖండ్ రూ.కోటి, ఒడిశా రూ.1.2 కోట్లు, ఎన్ఐఏ రూ.15 లక్షల రివార్డు ప్రకటించాయి. భద్రతా దళాలపై దాడులు చేసిన కేసులు అనల్‌పై ఉన్నాయి.

ఉప్పందడంతోనే..

సారండా అటవీ ప్రాంతంలో అనల్ దా తన సహచరులతో ఉన్నాడని ఉప్పందడంతోనే గురువారం ఉదయం ఆపరేషన్ ప్రారంభించామని ఆపరేషన్స్ ఐజీ మైఖేల్ రాజ్ తెలిపారు.

2 జిల్లాల్లోనే ప్రభావం

ఝార్ఖండ్‌లోని కోల్హాన్, సారండా జిల్లాల్లోనే ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం ఉంది. బుడా పహాడ్, చత్రా, లాతేహార్, గుమ్లా, లోహర్‌దగా, రాంచీ, పారస్‌నాథ్ జిల్లాల్లో మావోయిస్టుల కార్యకలాపాలను భద్రతా దళాలు పూర్తిగా అణచివేశాయి.

■ 2001 నుంచి 2025 మధ్య ఝార్ఖండ్‌లో 11,000 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. 250 మందిని హతమార్చారు. 350 మంది లొంగిపోయారు.

క్రీడా నగరాల్లో పెట్టుబడులు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

వివరించాను. గతంతో పోలిస్తే భారత్‌కు వచ్చేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నాయి' అని పేర్కొన్నారు. తన అనుభవాలను చంద్రశేఖరన్ పంచుకున్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా చేపట్టే కార్యక్రమాల నిర్వహణకు టాటా ట్రస్ట్ నుంచి అధికారులను పంపుతామని.. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులపై సమీక్షించి వాటిని పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విశాఖలో టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్, అమరావతి క్వాంటమ్ వ్యాలీ, కర్నూలులో ప్రతిపాదించిన సౌర విద్యుత్ ప్రాజెక్టుల పురోగతిపై వారిద్దరూ చర్చించారు.

కలిసికట్టుగా క్వాంటమ్ ఆర్థిక వ్యవస్థ

- విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, ప్రభుత్వాలు విడివిడిగా పని చేస్తే కుదరదు
- దీర్ఘకాలిక భాగస్వామ్యానికి ఏపీ సిద్ధం
- జులై నాటికి అమరావతిలో ఐబీఎం క్వాంటమ్ కంప్యూటర్
- దావోస్ సదస్సులో విద్య, ఐటీశాఖల మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాలు, స్టార్టప్‌లు, ప్రభుత్వాలు విడివిడిగా పనిచేస్తే క్వాంటమ్ ఆర్థిక వ్యవస్థ నిర్మించలేమని.. దీనికి బలమైన సంస్థాగత భాగస్వామ్యాలు అవసరమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ ప్రయాణంలో దీర్ఘకాలిక భాగస్వామిగా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధమన్నారు. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ల తయారీ, ఎగుమతే లక్ష్యంగా హార్డ్‌వేర్ తయారీ, అసెంబ్లింగ్ సామర్థ్యాలతో పాటు క్వాంటమ్ రిఫరెన్స్, టెస్టింగ్ సౌకర్యాల్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ విషయంలో అమరావతిలో పెట్టుబడికి సిద్ధంగా ఉన్న ప్రపంచ ఓఈఎం (ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్)లతో సహా అభివృద్ధి భాగస్వామ్యాల్ని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో 'నైపుణ్యాలు, కొలాబరేషన్ ద్వారా క్వాంటమ్ ఆవిష్కరణల్ని వేగవంతం చేయడం' అనే అంశంపై లోకేశ్ గురువారం ప్రసంగించారు.

2030 నాటికి రూ.1.83 లక్షల కోట్లకు..

'క్వాంటమ్ కంప్యూటింగ్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. 2024లో రూ.11,911 కోట్లు (1.3 బిలియన్ డాలర్లు) ఉన్న దీని మార్కెట్ 2025 నాటికి రూ.34,545 కోట్ల (3.77 బిలియన్ డాలర్ల)కు చేరింది. 41.8% వార్షిక వృద్ధి రేటుతో 2030 నాటికి రూ.1.83 లక్షల కోట్ల (20 బిలియన్ల) డాలర్ల ఆదాయాన్ని సృష్టిస్తుందని మెకిన్సే అంచనా. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 2026 జులై నాటికి దక్షిణాసియాలో మొదటి, అత్యంత శక్తిమంతమైన 133 క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్‌తో కూడిన ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్-2 కంప్యూటర్‌ను ఐబీఎం, టీసీఎస్ భాగస్వామ్యంతో ఆవిష్కరిస్తున్నాం. ఇది దేశంలోనే మొదటి డెడికేటెడ్ క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్. 50 ఎకరాల్లో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం. గ్లోబల్ క్వాంటమ్ ల్యాబ్‌లతో పరిశ్రమ- ఎంబెడెడ్ పరిశోధన కేంద్రాలు, ప్రముఖ కంపెనీలతో ఉమ్మడి పీహెచ్‌డీ, పోస్ట్-డాక్టోరల్ ప్రోగామ్‌లతోపాటు 50 వేలకు పైగా అభ్యాసకుల కోసం క్వాంటమ్ రెడీ స్కిల్లింగ్ పైప్‌లైన్‌లు దీనిలో అంతర్భాగం. ఈ ఏడాది ఆగస్టు నాటికి 100 క్వాంటమ్ వినియోగ కేసులు మా లక్ష్యం. జాతీయ క్వాంటమ్ మిషన్ ద్వారా రూ.6 వేల కోట్లతో క్వాంటమ్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్స్, సెన్సింగ్, మెటీరియల్‌ను అభివృద్ధి చేస్తాం' అని లోకేశ్ వివరించారు.

మూడు దశల్లో క్వాంటమ్ నైపుణ్య పైప్‌లైన్

◆ క్వాంటమ్ నైపుణ్య పైప్‌లైన్ ప్రణాళికను లోకేశ్ వెల్లడించారు. మొదటి దశలో 10 లక్షల మందికి క్వాంటమ్ అక్షరాస్యత లక్ష్యం. ఇందులో క్వాంటమ్ మెకానిక్స్, ఆల్గరిథమ్స్, కంప్యూటింగ్ ఫండమెంటల్స్ ఉంటాయి. ఇంజినీరింగ్, సైన్స్, ఫిజిక్స్ నేపథ్యమున్న 54 వేల మందికి త్వరలో వైజర్ ద్వారా శిక్షణ ఇవ్వబోతున్నాం.

◆ రెండో దశలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, సెన్సింగ్, కమ్యూనికేషన్స్‌లో పరిశ్రమ అవసరాలకు సిద్ధంగా ఉన్న (ఇండస్ట్రీ రెడీ) క్వాంటమ్ ప్రతిభపై దృష్టి పెడతాం. అప్లయ్ ట్రైనింగ్, ఎన్‌పీటెల్-ఎలైన్డ్ కోర్సుల్ని పరిశ్రమ సహకారంతో చేపడతాం.

◆ మూడో దశను నీతిఆయోగ్ లక్ష్యాలతో సమ్మిళితం చేశాం. ఐపీ క్రియేషన్, గ్లోబల్ లీడర్‌షిప్ కోసం నేషనల్ క్వాంటమ్ మిషన్ హబ్‌లతోపాటు.. అమరావతి క్వాంటమ్ వ్యాలీతో అనుసంధానమయ్యేలా అడ్వాన్స్‌డ్ రీసెర్చర్స్, స్టార్టప్ వ్యవస్థాపకులు, సిస్టమ్ బిల్డర్లు కలిపి లక్ష మంది డెవలపర్లను తయారు చేస్తాం.

నిపుణులున్నది మూడో వంతే

'ప్రభుత్వాలు, వ్యాపార, విద్యాసంస్థలు క్వాంటమ్ టెక్నాలజీల ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి క్వాంటమ్ ఎకానమీ నెట్‌వర్క్ ఒక ముఖ్యమైన వేదిక. భారతదేశంలో క్వాంటమ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతోంది' అని లోకేశ్ వివరించారు. 'ఎంఐటీ నివేదిక ప్రకారం 2018 నుంచి క్వాంటమ్ నైపుణ్య అవసరాలు మూడు రెట్లు పెరిగాయి. 2020 నుంచి క్వాంటమ్ ఉద్యోగాల్లో 180% పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం ప్రపంచ క్వాంటమ్ మార్కెట్‌కు అవసరమైన అభ్యర్థుల్లో మూడో వంతు (30 వేల మంది) మాత్రమే అర్హత కలిగిన నిపుణులున్నారు. ప్రపంచవ్యాప్తంగా 176 విశ్వవిద్యాలయాలు క్వాంటమ్ ప్రోగామ్‌లలో విద్య అందిస్తున్నాయి. వాటిలో 29 మాత్రమే గ్రాడ్యుయేట్ డిగ్రీలు ఇస్తున్నాయి. నైపుణ్యాలు, పరిశోధన, పర్యావరణ వ్యవస్థల్ని, వాణిజ్యీకరణ మార్గాల్ని ఎంత సమర్థంగా నిర్మిస్తామనే అంశంపైనే క్వాంటమ్ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది' అని స్పష్టం చేశారు. 'క్వాంటమ్ కంప్యూటింగ్ 2035 నాటికి ఒక్క లైఫ్ సైన్సెస్ రంగంలోనే 200-500 బిలియన్ డాలర్ల విలువ సృష్టిస్తుందని మెకిన్సే సంస్థ అంచనా వేసింది. ప్రపంచంలోని 50 అగ్రశ్రేణి బ్యాంకుల్లో 80% ఇప్పుడు క్వాంటమ్‌పైనే పెట్టుబడి పెడుతున్నాయి' అని లోకేశ్ వివరించారు.



దావోస్‌లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని సత్కరించి, జ్ఞాపిక అందిస్తున్న మంత్రి లోకేశ్ ★ లోకేశ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న రేవంత్‌రెడ్డి

పెట్టుబడుల సాధనలో దేశానికే ఆదర్శంగా తెలుగు రాష్ట్రాలు

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ విద్య, ఐటీశాఖ మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: పెట్టుబడుల సాధనలో తెలుగు రాష్ట్రాలు దేశానికే ఆదర్శంగా నిలవనున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు. పరస్పర సహకారంతోనే తెలుగు రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో భాగంగా గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని లోకేశ్ కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఏపీ విద్యాశాఖలో చేపట్టిన సంస్కరణలు, ఐటీ ప్రగతిని వివరించారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం తీసుకుంటున్న చర్యలు, ఫలితాలపై ఈ సందర్భంగా వారు చర్చించారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును రేవంత్‌రెడ్డి వివరించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా టాటా సంస్థ సహకారంతో ఐటీఐలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని.. స్కిల్ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఐటీఐలను సందర్శించాలని కోరారు. సమ్మక్క, సారలమ్మ వనదేవతలను దర్శించుకోవాలని లోకేశ్‌ను ఆహ్వానించారు. ములుగు జిల్లా మేడారంలో వనదేవతల సన్నిధి సమ్మక్క సారలమ్మ దేవస్థాన ఆధునికీకరణ పనులను రూ.వందల కోట్లతో చేపట్టామని వివరించారు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం చొరవ చూపలేదని.. తమ ప్రభుత్వ హయాంలోనే రహదారులు, మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు.

ఏపీలో వ్యవస్థల ఆధారంగానే నిర్ణయాలు

- వ్యక్తుల ఇష్టానుసారంగా కాదు..
- నమ్మకం, వేగవంతమైన అనుమతులే రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తున్నాయి
- దావోస్‌లో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో నిర్ణయాలు వ్యక్తుల ఇష్టానుసారంగా కాకుండా.. వ్యవస్థల ఆధారంగా జరుగుతాయని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో గురువారం ఆయన 'వృద్ధి వేగానికి పెట్టుబడులు' అనే అంశంపై జరిగిన సదస్సులో మాట్లాడారు. 'నమ్మకం, వేగమే ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తున్నాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీ ప్రత్యేకత. 2035 నాటికి 'డే-జీరో రెడీ స్టేట్'గా గుర్తింపు పొందడమే లక్ష్యం. పెట్టుబడులకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటే వారాల్లోనే అమలు ప్రారంభమయ్యేలా రియల్‌టైం డేటాతో పనిచేసే యూనిఫైడ్ డిజిటల్ గవర్నెన్స్‌ను అమలు చేస్తున్నాం. జాప్యం, అవరోధాలను ముందే గుర్తించి అందుకు అనుగుణంగా మార్పులు చేస్తాం. సమయాన్ని ఆదా చేయడమే పెట్టుబడిదారులకు పెద్ద లాభంగా మారుతుంది. పోటీలో రాష్ట్రానికి అదే ఆధిక్యతను అందిస్తోంది' అని వివరించారు. 'వివిధ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించేందుకు, వివిధ శాఖల మధ్య నెలకొన్న అంతర్గత సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి నెలకోసారి సమావేశమవుతోంది. కొత్త ప్రాజెక్టులకు వెంటనే ఆమోదం తెలియజేస్తోంది. దీంతో ప్రాజెక్టుల గ్రౌండింగ్‌కు పట్టే సమయాన్ని గణనీయంగా తగ్గించాం' అని మంత్రి పేర్కొన్నారు.



యాక్సెంచర్ చీఫ్ స్ట్రాటజీ, సర్వీసెస్ ఆఫీసర్ మనీష్ శర్మతో భేటీ అయిన మంత్రి లోకేశ్



'వృద్ధి వేగానికి అనుగుణంగా పెట్టుబడులు' అంశంపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేశ్. వేదికపై రెన్యూ ఛైర్మన్, సీఈవో సుమంత్ సిన్హా, కెర్నీ సీనియర్ పార్టనర్ సుకేత్ గాంధీ, కాగ్నిజెంట్ గ్లోబల్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జతిన్ దలాల్, గూగుల్ ఏసియా-పసిఫిక్ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా, కార్యక్రమ వ్యాఖ్యాత

18 నెలల్లో 50కి పైగా సంస్కరణలు

పెట్టుబడిదారుల్లో అనిశ్చితిని తగ్గించేలా చట్టబద్ధమైన కాలపరిమితుల విషయంలో డీమ్డ్ అప్రూవల్స్ విధానాన్ని ప్రవేశ పెట్టామని లోకేశ్ వివరించారు. '18 నెలల్లో 50కి పైగా సంస్కరణలు తెచ్చాం. నాలా చట్టాన్ని రద్దు చేశాం. డీ-క్రిమినలైజేషన్ దిశగా మరిన్ని చర్యలు ప్రణాళికలో ఉన్నాయి. రిస్క్ బేస్డ్ రెగ్యులేటరీ ఫ్రేమ్ వర్క్ అనుసరిస్తున్నాం. తక్కువ రిస్క్ ఉన్న ప్రాజెక్టులను వేగంగా ఆమోదిస్తాం. అధిక ప్రభావం ఉన్న ప్రాజెక్టుల విషయంలో లోతైన పరిశీలన చేస్తాం' అని లోకేశ్ తెలిపారు.

వలసలు తగ్గించేలా.. ఎంఎస్‌ఎంఈ పార్కులు

'రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. కొన్ని నగరాలకే పరిశ్రమలు పరిమితం కాకుండా..ప్రతి జిల్లాలో ఎంఎస్ఎంఈ ఆధారిత వృద్ధి ద్వారా ఉద్యోగాలు, ఆదాయం, సంపద సమానంగా పంపిణీ చేయాలన్నది లక్ష్యం. ఆగ్రో ప్రాసెసింగ్, సముద్ర ఆహార ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలకు ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. పరిశ్రమలను ప్రజలకు దగ్గరగా తీసుకురావడం ద్వారా టైర్-2, టైర్-3 నగరాల్లో వలసలు తగ్గుతాయి' అని చెప్పారు.

విశాఖలో గ్లోబల్ డెలివరీ సెంటర్ ఏర్పాటు చేయండి

యాక్సెంచర్ సీఎస్‌ఓ మనీష్ శర్మతో మంత్రి లోకేశ్ భేటీ

ఈనాడు, అమరావతి: యాక్సెంచర్ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో గ్లోబల్ డెలివరీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేశ్ కోరారు.. దావోస్‌లో గురువారం ఆయన యాక్సెంచర్ సీఎస్‌ఓ మనీష్ శర్మతో భేటీ అయ్యారు. 'విశాఖపట్నంలో మౌలిక సౌకర్యాలు, ప్రతిభ లభ్యత, పెరుగుతున్న సాంకేతికత, పర్యావరణ వ్యవస్థను ఉపయోగించుకుని ఏఐ, క్లౌడ్, డిజిటల్ కార్యకలాపాలపై దృష్టి సారించండి. యువతను భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేసేందుకు ఏపీలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించండి' అని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానమై కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. క్వాంటం కంప్యూటింగ్ అప్లికేషన్లు, పర్యావరణ వ్యవస్థ అభివృద్ధితోపాటు స్టార్టప్‌లకు మద్దతు ఇచ్చేందుకు వీలుగా అమరావతి క్వాంటం వ్యాలీలో భాగస్వామిగా ఉండాలని లోకేశ్ ఆకాంక్షించారు.

80వేల మంది ఏఐ ఫోకస్డ్ ప్రొఫెషనల్స్

'వచ్చే మూడేళ్లలో ఏఐపై ప్రపంచవ్యాప్తంగా 3 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని లక్ష్యం. ఇందులో భాగంగా బెంగళూరులో జనరేటివ్ ఏఐ స్టూడియో ప్రారంభించాం' అని యాక్సెంచర్ సీఎస్‌ఓ మనీష్ శర్మ వివరించారు. ఈ ఏడాది 80 వేల మంది ఏఐ ఫోకస్డ్ నిపుణుల్ని తయారు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇందులో అధికభాగం భారత్‌పైనే దృష్టి పెట్టామని.. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎగుమతి ఆధారిత వ్యవస్థలకు గమ్యస్థానంగా ఏపీ

- రెన్యూ పవర్ రౌండ్‌టేబుల్ సదస్సులో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ఎలక్ట్రానిక్స్, క్లీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎగుమతి ఆధారిత పారిశ్రామిక వ్యవస్థలకు నమ్మకమైన గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఏపీకి 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఉందన్నారు. దావోస్ సదస్సులో గురువారం 'ఇంధన దౌత్యం, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, డిజిటలైజేషన్' అనే అంశంపై రెన్యూ పవర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సదస్సులో ఆయన ప్రసంగించారు. 'ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రిగా డిజిటలైజేషన్ నా ప్రధాన బాధ్యత. ఏఐ, డేటా సెంటర్ల నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు పూర్తిగా డిజిటల్ ఆధారితమైనదే. ఈ రంగంలో వృద్ధికి భారీగా ఇంధనం అవసరం. స్వచ్ఛ, అంతరాయం లేని విద్యుత్తు లేకుంటే డేటా కేంద్రాలు, క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్, ఏఐ విస్తరించలేవు' అని వివరించారు. కార్యక్రమంలో కేంద్ర పునరుత్పాదక విద్యుత్ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఫాతిహ్ బిరోల్ తదితరులు పాల్గొన్నారు.

◆ విశాఖలో ఉబెర్ టెక్నాలజీ శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయాలని ఆ సంస్థ అధ్యక్షుడు మధుకన్నన్‌ను మంత్రి లోకేశ్ దావోస్‌లో కలిసి కోరారు. విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా గ్లోబల్ సేఫ్టీ ఫీచర్ ఇన్నోవేషన్‌పై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ◆ విశాఖలో హెచ్‌సీఎల్ టెక్ డెలివరీ కేంద్రం ఏర్పాటు చేయాలని, గన్నవరంలోని క్యాంపస్‌ను 20 వేల మంది ఉద్యోగులకు విస్తరించాలని మంత్రి లోకేశ్ కోరారు. దావోస్‌లో ఆయన హెచ్‌సీఎల్ సీఈఓ, ఎండీ విజయ్‌కుమార్‌తో భేటీ అయ్యారు. విశాఖలో హెచ్‌సీఎల్ టెక్ జీసీసీ ఎక్స్‌పీరియన్స్ కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ◆ రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఏపీలో 100 స్టార్టప్‌లకు మద్దతివ్వాలని.. రాష్ట్రంలోని ఐఐటీలు, విశ్వవిద్యాలయాలు, నైపుణ్య సంస్థలతో కలిసి ఉమ్మడి ఏఐ, ఇన్నోవేషన్, ఎడ్యుటెక్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని కోరారు.



హెచ్‌సీఎల్ సీఈవో, ఎండీ విజయ్‌కుమార్‌తో పెట్టుబడులపై మాట్లాడుతున్న మంత్రి లోకేశ్



ఉబర్ వైస్ ప్రెసిడెంట్ మధుకన్నన్‌ను సత్కరించి, జ్ఞాపిక అందిస్తున్న మంత్రి లోకేశ్

8-10 తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించండి

- విశ్వవిద్యాలయాలతో కలిసి పనిచేయండి
- కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ వీసీ డెబోరా ప్రెంటిస్‌తో భేటీలో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని 8-10 తరగతుల విద్యార్థుల్లో సామర్థ్య పెంపులో భాగంగా వాతావరణ మార్పులపై అవగాహనతోపాటు భవిష్యత్తు నైపుణ్యాలపై సర్టిఫైడ్ ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించాలని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ వీసీ డెబోరా ప్రెంటిస్‌ను మంత్రి నారా లోకేశ్ కోరారు. దావోస్‌లో గురువారం ఆయన ప్రెంటిస్‌తో భేటీ అయ్యారు. 'ఏపీలోని విశ్వవిద్యాలయాలతో కలిసి జాయింట్ రీసెర్చి, కరికులమ్ డెవలప్‌మెంట్, ఫ్యాకల్టీ మార్పిడిపై నిర్మాణాత్మక ఒప్పందానికి చొరవ తీసుకోవాలి. సౌతాంప్టన్-కేంబ్రిడ్జి మోడల్‌లో ఏపీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకారవేతనాలు, ప్రవేశాలు కల్పించడం ద్వారా ప్రోత్సాహం కల్పించాలి. ఏఐ, డేటా సైన్స్ ఇంజినీరింగ్ తదితర సాంకేతికతలపై జాయింట్ రీసెర్చిల కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఐఐటీ తిరుపతి వంటి సంస్థలతో కలిసి పనిచేసే అంశాన్ని పరిశీలించాలి' అని లోకేశ్ కోరారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనల్ని పరిశీలిస్తామని ఈ సందర్భంగా వీసీ డెబోరా ప్రెంటిస్ చెప్పారు.



కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ వీసీ డెబోరా ప్రెంటిస్‌తో చర్చిస్తున్న మంత్రి లోకేశ్

పాలసీ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనకు సహకరించండి

డబ్ల్యూఈఎఫ్ ఎండీ మరూన్ ఖైరౌజ్‌తో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన మౌలిక సదుపాయాలు, సైబర్ సెక్యూరిటీ, డేటా గవర్నెన్స్, సిస్టమ్ రెసిలెన్స్ కోసం రాష్ట్రస్థాయి పాలసీ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనలో సహకరించాలని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) ఎండీ మరూన్ ఖైరౌజ్‌ను రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. దావోస్ పర్యటనలో భాగంగా గురువారం ఖైరౌజ్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. సీ4ఐఆర్(సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్)కు సంబంధించి విధి విధానాలపై చర్చించారు. గతేడాది నవంబరులో విశాఖపట్నంలో జరిగిన భాగస్వామ్య సదస్సులో వరల్డ్ ఎకనమిక్ ఫోరం-ఏపీ ప్రభుత్వం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయని, దీని ద్వారా ఇంధన పరివర్తన, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలపై దీర్ఘకాలిక సహకారాన్ని అధికారికంగా ప్రారంభించామని ఖైరౌజ్ వివరించారు.

అస్తవ్యస్త విధానాలతోనే ప్రజలపై ఛార్జీల భారం

- అప్పుల ఊబిలో విద్యుత్ సంస్థలు
- 2026-27 టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో నిపుణులు, వివిధ సంఘాల ప్రతినిధులు
- మెటీరియల్ ధరల నియంత్రణకే కాస్ట్ డేటా విధానం
- ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ వెంకటరామిరెడ్డి వెల్లడి

ఈనాడు, అమరావతి: ప్రభుత్వాల అస్తవ్యస్త విధానాలతో రూ.వేల కోట్ల అదనపు విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలు మోయాల్సి వస్తోందని విద్యుత్ రంగ నిపుణులు, వివిధ సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. విద్యుత్ సంస్థలు ఏటా ట్రూఅప్ ఛార్జీల పేరుతో వేస్తున్న భారంతో పారిశ్రామికరంగం నిర్వీర్యమవుతోందని పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో జరిపే విద్యుత్ కొనుగోళ్లలో పారదర్శకత లోపించిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు.. అధిక ధరకు ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేయడం ద్వారా విద్యుత్ సంస్థలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని తెలిపారు. దీంతోపాటు విద్యుత్ సంస్థలు రూ.లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయాయని గణాంకాలతో సహా వివరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి డిస్కంలు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక(ఏఆర్ఆర్), విద్యుత్ రిటైల్ ధరలపై (టారిఫ్ ప్రతిపాదన) బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చేపట్టింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు, భాగస్వామ్యపక్షాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు అభిప్రాయాలను వెల్లడించారు. టారిఫ్‌ను నిర్దేశించే విషయంపై వ్యక్తమైన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని కమిషన్ ఛైర్మన్ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. '2025 ఫిబ్రవరి నుంచి డిస్కంలకు మేం కాస్ట్ డేటా ఇచ్చాం. ఆ ధరలకే డిస్కంలు ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రి కొనుగోలు చేయాలి. మెటీరియల్ కొనుగోళ్లపై కమిషన్ దృష్టి పెట్టలేదు. ఈ విషయంలో రాబోయే 3 నెలల్లో నిర్దేశిత విధానాన్ని తీసుకొస్తాం. విద్యుత్ రంగానికి సంబంధించి తీసుకునే నిర్ణయాల్లో ప్రభుత్వం నుంచి నాపై ఒత్తిడి లేదు' అని పేర్కొన్నారు. రైతు సంఘాలు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు హాజరై అభిప్రాయాలను వెల్లడించారు.



ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ పీవీఆర్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకుడు కాశీనాథ్, కార్పొరేటర్ సత్తిబాబు తదితరులు

సెకి.. కొందరికి ప్రియ సఖి

– పున్నారావు, ఛార్టర్డ్ ఇంజినీర్

రాష్ట్ర అవసరాలకు సరిపడా విద్యుత్ అందుబాటులో ఉంటే.. సెకి నుంచి 7 వేల మెగావాట్లు తీసుకోవాల్సిన అవసరమేంటి? అందుకే సెకిని కొందరు ప్రియ సఖిగా భావిస్తారు. పునరుత్పాదక విద్యుత్ వల్ల గ్రిడ్ నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని డిస్కంల సీజీఎంలు కమిషన్‌కు గతంలో వివరించారు. డిస్కంలు మాత్రం పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల కోసం పరుగులు పెడుతున్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్లు అధిక ధరకే కొన్నారు

– ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ ఐపీఎస్ అధికారి, సెంటర్ ఫర్ లిబర్టీ ఛైర్మన్



ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాల కొనుగోళ్లలో పారదర్శకత లేదు. షిర్డీసాయి కంపెనీకి ఏకపక్షంగా ఎస్‌పీడీసీఎల్ దోచిపెడుతున్న అంశాన్ని సాక్ష్యాలతో సహా కమిషన్ దృష్టికి తీసుకెళ్లాం. అవన్నీ అవాస్తవాలని డిస్కం ఏకవాక్యంలో సమాధానం ఇచ్చింది. టెండరు నిబంధనల్లో మార్పులు తెచ్చి మరీ 90శాతం ఆర్డర్లు ఒకే సంస్థకు ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది? దీనివల్ల రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఈలు ఏమవుతాయి? ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్లు.. దేశంలో ఎక్కడా లేని విధంగా 5 స్టార్ రేటింగ్ వాటిని ఎందుకు కొనాల్సి వచ్చింది? స్టార్ 2 రేటింగ్ ట్రాన్స్‌ఫార్మర్ ధరతో పోలిస్తే రూ.65 వేలు అధికం. 2022 నుంచి ఒక పద్ధతి ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్లలో దుర్వినియోగం జరిగింది.

రైల్వేలకు టారిఫ్ తగ్గించకుంటే.. ఓపెన్ యాక్సెస్‌కు వెళ్తాం

– దినేష్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్

డిస్కంలకు రైల్వే అతిపెద్ద వినియోగదారు. సగటున యూనిట్‌కు రూ.9.25 చొప్పున టారిఫ్‌ను డిస్కంలు వసూలు చేస్తున్నాయి. ఇది దేశంలో అధిక టారిఫ్. పొరుగున ఉన్న తెలంగాణ, కర్ణాటకలో యూనిట్‌కు రూ.7 చొప్పున చెల్లిస్తున్నాం. కేరళలో చెల్లించే ఛార్జీలతో పోలిస్తే.. యూనిట్‌కు రూ.3-4 అధికంగా చెల్లిస్తున్నాం. అధిక టారిఫ్ భరించే పరిస్థితి లేక.. ఓపెన్ యాక్సెస్‌కు వెళ్లాలని భావిస్తున్నాం. ఓపెన్ యాక్సెస్ రేటును బెంచ్ మార్క్‌గా చేసుకుని.. టారిఫ్‌ను నిర్దేశించాలి.

స్మార్ట్ మీటర్లు ఎందుకు పెడుతున్నారు

– కాశీనాథ్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు

విద్యుత్ సంస్థల విషయంలో ప్రభుత్వాలన్నీ ఒకే తీరులో వ్యవహరిస్తున్నాయి. వివిధ పేర్లతో విద్యుత్ వినియోగదారులపై రూ.25 వేల కోట్ల భారాన్ని వేశాయి. స్మార్ట్ మీటర్లు పగులగొట్టాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పిలుపునిచ్చి.. ఇప్పుడు వాటిని ఎందుకు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం బకాయిలు వెంటనే చెల్లించాలి.

పారిశ్రామిక రంగం ఇబ్బందులు పడుతోంది

– ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధి

పారిశ్రామిక రంగం ఇంధన సర్దుబాటు ఛార్జీల(ఎఫ్‌పీపీసీఏ)తో ఇబ్బందులు పడుతోంది. ప్రత్యేకించి టెక్స్‌టైల్ కంపెనీలు సమస్యలు ఎదుర్కొంటున్నాయి. వాటికి కిలోకు వచ్చే లాభం రూ.2-3 మాత్రమే. వచ్చిన లాభం విద్యుత్ ఛార్జీలకే సరిపోతుంది. ఇంధన సర్దుబాటు ఛార్జీల కింద యూనిట్‌కు 40 పైసల చొప్పున వసూలు చేసే నిబంధనను కమిషన్ ఉపసంహరించాలి.

ముగిసిన సీఎం దావోస్ పర్యటన

రాష్ట్రానికి తిరుగు ప్రయాణం • 4 రోజులు.. 36 సమావేశాలు

ఈనాడు, అమరావతి: దావోస్‌లో నాలుగు రోజుల పర్యటనను ముగించుకుని సీఎం చంద్రబాబు గురువారం సాయంత్రం రాష్ట్రానికి బయలుదేరారు. శుక్రవారం ఉదయం 8.25 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుని.. అక్కడి నుంచి నేరుగా సచివాలయానికి వస్తారు. పర్యటనలో భాగంగా సీఎం 36 సమావేశాల్లో పాల్గొన్నారు. వివిధ దేశాల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఆర్సెలార్ మిత్తల్ సంస్థ ఛైర్మన్ లక్ష్మీ మిత్తల్, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్, ఐబీఎం సీఈవో అర్వింద్ కృష్ణ సహా 16 దిగ్గజ పారిశ్రామిక సంస్థల అధినేతలతో సీఎం సమావేశమయ్యారు. తొమ్మిది సెషన్లు, సమావేశాల్లో పాల్గొని.. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను పెంచేలా ప్రసంగించారు. యూరప్‌లోని తెలుగు ప్రజలతో మమేకం అవుతూ తెలుగు డయాస్పొరా సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ పాలసీలను అంచనా వేసేందుకు ప్రపంచ ఆర్థిక సదస్సు దోహదం చేసిందని సీఎం అభిప్రాయపడ్డారు.



ఇతరులతో పోటీని ఇలా అధిగమించండి

- ✦ మొదలుపెట్టిన పనిని మధ్యలో ఆపకుండా పూర్తిచేయడం.
- ✦ పనిలో షార్ట్‌కట్‌ల కన్నా ముందు ప్రాథమిక అంశాలపై పట్టు సాధించడం. ✦ ఇతరులు ప్రణాళికలతో కాలం గడుపుతుంటే, మీరు ఆచరణలో బిజీగా ఉండటం.
- ✦ అడక్కుండానే బాధ్యతలు తీసుకోవడం. ఇలా చేస్తే 99 శాతం మంది కన్నా మీరు ముందుంటారు.

– డాన్ మార్టెల్, రచయిత

అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గురుకులాల విజయవాడ సమన్వయకర్త ఎ.మురళీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 10 తరగతులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం జనరల్, ఐఐటీ-నీట్ ప్రవేశాలకు బాల బాలికలు ప్రవేశాలు పొందవచ్చు.
ఫిబ్రవరి 19వ తేదీ కల్లా https:///apbragcet.apcfss.in వెబ్‌సైట్ (ఆన్‌లైన్)లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు విజయవాడ ప్రభుత్వ అతిథి గృహ ఆవరణలోని సమన్వయ అధికారి కార్యాలయం లేదా ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలలు/ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లను సంప్రదించవచ్చని సూచించారు.

కార్తికేయుని కల్యాణం చూతము రారండి..

మోపిదేవి, న్యూస్‌టుడే : మోహినీపురంగా భాసిల్లుతున్న మోపిదేవిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందడి ప్రారంభమైంది. గురువారం స్వామిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ దంపతులు, ఆయన కుమారుడు వెంకట్రామ్ దంపతులు పాల్గొని చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాలు, దేవదాయ శాఖ తరపున పట్టువస్త్రాలను ఆలయ ప్రదక్షిణలు చేసి ప్రధానార్చకుడు బుద్ధు పవన్ కుమార్ శర్మ, వేదపండితులకు అందించారు. వాటిని స్వామికి, అమ్మవార్లకు అలంకరించారు. భక్తులు, గ్రామస్థులు, చల్లపల్లి ఎస్టేటు దేవాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రాత్రికి యాగశాల ప్రవేశం, ధ్వజపట అధిరోహణ నిర్వహించారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు దివ్య కల్యాణం నిర్వహించనున్నారు.


పట్టువస్త్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు

ఆలయ కార్య నిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబు, తహసీల్దార్ హరనాథ్, సీఐ ఈశ్వరరావు, ఎస్సైలు గౌతమ్‌కుమార్, ఆంజనేయులు, వేమన చందన, రథమిచ్చిన దాత అట్లూరి నారాయణరావు, శివమస్తు క్రియేషన్స్ బృందం, ఆలయ పర్యవేక్షకులు అచ్యుత మధుసూదనరావు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు

తొలిదశలో రూ.2 కోట్ల చెల్లింపు.. దుర్గగుడి, విద్యుత్తు శాఖ మధ్య వివాదం పరిష్కారం

వివరాలు.. లోపలి పేజీలో

దాటలేని వేదన.. దాచలేని రోదన!

- ప్రధాన జాతీయ రహదారుల్లో కన్పించని సర్వీస్‌రోడ్లు
- దారి దాటుతూ.. అపసవ్య ప్రయాణాలతో ప్రమాదాలు

ఎన్‌హెచ్ 65, 30, 216 జాతీయ రహదారుల తీరు.. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుంది. రోడ్ల నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా సర్వీసు రోడ్లు లేక నెత్తురోడుతున్నాయి. సమీప గ్రామాలవారు, వాహనదారులు నిత్యం ప్రమాదాల్లో ప్రాణాలు వదులుతున్నారు. అయినా అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో కదలిక లేదు. ఇప్పటికైనా మేల్కొని సర్వీస్ రోడ్లు నిర్మించాలి.

ప్రాణాలే బలి..

- **మూలపాడు** వాసి నరసింహారావు(41) ఇబ్రహీంపట్నం నుంచి మూలపాడుకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని అక్కడే మృతిచెందారు. సర్వీస్ రోడ్డు లేకనే దుర్ఘటన జరిగింది.
- **గొల్లపూడి** నుంచి గుంటుపల్లి వెళ్తున్న బడిపిల్లల ఆటోను కారు ఢీకొనగా.. ఇద్దరు పిల్లలు చనిపోయారు. అదే సర్వీస్ రోడ్డు ఉంటే ప్రమాదం జరిగేది కాదు.
- **విజయవాడ** నుంచి నెలల బిడ్డతో ఓ మహిళ కీసరలో బంధువుల ఇంటికెళ్తూ టోల్‌ప్లాజా దగ్గర బస్ దిగింది. గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టింది. నెలల బిడ్డ అక్కడే చనిపోగా.. ఆమె ఆసుపత్రిలో ప్రాణాలొదిలింది.

2025 జనవరి నుంచి డిసెంబరు వరకు ఇలా...

జాతీయ రహదారి	✦	★	✪
విజయవాడ–హైదరాబాద్	126	43	102
బెజవాడ–బందరు (NH 65)	144	77	147
కోల్‌కతా–చెన్నై (NH 16)	209	79	191
ఇబ్రహీంపట్నం–ఛత్తీస్‌గఢ్ (NH 30)	89	16	92
కత్తిపూడి–ఒంగోలు (NH 216)	100	22	78
మొత్తం	668	237	610

✦ ప్రమాదాలు ★ మృతులు ✪ క్షతగాత్రులు


భవానీపురం జంక్షన్‌లో గందరగోళం

NH 30 ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లి పారిశ్రామికవాడ వరకు 6 కి.మీ అత్యంత ప్రమాదకరం. వీటీపీఎస్ ఉద్యోగులు, పారిశ్రామికవాడలో వందల మంది ద్విచక్ర వాహనాలపై నిత్యం రోడ్డు దాటతారు. సర్వీస్ దారులు లేక ఏటా పదుల ప్రమాదాలు జరుగుతున్నాయి.

పరిశీలన


రాయనపాడు వద్ద రాంగ్‌రూట్‌లో..

NH 65 — దినదినగండం..

★ కంచికచర్ల బైపాస్ పరిధిలో 6 కి.మీ మినహా సర్వీస్ రోడ్లు లేవు. పేరికలపాడు నుంచి కంచికచర్ల వచ్చిన వారు తిరిగి వెళ్లేందుకు రోడ్డు దాటాల్సిందే. ఈక్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ★ చినఆవుటపల్లి-గొల్లపూడి వరకు పశ్చిమ బైపాస్‌పై సర్వీస్ రోడ్లు లేక గ్రామస్థులు అల్లాడుతున్నారు. ప్రయాణాలు మొదలైనప్పటి నుంచి 5 ప్రమాదాలు జరిగాయి.

జాగ్రత్త గురూ...

★ అత్యంత రద్దీగా ఉండే విజయవాడ-హైదరాబాద్ రహదారిపై సర్వీస్ రోడ్లు లేక సమీప గ్రామాలకు ప్రయాణం కత్తిమీద సాములా మారింది. విజయవాడ నుంచి నందిగామ వరకు రహదారికి ఇరువైపులా గ్రామాలు, ఆవాసాలు, దుకాణ సముదాయాలు భారీగా ఉన్నాయి. దీంతో స్థానికంగా రాకపోకలు సాగించాలంటే రోడ్డు దాటాల్సిందే. ★ గొల్లపూడి, సూరాయపాలెం, గుంటుపల్లి, తుమ్మలపాలెం, ఇబ్రహీంపట్నం, కీలేశపురం, జూపూడి, మూలపాడు, దొనబండ, కంచికచర్ల పరిధిలో కీసర గండేపల్లి, పెండ్యాల, వేములపల్లి, పేరికలపాడు అడ్డరోడ్డు, నందిగామ పరిధిలో కంచల, ఐతవరం, అంబారుపేట, అనాసాగరం, మునగచర్ల అడ్డరోడ్డుల్లో ఏటా వందల ప్రమాదాలు జరిగి.. పదుల ప్రాణాలు పోతున్నాయి. ★ నిరుడు ప్రధాన జాతీయ రహదారుల్లో 668 ప్రమాదాలు జరిగితే వీటిలో 50 శాతంపైగా సర్వీస్ రోడ్లు లేక జరిగినవే. సర్వీస్ రోడ్లు ఉంటే ప్రమాదాలు తగ్గి.. ప్రాణనష్టమూ దాదాపు నివారించవచ్చు.

\- ఈనాడు, అమరావతి

..అలా స్నేహం కుదిరింది

- ప్రతి ఖాతాకు రూ.25 వేలు ఇచ్చేలా ఒప్పందం
- హోటల్‌లో కలిసి మౌలాలి, సూర్య ప్రణాళిక

ఈనాడు - అమరావతి: చట్ట విరుద్ధ కార్యకలాపాలకు వినియోగించేందుకు ప్రైవేటు బ్యాంకు మాజీ ఉద్యోగి మౌలాలి (ఏ6) పెద్దఎత్తున బ్యాంకు ఖాతాలు సమకూర్చాడు. ఇలా మూడేళ్లలో సూర్య (ఏ1)కు దాదాపు వందకుపైగా కరెంటు, పొదుపు ఖాతాలను ఇచ్చాడు. అద్దె ఖాతాల కేసు విచారణలో కీలక అంశాలు బయటకు వస్తున్నాయి. రెండో రోజు గురువారం కస్టడీలో సూర్య, సౌభాగ్యలక్ష్మిని పోలీసులు విచారించి వివరాలు రాబట్టారు.

ఇతర రాష్ట్రాల ఖాతాలూ ఇచ్చాడు...

మ్యూల్ ఖాతాలు తెరిచే ప్రయత్నంలో ప్రధాన నిందితుడు సూర్య.. విజయవాడ ఏలూరు రోడ్డులోని ఓ ప్రైవేటు బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ పనిచేసే మౌలాలి పరిచయం అయ్యాడు. కొత్తగా కరెంట్ ఖాతాలు తెరవాలని, నిబంధనలు ఏంటని ఏ1 వాకబు చేశాడు. మరిన్ని వివరాల కోసం సాయంత్రం హోటల్‌లో కలుద్దామని మౌలాలి చెప్పాడు. దీంతో ఆరోజు సాయంత్రం హోటల్‌లో కలిసి మాట్లాడుకున్నారు. తనకు కమీషన్ ఇస్తే సాయం చేస్తానన్నాడు. ప్రతి ఖాతాకు రూ.40 వేలు ఇవ్వాలని మౌలాలి కోరాడు. చివరకు రూ.25 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. ఇలా స్థానిక ఖాతాలతోపాటు ఇతర రాష్ట్రాల వాటినీ సూర్యకు అందజేశాడు. 2022 నుంచి ఇద్దరి మధ్య బంధం బలపడింది. ఆగ్రా పోలీసులు మౌలాలిని గతంలో అరెస్టు చేయడంతో.. ఆయన పనిచేసే ప్రైవేటు బ్యాంకు విధుల నుంచి తొలగించింది. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. ఇతను దొరికితే ఇతర రాష్ట్రాల మూలాలు వెలుగుచూసే వీలుంది.

అంతా ఆయనే చేశాడు...

అద్దె ఖాతాల విషయంలో తనకేమీ తెలియదని.. అంతా తన భర్త కృష్ణారెడ్డి (ఏ3) చూసుకునే వాడని సౌభాగ్యలక్ష్మి వెల్లడించింది. ఆమె స్వయంగా విజయవాడలోని సిటీ యూనియన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, తదితర బ్యాంకుల్లో పొదుపు, కరెంటు ఖాతాలను తెరిచి, వాటిని దంపతులు సూర్యకు అందజేశారు. ఇంటి చుట్టుపక్కల వారితోనూ సౌభాగ్యలక్ష్మి ఖాతాలు తెరిపించింది. తన భర్త చెబితేనే ఖాతాలు తెరిపించినట్లు వెల్లడించింది. నిందితుడు కృష్ణారెడ్డి అనారోగ్యంతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో కస్టడీకి తీసుకోలేదు. కోలుకున్నాక మరోసారి కోర్టులో పిటిషన్ దాఖలు చేసి విచారణకు తీసుకునే వీలుంది.

ఆగని రచ్చ.. సాగని చర్చ

మమ అన్పించేలా జడ్పీ స్థాయీ, బడ్జెట్ సమావేశాలు



ప్రొటోకాల్ అంశంపై పోడియం వద్ద అభ్యంతరాలు తెలుపుతున్న సభ్యులు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : ప్రజా ప్రయోజనకరంగా, ఎంతో అర్థవంతంగా నిర్వహించాల్సిన జడ్పీ స్థాయీ సంఘాల, బడ్జెట్ సమావేశాలు యథావిధిగా రచ్చ..కొనసాగని చర్చ అన్నట్టుగానే సాగాయి. ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన గురువారం నిర్వహించిన 2025-26 సవరణ బడ్జెట్, స్థాయీ సంఘ సమావేశాలు మొక్కుబడి తంతుగా మారాయి. సమయాభావం పేరుతో ఏడు స్థాయీ సంఘాలపై సవివరమైన చర్చ లేకుండా కేవలం ప్రశ్నోత్తరాలకే పరిమితం చేశారు. తాము ఎత్తిచూపుతున్న సమస్యలపై ఏ మాత్రం దృష్టి పెట్టకుండా అధికారులు మభ్యపెట్టే సమాధానాలతో సరిపెడుతున్నారంటూ పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆరోపించారు.

ప్రత్యామ్నాయం చూపకుండా.. మొవ్వలో సంక్షేమ వసతిగృహాన్ని ఏకపక్షంగా కూలగొట్టి అందులోని దాదాపు 70 మంది విద్యార్థులకు మరో ప్రత్యామ్నాయం చూడకుండా 800 మంది విద్యార్థులున్న హైస్కూల్‌లో వసతి కల్పించడంపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ అంశంపై సాంఘిక సంక్షేమశాఖాధికారిని ఫోన్ ద్వారా సంప్రదిస్తే ఆయన తన, స్థానిక పెద్దలతోనూ మాట్లాడిన అభ్యంతరకర తీరును వివరిస్తూ అధికారిపై చర్యలు తీసుకోవాలని మొవ్వ జడ్పీటీసీ సభ్యుడు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై మరికొందరు సభ్యులు తీవ్రంగా స్పందించడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని సీఈవో హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు.

☛ స్ఫూర్తి కిట్ల పంపిణీతో పాటు ఇతర అంశాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదంటూ సభ్యులు పోడియం వద్ద అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారిక కార్యక్రమాలకు తమకు ప్రాధాన్యం ఇవ్వకుండా నేరపూరిత చరిత్ర ఉన్న ప్రజాప్రతినిధులు కాని వారిని ఆహ్వానిస్తూ వారికి పిల్లలతో స్వాగతం పలికించడాన్ని రెడ్డిగూడెం సభ్యులు తప్పుపట్టారు. బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

స్పష్టమైన సమాధానాలు లేవు .. ఏడు స్థాయీ సంఘాలకు సంబంధించిన సమావేశంలో వ్యవసాయం, విద్య అంశాలపై, దాళ్వా లేని చోట ప్రత్యామ్నాయ పంటలు, యూరియా కొరత, ముగ్గురే విద్యార్థులున్నారన్న కారణంతో లోపూడి గ్రామంలో పాఠశాల మూసివేతపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత అధికారులు సూటిగా, స్పష్టంగా సమాధానాలు ఇవ్వలేదు. అందుకు సంబంధించిన అనుబంధ ప్రశ్నలు మినహా ఇతర అంశాలపై చర్చకు అవకాశం లేకుండా సమావేశాలు ముగిశాయి.

రూ.136.47 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం.. 2026-27 ఏడాదికి రూ.136.47 కోట్ల ముగింపు నిల్వతో బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. 2025-26 సవరణ బడ్జెట్‌లో రూ.120.34 కోట్ల ముగింపు నిల్వగా చూపగా, దాన్ని 2026-27 సంవత్సరపు ప్రారంభ నిల్వగా, రూ.2,140.12 కోట్లు ఆదాయం, రూ.2,123.99 కోట్లు ఖర్చుగా చూపిన బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనంద కుమార్, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

25న బాడీ బిల్డింగ్ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు: కానూరులోని అశోక్ జిమ్‌లో ఈ నెల 25న ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్ జట్ల ఎంపికలు నిర్వహిస్తామని ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్, ఫిట్‌నెస్ సంఘం అధ్యక్షుడు బి.మనోహర్, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. ఎంపికలు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికైన జూనియర్స్ క్రీడాకారులు వచ్చే నెల 7, 8 తేదీల్లో తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ బొమ్మకల్‌లో జరిగే 16వ జూనియర్స్ బాడీ బిల్డింగ్ పోటీల్లో, సీనియర్స్ క్రీడాకారులు మార్చి నెల 28, 29 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో జరిగే 17వ సీనియర్స్ బాడీ బిల్డింగ్ పోటీల్లో తలపడతారని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు ఒరిజనల్, జిరాక్స్ కాపీతో 25వ తేదీ ఉదయం 7 గంటలకు అశోక్ జిమ్‌లో హాజరవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 86867 71358 నంబరుపై సంప్రదించాలన్నారు.

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన



లోటస్ ల్యాండ్ మార్క్ వద్ద చర్చిస్తున్న ఆర్డీవో చైతన్య, తహసీల్దార్ సూర్యారావు, రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రభుత్వం అటాచ్ చేసిన అగ్రిగోల్డ్ భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సేకరించిన వివరాలతో నివేదికను రూపొందించనున్నట్లు విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య తెలిపారు. అగ్రిగోల్డ్ భూముల భౌతిక పరిశీలనకు ప్రత్యేక కమిటీ ఏర్పడింది. విజయవాడ ఆర్డీవో, జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు రెవెన్యూ, సమాచార శాఖలు, విజయవాడ నగర పాలక సంస్థ, సీఐడీ, ఈ-ఆక్షన్ తదితర శాఖలతో కూడిన ఈ కమిటీ నగరంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం పర్యటించింది. లోటస్ ల్యాండ్ మార్క్, పాయకాపురం, వాంబేకాలనీలోని మూడు సర్వే నంబర్లలోని భూములను పరిశీలించింది. ఆర్డీవో మాట్లాడుతూ... అగ్రిగోల్డ్ భూములకు సంబంధించి తాజాగా మూడు ఆస్తుల భౌతిక పరిశీలన చేసినట్లు చెప్పారు. సేకరించిన ఆస్తుల సమాచారం మేరకు లిటిగేషన్ లేని భూముల వేలం ప్రక్రియను సులభతరం చేసేందుకు వీలుగా రికార్డ్స్, ప్రత్యక్ష విలువ, మ్యుటేషన్ తదితర వివరాలతో నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. జిల్లా రిజిస్ట్రార్ పి.వి.వి.దుర్గా ప్రసాద్, ఉత్తర రెవెన్యూ మండల (అజిత్‌సింగ్‌నగర్) తహసీల్దార్ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జాతీయ పట్టు వస్త్రాల ప్రదర్శన



చీరను చూపుతున్న మహిళ..

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: లబ్బీపేటలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోంది. దేశంలోని వివిధ రాష్ట్రాల సాంస్కృతిక, సంప్రదాయాలకు ప్రతిబింబించే మగ్గం ఉత్పత్తులు, పట్టు వస్త్రాలు ప్రదర్శనలో ఉంచారు. మహారాష్ట్రకు చెందిన సొగసైన పైథాని సిల్క్ చీరలు, బెంగళూరు సిల్క్స్, సాఫ్ట్ సిల్క్స్, కాషిదా సిల్క్స్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, లినెన్ చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వివాహాల సందర్భంగా కుటుంబ సమేతంగా వచ్చి సంప్రదాయ వస్త్రాలను కొనుగోలు చేసేందుకు మంచి అవకాశమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈనెల 26 వరకు జరిగే ఈ ప్రదర్శనలో కొనుగోళ్లపై 50 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు.

పుస్తకాల పంపిణీ నేడు

ఈనాడు డిజిటల్, అమరావతి : వసంత పంచమిని పురస్కరించుకుని శుక్రవారం కేంద్ర కమ్యూనికేషన్ సహాయ మంత్రి డా.చంద్రశేఖర్ పెమ్మసాని ప్రేరణతో పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు విజయవాడ డివిజన్ తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ ఎం.నరసింహస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని కాళేశ్వరరావు మార్కెట్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. నాలుగు, అయిదో తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు నీతి కథలు, తపాలా బిళ్లల సేకరణకు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి పుస్తకంతో పాటు మంత్రి సందేశంతో కూడిన పోస్ట్‌కార్డును అందించనున్నట్లు తెలిపారు. జ్ఞానపోస్ట్ ద్వారా విద్య, సాంస్కృతిక, సామాజిక, ధార్మిక పుస్తకాలను తక్కువ ధరలకు పంపించవచ్చని, ఈ సేవ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సీపీఐ శతాబ్ది వేడుకలు.. మరో వందేళ్లకు స్ఫూర్తి



మాట్లాడుతున్న రామకృష్ణ. చిత్రంలో ఈశ్వరయ్య తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించిన సీపీఐ శతవార్షికోత్సవ ముగింపు సభ మరో వంద సంవత్సరాలకు స్ఫూర్తిగా నిలిచిందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన దాసరి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు సభకు విచ్చేశారని చెప్పారు. ఒక రాజకీయ పార్టీ వంద సంవత్సరాల పాటు నిలబడడమే గొప్ప విషయమైతే.. వంద సంవత్సరాల ముగింపు సభ మరో వంద సంవత్సరాలకు స్ఫూర్తినిచ్చేలా జరిగిందన్నారు. దేశంలో నెలకొన్న ప్రమాదకరమైన పరిస్థితులు, రాజకీయ పరిణామాలపై సభలో చర్చించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఒక పెద్ద జాతాను ముందుకు తీసుకువస్తున్నామని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ.. ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ పతాకాల ఆవిష్కరణలు, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలి, ప్రజాస్వామ్య లౌకిక వ్యవస్థను రక్షించుకోవాలనే డిమాండ్లతో మండల కేంద్రాల్లో ప్రతిజ్ఞలు చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అఘాయిత్యం.. పోక్సో కేసు

గుణదల(పటమట), న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో బాలికకు దగ్గరైన యువకుడు ఆమెపై అత్యాచారానికి పాల్పడిన ఘటన మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రీస్తురాజపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... క్రీస్తురాజపురానికి చెందిన 15 ఏళ్ల బాలిక 8వ తరగతి చదువుతోంది. ఇంటి సమీపంలో ఉండే వసంత్ ప్రేమిస్తున్నానని మభ్యపెడుతూ పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక పాఠశాలకు తరుచూ వెళ్లకపోవడం గమనించి గత నెలలో ఆమె తల్లి హనుమాన్‌పేటలోని చైల్డ్ హోమ్‌కు పంపారు. అక్కడ సభ్యులకు బాలిక జరిగిన విషయం తెలిపింది. దీంతో హోమ్ సభ్యులు మాచవరం పోలీసులకు సమాచారం అందించారు. మాచవరం పోలీసులు వసంత్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.


చెవుటూరు పాఠశాలలో రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించిన రమాదేవి, కిరణ్ తదితరులు

గిడుగు రామ్మూర్తి సేవలు ఎనలేనివి

జి.కొండూరు, న్యూస్‌టుడే: తెలుగు భాషావేత్త గిడుగు రామ్మూర్తి వర్ధంతిని గురువారం చెవుటూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు కిరణ్, అంజనేయులు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

శిరస్త్రాణం తప్పనిసరి

ఇబ్రహీంపట్నం: చిన్న నిర్లక్ష్యం కుటుంబాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేస్తుందని ట్రాఫిక్ ఎస్సైలు కృష్ణ, లక్ష్మణరావు పేర్కొన్నారు. శిరస్త్రాణం ధారణపై జాతీయ రహదారి(65) ఇబ్రహీంపట్నంలో అవగాహన కల్పించారు. శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారిని నిలిపి.. తప్పనిసరిగా ధరించాలని అవగాహన కల్పించారు.

దక్షిణామూర్తికి విశేష పూజలు



గొసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండల పరిధి గొసవీడులోని విశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం అర్చకులు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మేధా దక్షిణామూర్తి స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అభిషేకం, అర్చన, అలంకారం చేశారు. భక్తులు దర్శించుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? కొండపల్లి విద్యుత్తు వినియోగదారుల సేవా కేంద్రం నుంచి ఇబ్రహీంపట్నం రోడ్డుకు వెళ్లే క్రమంలో రహదారి అప్రోచ్ సరిగా లేక ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - వెంకటేశ్వరరావు, స్థానికుడు ✔ అధికారి గతంలో పరిశీలించారు. మళ్లీ సిమెంటు వ్యర్థాలను పోయించి ఇబ్బంది లేకుండా చేస్తాం. ? కొండపల్లి ఆర్‌ వంపుల కాలనీ రెవెన్యూ స్థలంలో చెత్తను పడవేయడం వల్ల దుర్గంధం, ఈగలు, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. - రాజా, స్థానికుడు ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. - పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ - న్యూస్‌టుడే, కొండపల్లి ? జి.కొండూరు బీసీ కాలనీలోని హాస్టల్ వద్ది సమీపంలో కృష్ణా జలాల కుళాయిలు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నాం. - గోపి, గ్రామస్థుడు ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి కుళాయిలు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరిస్తాం. - బసవ లింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందన: తిరువూరు పట్టణ 9వ వార్డులోని డ్రెయిన్‌లో మురుగు నిలిచి దోమలు పెరిగి ఇబ్బందిగా ఉందని స్థానికుడు రాంబాబు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్‌ పూడికను తొలగించారు. ☛ 14వ వార్డులోని డ్రెయిన్‌లో పూడిక పేరుకుందని స్థానికుడు ప్రశాంత్ కుమార్ 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన శానిటరీ అధికారి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

ఇతరుల సమస్యకు చెక్..!

ఆన్‌లైన్‌లో భూమి 'అదర్స్' అని ఉంటే మార్చుకునే అవకాశం

మైలవరం, న్యూస్‌టుడే

మూజువాణి పంపకాలు.. ఆన్‌లైన్‌లో నమోదు కాని పేర్లు.. దీర్ఘకాలంగా భూమి సాగులోనే ఉన్నా.. ఇతరులుగా (అదర్స్) రికార్డుల్లో ఉన్న రైతుల బాధలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆ కష్టాలను తొలగించేందుకు ప్రభుత్వం జారీ చేసిన తాజా ఆదేశాలు రైతులకు వరంగా మారనున్నాయి. రీ సర్వే జరిగిన, జరగని గ్రామాల్లో రికార్డుల్లో పేర్లు నమోదు కాక ఇబ్బందులు పడుతున్న వారికి ఊరట కలిగేలా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. తాతల కాలం నాటి ఆస్తులను పంచుకున్నా.. అనివార్య కారణాలతో చాలా మంది రైతుల పేర్లు వెబ్‌ల్యాండ్/ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. అలాంటి రైతులకు ప్రభుత్వ పరంగా ఎటువంటి లబ్ధి చేకూరడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నెలన్నర కిందట నుంచి అటువంటి వాటిపై సవరణలు నిలిపి, తాజాగా సులభతర మార్గదర్శకాలను విడుదల చేస్తూ మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చింది.

దరఖాస్తు ఇలా..

ఇప్పటికే చాలా గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. అలాంటి గ్రామాల్లో ఇంకా రైతుల పేర్ల స్థానంలో 'ఇతరులు' అని ఉంటే.. వారు గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు వారి వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలు, ఆస్తుల పంపకం రికార్డు కలిగిన ఉన్న వ్యక్తుల మరణ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన పత్రాలను జతచేయాలి.

☛ మరోవైపు రీ సర్వే జరగని గ్రామాల్లో ఇతరుల పేరిట భూములున్నాయి. వాటికి సంబంధించిన అర్హత కలిగిన వారు గ్రామ వీఆర్వోలు ధ్రువీకరణ పత్రాలతో కలవాల్సి ఉంటుంది. అతని లాగిన్ నుంచి వివరాలు నమోదు అనంతరం ఆర్డీవో స్థాయి వరకు పరిశీలించి రికార్డుల్లో పేర్లు నమోదు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

వెంటనే పరిష్కరిస్తాం

ఇతరుల రికార్డులకు సంబంధించి సవరణల కోసం కొన్ని రోజుల పాటు ప్రక్రియ ఆగింది. ప్రస్తుతం జీవో విడుదలైంది. రీ సర్వే జరిగిన, జరగని గ్రామాల్లో నిబంధనల మేరకు రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాం. అన్ని అర్హతలు కలిగిన వారి పేర్ల నమోదుకు కనీసం 30 రోజుల సమయం పడుతుంది. - అబ్దుల్ దరియా, తహసీల్దార్, మైలవరం

24న పాఠశాలల సముదాయ సమావేశాలు

గంపలగూడెం, ఎ.కొండూరు: ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఈ నెల 24న శనివారం పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని ఎ.కొండూరు ఎంఈవో-2 కేశవరావు తెలిపారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల పరిధిలో మొత్తం 12 క్లస్టర్లలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నారు.

కచ్చితంగా హాజరు కావాల్సిందే..: ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత, కేజీబీవీ, గురుకుల, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు కచ్చితంగా సమావేశాలకు హాజరు కావాల్సి ఉంది. 24న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 వరకు క్లస్టర్ వారీగా ఎంపిక చేసిన జడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశాలు జరుగుతాయి. సబ్జెక్టు ఉపాధ్యాయులు (ఎస్‌ఏ) మండల కేంద్రంలో, ఎస్జీటీలు తమకు కేటాయించిన పాఠశాలల్లో సముదాయ సమావేశాలకు హాజరు కావాల్సి ఉంది. సమావేశంలో విద్యార్థుల ప్రగతి, దీర్ఘకాలిక గైర్హాజరు, ఎఫ్‌ఏ-3 పరీక్ష మార్కులు నమోదుపై సమీక్షిస్తారు. ఉపాధ్యాయుల చేతి పుస్తకాలు, జీఎఫ్‌ఎల్‌ఎన్ 75 రోజుల కార్యాచరణ ప్రణాళిక, పదో తరగతి వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై చర్చిస్తారు. విద్యార్థుల సామర్థ్యాల ఆధారిత మూల్యాంకనం, సీబీఏ ప్రాధాన్యత, ఎఫ్‌ఏ-4, ప్రీ పబ్లిక్ పరీక్షలు, హాలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు, డిజిటల్ పాఠాల వినియోగం, దీక్ష 2.0 లాగిన్ విధానం, ఎన్సీఈఆర్టీ ఉత్తమ ఆచరణ వీడియోలు తదితర అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఉపాధ్యాయులు సమావేశాల్లో పాల్గొనాల్సి ఉంది.

విద్యార్థికి అభినందన

గొల్లపూడి, న్యూస్‌టుడే: రాయనపాడుకు చెందిన విద్యార్థి వాసిరెడ్డి యశ్విత్ సదాశివ జడ్జీ ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-12 విభాగంలో వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా అతన్ని మాస్టర్ జె.హరినాథ్ తదితరులు అభినందించారు.

25న వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవం



నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: గంపలగూడెం మండలం నెమలిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 25న స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవం వైభవంగా నిర్వహించేందుకు అధికారులు, పాలకవర్గం ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా రథసప్తమి రోజు స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవం నిర్వహిస్తారు. 69వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, సువర్ణాభరణాలు, నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామని అధికారులు తెలిపారు. మహాయజ్ఞంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొనే భక్తులు రూ.1,116 చెల్లించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే 84988 18111, 73822 23252 నంబరులో సంప్రదించాలన్నారు.

డిజిటల్ అరెస్టులపై అవగాహన


ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సతీష్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టులు పేరుతో వచ్చే సందేశాలకు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని జి.కొండూరు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. మండల పరిధి కోడూరులోని యూనియన్ బ్యాంకులో గురువారం ఆయన ఖాతాదారులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, చరవాణికి వచ్చే అనవసరపు లింకులపై క్లిక్ చేయకూడదని, ఓటీపీలను ఎవరితో పంచుకోవద్దని వివరించారు. చిననంది గామ సర్పంచి ధనేకుల శ్రీకాంత్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు 'నో టు డ్రగ్స్' వాకథాన్

మైలవరం, న్యూస్‌టుడే: విజయవాడలోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఉదయం 7 గంటలకు మైలవరంలో 'నో టు డ్రగ్స్' పేరిట వాకథాన్ నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఎండీ పోతినేని రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రైతుబజారు మీదుగా లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వరకు విద్యార్థులు, వివిధ యువజన సంఘాలు, సామాజిక సేవా సంఘాలు, ప్రజలతో కలిసి నిర్వహించే ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.

కోకిలంపాడులో పశు ఆరోగ్య శిబిరం

తిరువూరు: తిరువూరు మండలం కోకిలంపాడులో గురువారం పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. గొర్రెలు, మేకలు, ఆవులకు ఆరోగ్య పరీక్షలు చేసి టీకాలు, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏడీ కిషన్‌సింగ్, వైద్యులు అభిలాష్, శ్వేత, సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఇబ్రహీంపట్నం: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న అటెండర్ల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కల్యాణ్ కోరారు. సమస్యలు పరిష్కరించాలంటూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో శకుంతలకు గురువారం వినతిపత్రం అందజేశారు. వారికి కనీస వేతన చట్టం ప్రకారం రూ.26 వేలు అందించాలని పేర్కొన్నారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మైలవరం ప్రాంత యువతకు డాటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.రంగారావు తెలిపారు. పదో తరగతి ఆపైన చదివిన యువతకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నైపుణ్యాభివృద్ధి కేంద్ర అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 26వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వితరణతో సమకూరిన పౌష్టికాహారం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు అయ్యేంత వరకు సాయంత్రం పూట పౌష్టికాహారం అందించేందుకు ఎన్నారై వల్లభనేని గిరిబాబు ముందుకొచ్చారు. 300 కేజీలు శనగలను అందించారు. విస్సన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో చేకు చిన్నరాట్నాలు, ఎంఈవో శంకరరావు, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి సమక్షంలో గిరిబాబు తండ్రి వల్లభనేని వెంకటేశ్వరరావు చేతులమీదుగా పాఠశాలలకు పంపిణీ చేశారు.

ముమ్మరంగా పంటల సాగు వివరాల నమోదు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గ్రామాల్లో మొక్కజొన్న, వరి తదితర పంటలు 3,580 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం రుద్రవరం, కూనపరాజుపర్వ, కుదప, రెడ్డిగూడెం రైతు సేవాకేంద్రాలను ఆయన సందర్శించారు. పంటల సాగు వివరాలు పరిశీలించారు. మండలంలో ముమ్మరంగా పంటల సాగు వివరాలు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. పంట నమోదు చేసుకున్న వారు మాత్రమే ధాన్యం అమ్ముకోవడానికి అవకాశం ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించండి


శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడుతున్న రాధాకృష్ణకుమారి, అన్నపూర్ణదేవి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జూపూడి గ్రామపంచాయతీలో చెత్త సేకరణ, తడి పొడి చెత్త వేరుచేయడం, చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారీపై మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. డిసెంబరులో ఐవీఆర్ఎస్ ద్వారా డీపీఆర్సీ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రజాభిప్రాయాలు సేకరించారు. 50 శాతం కంటే తక్కువ సంతృప్తి వ్యక్తం చేసిన 27 గ్రామాల కార్యదర్శులు, ఏడు మండలాలకు చెందిన డిప్యూటీ ఎంపీడీవోలకు స్వచ్ఛంద్రా కార్పొరేషన్‌కు చెందిన సీఆర్‌పీ రామసీత, సిబ్బంది శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా సీపీఆర్ రాష్ట్ర పరిశీలకులు రాధాకృష్ణ కుమారి మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టు తయారు చేయడంతో పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. డీపీఆర్సీ జిల్లా సమన్వయకర్త అన్నపూర్ణదేవి, జూపూడి గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కదలదు.. దుర్వాసన వదలదు



రెడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని రాఘవాపురం వడ్డెర కాలనీ దగ్గర ఉన్న డ్రెయిన్‌లో వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, చెత్త పడేయడంతో మురుగు పారుదలకు ఆటంకం ఏర్పడుతోంది. దీంతో నీరు నిలిచి దోమలు, ఈగలకు నిలయంగా మారుతుందని స్థానికులు వాపోతున్నారు. ఈ క్రమంలో రోగాల బారిన పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వలో చెత్త పడేయకుండా చర్యలు తీసుకోని మురుగు పారుదల సక్రమంగా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

చాకుల్లా ఆకులు.. ముఖాలకు ముసుగులు


మొక్కజొన్న చేనులో శిరస్త్రాణం, ముసుగు ధరించి మందు చల్లుతున్న కూలీలు

పై చిత్రంలో కనిపించేది ముసుగు దొంగలో.. గ్రహాంతర వాసులో కాదండి. మొక్కజొన్న చేనులో ఎరువులు చల్లేందుకు వచ్చిన మహిళా కూలీలు. పొలంలో ఉంది పచ్చని ఆకులే.. కానీ పదునైన చాకుల్లా చటుక్కున శరీరాన్ని కోసేస్తాయి. మొక్కల సాళ్ల వెంబడి నడిచే క్రమంలో తీవ్రంగా గాట్లు పడుతుండటంతో.. వాటి నుంచి రక్షణ కోసమే ఇలా శరీరాన్ని పూర్తిగా కప్పుకొంటున్నారు. అందుబాటులో ఉంటే శిరస్త్రాణాలు, లేనివారు చున్నీలతో ముఖాలను ఇలా కప్పుతున్నారు. మైలవరం ప్రాంతంలో ఈ ఏడాది మొక్కజొన్న సాగు గణనీయంగా పెరగ్గా, ప్రతి చేనులో నిత్యం ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. **- న్యూస్‌టుడే, మైలవరం**



విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

మండలంలోని వెల్వడానికి చెందిన.. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు పల్లపోతుల గోపాల్, పశుసంవర్ధక శాఖలో కార్యాలయ మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన గుర్రాల వెంకట కోటేశ్వరరెడ్డిలకు గురువారం గ్రామంలో అభినందన సభ నిర్వహించి సన్మానించారు. తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు, ఎల్బీఆర్‌సీఈ మాజీ అధ్యక్షుడు వి.సచ్చిదానందం తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

స్పెల్‌'బీ'లో చిన్నారుల సత్తా

మైలవరం, న్యూస్‌టుడే: వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్ పోటీలో జాతీయ స్థాయిలో సత్తాచాటిన చిన్నారులైన అన్నాచెల్లెలు మరోసారి ప్రతిభ చాటారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం 7 జిల్లాల జోనల్ స్థాయి కాకినాడలో నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో ప్రతిభ చాటి ప్రథమ స్థానం సాధించారు. మండలంలోని కనిమెర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాణావత్ రేవంత్‌కుమార్ 5వ తరగతి, అతని చెల్లి 3వ తరగతి చదువుతున్నారు. వారి తరగతుల విభాగంలో ఇద్దరూ ప్రథమస్థానం సాధించినట్లు ఎంఈవో ఎల్.బాలు తెలిపారు. ఈ నెల 31న నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని వివరించారు.

పదిలో నూరు శాతం ఫలితాలు సాధించాలి

రెడ్డిగూడెం: పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించాలని ఎంఈవో పి.రమేష్‌బాబు సూచించారు. గురువారం నాగులూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

తిరువూరు న్యూస్‌టుడే: జైపూర్‌లో ఈ నెల 24 నుంచి 26 వరకు జరగనున్న జూనియర్ ప్రో కరాటే లీగ్‌కు తిరువూరుకు చెందిన మైనేని నాగ నిఖిల్ సాయి, మనస్వి, నిఖిల్‌పవన్, శాకృత్య, జెస్సి, జ్యోత్స్న ఎంపికయ్యారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ ఘనత సాధించారు.

ఉపాధి హామీ పథకం పేరు మార్పు సరికాదు

రామచంద్రాపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం పేరు మార్చి.. కొత్త చట్టం అమలు చేసి కేంద్ర ప్రభుత్వం పేదల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తోందని సీపీఎం నాయకులు ఆరోపించారు. మండల కార్యదర్శి పి.ఆనందరావు ఆధ్వర్యంలో గురువారం రామచంద్రాపురంలో ఉపాధి హామీ పథకం కొనసాగించాలని, కొత్త చట్టం అమలు చేయొద్దని కోరుతూ కూలీలకు కరపత్రాలు పంపిణీ చేశారు.


కూలీలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రభుత్వ బడులను సద్వినియోగం చేసుకోండి


దాతను సత్కరిస్తున్న స్వర్ణకుమార్, రామకృష్ణనాయక్, లక్ష్మీతిరుపతమ్మ తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రభుత్వ బడులను సద్వినియోగం చేసుకుని, పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీవో బీవీ రామకృష్ణనాయక్ సూచించారు. కోడూరులోని కొడాలి శ్రీనివాసరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 27 వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులకు గ్రామస్థుడు విజయ్ రూ.5000 చొప్పున, మాజీ సర్పంచి వెంకటనరసింహారావు రూ.2000, ప్రస్తుత సర్పంచి వంగూరి ప్రసాద్ రూ.2 వేల చొప్పున అందజేశారు. అనంతరం పాఠశాల నిర్మాణ దాత సావిత్రమ్మను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, హెచ్‌ఎం స్వర్ణకుమార్, ఎస్సై సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళల అభివృద్ధిపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డీపీఎం సహాయరాజు, ఏపీఎం శ్యామ్యూల్

మైలవరం, న్యూస్‌టుడే: పేద మహిళల గుర్తింపు, అభివృద్ధిలో సహాయకారిగా ఉండేందుకు ఈ నారీ వ్యవస్థను తీసుకొచ్చినట్లు ఐబీ డీపీఎం సహాయ రాజు, ఏపీఎం శ్యామ్యూల్ పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ఎంపికైన ఈ నారీ సభ్యులకు బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నారీలకు అప్పగించిన 10 గ్రూపుల్లో పేదలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ అధ్యక్షురాలు జ్యోతి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు

జి.కొండూరు, న్యూస్‌టుడే: వెల్లటూరు గ్రామ శివారు కోడూరుకు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన పిచ్చి, ముళ్ల పొదలు దట్టంగా పెరగడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అటుగా వెళ్లిన జి.కొండూరు ఎస్సై సతీష్‌కుమార్ ప్రమాదకరంగా ఉన్న ముళ్ల పొదలను తొలగింపజేశారు. ఎస్సై చూపిన చొరవను పలువురు గ్రామస్థులు అభినందించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్లపై వాహనాలు నిలిపి ఉంచడం, దుకాణాలను రహదారి అంచుల వరకు జరిపి వ్యాపారాలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని విస్సన్నపేట ఎస్సై అర్జున్ రాజు అన్నారు. మండల కేంద్రం విస్సన్నపేటలోని నూజివీడు రోడ్డు, సత్తుపల్లి రోడ్డు ప్రాంతాల్లో గురువారం ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సంబంధిత వ్యక్తులకు అవగాహన కల్పించారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

మైలవరం, న్యూస్‌టుడే: డెమొక్రటిక్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను గురువారం ఎంఈవో కార్యాలయంలో ఎంఈవోలు బి.రాజు, ఎల్.బాలు ఆవిష్కరించారు. వీటిని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు అందించనున్నట్లు సంఘం నాయకులు కె.కోటేశ్వరరావు, ఆర్వీఎస్ రామకృష్ణారావు తెలిపారు.

తెదేపా నాయకుడు నాదెళ్ల సత్యనారాయణ మృతి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట పట్టణ తెదేపా సీనియర్ నాయకుడు, పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్ వీరాభిమానిగా ఉన్న నాదెళ్ల సత్యనారాయణ (75) క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ గురువారం మరణించారు. ఆయన భార్య నాగమణి జిల్లా తెలుగు మహిళా నాయకురాలిగా, పార్టీ జిల్లా కోశాధికారిగా పని చేస్తున్నారు. నాదెళ్ల మృతితో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురు నాయకులు, వ్యాపారులు, ఉద్యోగులు ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

వరుస చోరీలతో గ్రామస్థుల బెంబేలు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని కుంటముక్కలలో దొంగలు పట్టపగలే హల్‌చల్ చేసి చోరీలకు పాల్పడటంతో గ్రామస్థులు బెంబేలెత్తుతున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లిన రైతుల ఇళ్లే లక్ష్యంగా గురువారం చోరీ జరిగిందని బాధితులు వెల్లడించారు. గ్రామానికి చెందిన గోళ్ల శ్రీరామ్ ఇంట్లో రూ.1.50 లక్షల నగదు చోరీ చేశారు. పక్కనే ఉన్న మరో రెండు ఇళ్లలో చోరీకి యత్నించగా ఏమి దొరక్కపోవడంతో దొంగలు అక్కడ నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్సై సతీష్‌కుమార్, క్లూస్ టీం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం: కేతనకొండ ఏనుగు గడ్డ వాగు సమీపంలో గురువారం ఆటో బోల్తా పడింది. పోలీసుల సమాచారం మేరకు.. వ్యవసాయ పనుల నిమిత్తం కేతనకొండకు చెందిన వ్యవసాయ కూలీలు గురువారం ఆటోలో కొటికలపూడికి బయలుదేరారు. ఏనుగుగడ్డ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే సమయంలో వారు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సయ్యద్ మస్తాబీ, రహమాన్‌బీ, పగడాల సువర్ణ, పత్రి సరోజిని, నూర్జహాన్ గాయపడ్డారు. మరో ఐదుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జూపూడి నిర్మా ఆసుపత్రికి తరలించారు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైకాపా పాలనలో రెవెన్యూ వ్యవస్థ నాశనం

గొల్లపూడి: రెవెన్యూ వ్యవస్థను వైకాపా పాలనలో నాశనం చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థను ధ్వంసం చేసిన వైకాపాకు రాజకీయ పతనం తప్పదని పేర్కొన్నారు. వైకాపా చేసింది భూయజ్ఞం కాదని, రైతుల భూములను స్వాహా చేసిన దోపిడీ పాలన అని విమర్శించారు. బ్రిటీషు పాలకులు కూడా చేయలేని విధంగా భూములపై ప్రయోగాలు చేసి అస్తవ్యస్తం చేశారన్నారు. భూములు కొట్టేసేందుకే పాదయాత్ర చేస్తానంటూ జగన్ మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. బెంగళూరు ప్యాలెస్‌కే ఆయన పరిమితం కావాల్సి ఉంటుందని ఎద్దేవా చేశారు.

ఈనాడు ప్రతిభ
◆ https://pratibha.eenadu.net ◆ https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు



◆ నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (2025, నవంబరులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను నామినేట్ చేశారు. జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరి సుప్రీం కోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ (ఎస్సీఎల్ఎస్సీ) ఛైర్మన్‌గా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నియమించారు.) జ: జస్టిస్ విక్రమ్ నాథ్

◆ దేశంలో శ్వేతవిప్లవ పితామహుడిగా పేరొందిన డాక్టర్ వర్గీస్ కురియన్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఏ రోజున జాతీయ పాల దినోత్సవాన్ని నిర్వహిస్తారు? జ: నవంబరు 26 (ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తిదారుగా ఉన్న భారత్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 239.3 మిలియన్ టన్నుల పాలను ఉత్పత్తి చేసింది.)

◆ గ్లోబల్ కమిట్‌మెంట్ టు డెవలప్‌మెంట్ ఇండెక్స్ (సీడీఐ) 2025లో భారత్ ఎన్నో స్థానంలో నిలిచింది? (సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ రూపొందించిన ఈ సూచికలో స్వీడన్, జర్మనీ, నార్వే, ఫిన్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్‌లు వరుసగా తొలి అయిదు స్థానాల్లో నిలిచాయి.) జ: 36వ

◆ హింస, వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలకు వేగవంతమైన, 24 గంటల మద్దతు కోసం జాతీయ మహిళా కమిషన్ ఇటీవల ప్రారంభించిన టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబరు? జ: 14490

మరింత సమాచారం

చిన్న పరిశ్రమలకు పెద్ద అండ!

దేశంలో ఉద్యోగ కల్పన, ప్రాంతీయ అభివృద్ధితో పాటు ఆర్థిక స్థిరత్వానికి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కీలకమైనవి. భారత జీడీపీలో ముప్పై శాతం ఎగుమతుల్లో, నలభై అయిదు శాతం వాటా ఎంఎస్ఎంఈల నుంచే సమకూరుతోంది. ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాల మాదిరి పని చేస్తున్న ఎంఎస్ఎంఈల అభివృద్ధికి, విస్తరణకు ఆర్థిక సహాయం అందించడమే లక్ష్యంగా భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ సిడ్బీ. చిన్నతరహా పరిశ్రమలకు ప్రత్యక్ష, పరోక్ష రుణాలతో పాటు ఆధునికీకరణ, నూతన సాంకేతికతలకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్ఎంఈల పాత్రను బలోపేతం చేయడంలో సిడ్బీకి ఉన్న ప్రాధాన్యాన్ని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ఆ సంస్థ ద్వారా చిన్న పరిశ్రమలు పొందుతున్న రుణాలు, రుణహామీ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి.

స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిడ్బీ)

భారతదేశంలో చిన్నతరహా పరిశ్రమలకు రుణాలిచ్చే శిఖరాగ్ర సంస్థ స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ - సిడ్బీ). ఇది ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ)కి అనుబంధ సంస్థ. 1988 పార్లమెంటు ప్రత్యేక చట్టం ప్రకారం సిడ్బీని స్థాపించింది. 1990, ఏప్రిల్ 2 నుంచి బ్యాంకు అమల్లోకి వచ్చింది. చిన్నతరహా పరిశ్రమలకు ఆర్థిక చేయూత, అభివృద్ధికి ప్రోత్సాహం అందించడంలో సిడ్బీ కీలక పాత్ర పోషిస్తోంది. రుణాల రీఫైనాన్స్, మార్కెటింగ్ సహాయం, సాంకేతికత, ఆధునికీకరణ, ఉపాధి కల్పన, ఇతర ఆర్థిక సేవలు అందిస్తూ చిన్న పరిశ్రమల రంగాన్ని దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలబెడుతోంది.



సిడ్బీ ప్రధాన లక్ష్యాలు



★ దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగాన్ని ప్రోత్సహించడం, వాటికి ఆర్థిక సహాయం అందించి అభివృద్ధి చేయడం. ★ ఎంఎస్ఎంఈలకు సకాలంలో రుణాలు, నిర్వహణ మూలధనం అందించడం. ★ ఎంఎస్ఎంఈ రంగానికి ప్రధాన ఆర్థిక సంస్థగా వ్యవహరిస్తుంది. వివిధ ఏజెన్సీలను సమన్వయం చేస్తుంది. ★ మెరుగైన ఉత్పత్తి సామర్థ్యం, పోటీతత్వం కోసం సాంకేతికత నైపుణ్యాలు, నూతన ఆవిష్కరణలకు మద్దతు ఇస్తుంది. ★ మహిళలు, యువత వ్యవస్థాపకతను ప్రోత్సహిస్తుంది. అలాగే ప్రభుత్వ ఎంఎస్ఎంఈ పథకాలకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.



సిడ్బీ విధులు

★ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో చిన్న పరిశ్రమల ఉత్పత్తులకు మార్కెటింగ్‌ను విస్తరించడంలో సహాయపడుతుంది. ★ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా, పట్టణ ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పించే రీతిలో సెమీ అర్బన్ ప్రాంతంలో ఉపాధి ఆధారిత పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తుంది. ★ చిన్నతరహా పరిశ్రమలకు బ్యాంకులు ఇచ్చే రుణాలకు సిడ్బీ రీఫైనాన్స్ చేస్తుంది. తద్వారా ఆ పరిశ్రమలకు నిధుల లభ్యత పెరుగుతుంది.
★ చిన్నతరహా పరిశ్రమలకు వర్కింగ్ క్యాపిటల్, టర్మ్ లోన్స్ అందిస్తుంది. ★ ఎంఎస్ఎంఈ రంగానికి సంబంధించిన ఇతర సంస్థల కార్యకలాపాలను సమన్వయం చేస్తుంది.
★ గతంలో ఐడీబీఐ నిర్వహించిన చిన్న పరిశ్రమల అభివృద్ధి నిధి, జాతీయ ఈక్విటీ నిధి నిర్వహణ బాధ్యతను సిడ్బీ తీసుకుంది.



జనరల్ స్టడీస్ — ఇండియన్ ఎకానమీ

సిడ్బీ వాటా మూలధనం

భారత ప్రభుత్వంతో పాటు 22 ఇతర సంస్థలు/ప్రభుత్వ రంగ బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ యాజమాన్యం లేదా నియంత్రణ ఉన్న బీమా కంపెనీలకు సిడ్బీలో వాటా ఉంది. ★ కేంద్ర ప్రభుత్వ వాటా-20.85% ★ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా- 15.65% ★ ఎల్ఐసీ- 13.33% ★ నాబార్డ్ - 9.36% ★ ఇతర సంస్థలు- 40.81%

చిన్నతరహా పరిశ్రమలకు ఆర్థిక సాయంలో సిడ్బీ పాత్ర

ప్రత్యక్ష ఆర్థిక సహాయం: కొత్త యూనిట్లు ఏర్పాటు చేయడం, విస్తరణ, ఆధునికీకరణ, సాంకేతిక నవీకరణతో సహా విభిన్న అవసరాలను తీర్చడానికి సిడ్బీ ఎంఎస్ఎంఈలకు నేరుగా రుణాలను అందిస్తుంది.

టర్మ్ లోన్లు, వర్కింగ్ క్యాపిటల్ అందించడం: ఇది స్థిర ఆస్తులు (భూమి, భవనాలు, యంత్రాలు) కొనుగోలు చేయడానికి, రోజువారీ కార్యకలాపాల నిర్వహణ, మూలధన సాయం అందించేందుకు కాలపరిమితితో కూడిన రుణాలను అందిస్తుంది.

స్మైల్ (సిడ్బీ మేక్ ఇన్ ఇండియా సాఫ్ట్ లోన్ ఫండ్ ఫర్ ఎంఎస్ఎంఈ): తయారీ, సేవా రంగంలోని నూతన సంస్థలకు, ప్రస్తుత సంస్థల విస్తరణకు సరళమైన, తిరిగి చెల్లించే నిబంధనలతో రుణాలు ఇస్తుంది. దీని కింద కనీస రుణ పరిమాణం- ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ కోసం రూ.10 లక్షలు, ఇతరాలకు కనీస పరిమాణం రూ.25 లక్షల వరకు అందిస్తుంది. ఈ రుణ కాలపరిమితి మూడేళ్లు.

స్మైల్ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ (ఎస్ఈఎఫ్): దీని కింద 72 నెలల రుణ కాలపరిమితిలో కనీస రుణ మొత్తం రూ.10 లక్షలు అందిస్తుంది.

స్పిడ్ (సిడ్బీ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్): యంత్రాలు, పరికరాల కొనుగోలు కోసం 100 శాతం రుణాలను అందిస్తుంది.

స్టార్ (సిడ్బీ టర్మ్‌లోన్ అసిస్టెన్స్ ఫర్ రూఫ్‌టాప్ సోలార్ పీవీ ప్లాంట్స్): ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు, విద్యుత్తు ఖర్చులు తగ్గించేందుకు రూఫ్‌టాప్ ప్లాంట్లను స్థాపించడంలో ఎంఎస్ఎంఈలకు సహాయం చేస్తుంది. దీని కింద రూ.10 లక్షల నుంచి రూ.2.5 కోట్లు రుణంగా ఇస్తుంది.

సిడ్బీ అర్జున పథకం: భారతదేశంలోని మహిళా వ్యవస్థాపకులకు ఆర్థిక సహాయం, వ్యాపారాలను ప్రారంభించడానికి, విస్తరించడానికి సహాయపడటం లక్ష్యంగా పెట్టుకున్న పథకం.

పరోక్ష ఆర్థిక సహకారం: పరోక్ష విత్త సహాయం కోసం సిడ్బీ.. వాణిజ్య బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, రాష్ట్ర ఆర్థిక సంస్థలు, వాటి ప్రాథమిక రుణ సంస్థలు (పీఎల్ఐ) ఎంఎస్ఎంఈలకు రుణాలిచ్చే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఫలితంగా దేశవ్యాప్తంగా ఎంఎస్ఎంఈలకు పర్యావరణ వ్యవస్థలో ఎక్కువ రుణ లభ్యత, సామర్థ్యం సమకూరుతుంది.

మైక్రో ఫైనాన్స్: కొత్త వ్యవస్థాపకులు, చిన్న వ్యాపార యజమానులకు సిడ్బీ సూక్ష్మ రుణాలను అందిస్తుంది.



రచయిత: వమరవల్లి రమణయ్య

SENIOR INTER Physics — Physical optics

1. Explain Doppler effect in light. Distinguish between red shift and blue shift?

A: **Doppler effect in light :** The change in apparent frequency or wavelength of light due to relative motion of the source is called Doppler effect.

Red shift: When light appears to him with higher wavelength this is called red shift. **4 Marks**

Blue shift: According to doppler effect, when a star moves towards the observer on the earth, its length light appears to him with lesser wavelength. This is called Blue shift.

2. Derive the expression for the intensity at a point where interference of light occurs. Arrive at the conditions for maximum & zero intensity.

Final Exams-2026 IMPORTANT Q&A

A: Let y_1, y_2 be the displacements of the two waves having same amplitude 'a', 'ϕ' is the phase difference between them.

$y_1 = a \sin wt$ ... (1)


$y_2 = a \sin (wt + \phi)$ .....(2)

the resultant displacement $y = y_1 + y_2$

$y = a \sin wt + a \sin(wt + \phi)$

$y = a \sin wt + a \sin wt \cos \phi + a \cos wt \sin\phi$

$y = a \sin wt (1 + \cos\phi) + \cos wt (a \sin\phi)$ ......(3)



let $R \cos\theta = a (1 + \cos\phi)$ ......(4)

$R \sin\theta = a \sin \phi$ .....(5)

$y = R \sin wt. \cos\theta + R \cos wt. \sin\theta$

$y = R \sin (wt + \theta)$ ......(6)

where R is the resultant amplitude at p, squaring equation (4), (5), then adding

$R^2[\cos^2\theta + \sin^2\theta] = a^2[1 + \cos^2\phi + 2\cos\phi + \sin^2\phi]$

$R^2[1] = a^2 [1 + 1 + 2 \cos\phi]$, $I = R^2 = 2a^2(1 + \cos\phi)$

$2a^2 \times 2\cos^2 \frac{\phi}{2} \Rightarrow I = 4a^2 \cos^2 \frac{\phi}{2}$ ....(7)

(i) Maximum Intensity (I_{max})

if $\cos^2\left(\frac{\phi}{2}\right) = 1$

$\phi = 2n\pi$, where n = 0, 1, 2, 3.....

$\phi = 0, 2\pi, 4\pi, 6\pi$, $I_{max} = 4a^2$, $I_{max} = 4a$

(ii) Minimum Intensity (I_{min})

if $\cos^2\left(\frac{\phi}{2}\right) = 0$

$\phi = (2n + 1)\pi$, where n = 0, 1, 2, 3.....

$\phi = \pi, 3\pi, 5\pi, 7\pi$..

$I_{min} = 0$

More Imp Q & Ans



Writer: Allu Rambabu

ప్రేమతో మంత్రికి..!

విజయవాడ, అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన చిరుద్యోగి శంకర్.. మంత్రి నారా లోకేశ్ చిత్రాన్ని గీచి ఆయనపై తన అభిమానాన్ని.. ప్రేమను చాటుకున్నారు. మంత్రి పుట్టిన రోజు సందర్భంగా తల పైభాగంలో నారా లోకేశ్ అని, చొక్కా భాగంలో ఐటీ విద్య టీడీపీ మంత్రి, యువ ఎమ్మెల్యే మంగళగిరి పేరు వచ్చేలా చిత్తరువును తీర్చిదిద్దారు. ఇది స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంది.
- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ)



లాలి, జోల పాటలకు ఎనలేని ఆదరణ



ఉత్సవమూర్తుల ఎదుట పాటను గానం చేస్తున్న రమ్య బెహరా, వీక్షిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆలయ ఈవో, భక్తులు

మోపిదేవి, న్యూస్‌టుడే : లాలి, జోల పాటలకు ఎనలేని ఆదరణ లభిస్తోందని గాయని రమ్య బెహర పేర్కొన్నారు. శివమణి క్రియేషన్స్ సమర్పణలో లక్ష్మణ్ కపర్తి నిర్మాణంలో, కార్తీక్ కొడకండ్ల సంగీత సహకారంతో మల్లవజ్జల కృష్ణవేణి సాహిత్యంతో గాయని రమ్య బెహరా శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పవళింపు సేవకు రూపొందించిన పాటను ఆలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో, ఈవో పర్యవేక్షణలో గానం చేశారు. ఆరు నిమిషాల నిడివితో స్వామికి లాలి పాటగా స్కంద జోలాలి అంటూ పాడారు. భక్తుల, పాల్గొన్న అధికారుల హర్షధ్వానాలతో ఉత్తేజ పరిచారు. స్వామి ప్రతిరోజు జోలాలి పాటతో పవళించటం తనకు, శివమణి క్రియేషన్ బృందానికి దక్కటం పూర్వజన్మ సుకృతమన్నారు. స్వామి సన్నిధిలో సంకీర్తనగా ఈ గీతం నిత్యం వినిపిస్తారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శివమణి క్రియేషన్స్ బృందాన్ని ఘనంగా సత్కరించి, శేషవస్త్రాలు, పట్టువస్త్రాలతో సన్మానించారు.

రెండో రోజు ప్రశాంతంగా జేఈఈ మెయిన్

కానూరు, యనమలకుదురు, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా జిల్లాలో జేఈఈ మెయిన్- 2026 రెండో రోజు ప్రశాంతంగా జరిగింది. ఉదయం మొదటి షిఫ్టు, మధ్యాహ్నం రెండో షిఫ్టు కలిపి 97 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అధికారులు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి విద్యార్థులకు నగరంలో పరీక్షా కేంద్రాలు కేటాయించారు. కానీ వారితో పాటు వచ్చే తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాలు వెలుపల ఉండే కూర్చోవడానికి ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. అధికారులు స్పందించి కనీస ఏర్పాట్లు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమయం తీసుకునేలా ఉన్నాయి



ఉదయం సెషన్ పేపర్ క్లిష్టంగా ఉంది. సుదీర్ఘమైన ప్రశ్నలు సమయం తీసుకున్నాయి. కలన గణితం, సంభావ్యతలో ఎక్కువ ప్రశ్నలిచ్చారు. అలానే భౌతిక శాస్త్రంలో ప్రశ్నలు మధ్యస్థంగా ఉన్నాయి. వీటిలో స్కోరింగ్ చేసుకోవచ్చు. రసాయన శాస్త్రంలో సులువుగా ఇచ్చారు. సమయ పాలన చేసుకున్న వారు మంచి స్కోరు సాధించవచ్చు. **- ఆకులవర్ష, విజయవాడ**

క్లిష్టంగా అనిపించింది



భౌతిక శాస్త్రంలో ప్రశ్నలు మధ్యస్తం నుంచి క్లిష్టంగా అనిపించింది. ఫార్ములా బేసెడ్, కాన్సెప్ట్ బేసెడ్, ఎక్కువ సుదీర్ఘమైన ప్రశ్నలు అడిగారు. రసాయన శాస్త్రం కూడా సులువుగానే ఉంది. ఈ రెండింటి కంటే లెక్కలు కొంత మధ్యస్థంగా ఉన్నాయి. మొత్తం మీద సమయం తీసుకునేలా ప్రశ్నలున్నాయి. -
వి.నిఖిత్ చందు ప్రజ్వల్, విజయవాడ

తొలిదశలో రూ.2 కోట్ల చెల్లింపు!

రెండో విడతలో మరో రూ.1.41 కోట్లు ● ఏప్రిల్‌కు సౌర ప్లాంట్‌కు నెట్ మీటరింగ్

ఈనాడు – అమరావతి

దుర్గగుడి, విద్యుత్తు శాఖ మధ్య వివాదం పూర్తిగా పరిష్కారమైంది. దుర్గగుడి నుంచి రూ.2 కోట్ల విద్యుత్తు బిల్లుల బకాయిలను గురువారం చెల్లించారు. మరో రూ.1.41 కోట్ల బిల్లు బకాయిలను.. 3-4 నెలల్లో చెల్లించనున్నారు. 2023 నుంచి రూ.3.90 కోట్ల విద్యుత్తు బిల్లుల బకాయిలు ఉన్నాయని.. దుర్గగుడికి విద్యుత్తుశాఖ నెల కిందట నోటీసులు ఇచ్చింది. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో.. దుర్గగుడికి విద్యుత్తు సరఫరానూ కొన్ని గంటలపాటు ఆపేయడంతో.. వివాదంగా మారింది. తమ సౌర విద్యుత్తు ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అవుతున్నది మినహాయించి కడతామని దుర్గగుడి అధికారులు, పూర్తిగా కట్టాలని విద్యుత్తుశాఖ వారు పట్టుబట్టారు. దేవాదాయ, విద్యుత్తు అధికారులతో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్.. సంయుక్త సమావేశం నిర్వహించి సమస్య సామరస్య పరిష్కారానికి సూచనలు చేశారు. దీంతో.. రూ.3.90 కోట్లలో జరిమానా రుసుము మినహాయించి.. మిగతా రూ.3.41 కోట్లను విద్యుత్తు శాఖకు రెండు దశల్లో చెల్లించేలా ఒప్పందం కుదిరింది.

అందుకే బిల్లుల భారం పెరిగింది..

దుర్గగుడికి... పాతపాడులో ఒక మెగావాట్ సామర్థ్యం ఉన్న సౌర ప్లాంట్‌కు 500 కిలోవాట్స్ చొప్పున రెండు నెట్ మీటరింగ్ వ్యవస్థల ఏర్పాటు ప్రక్రియ ఆరంభమైంది. 2023 నుంచి సౌర ప్లాంట్ ద్వారా విద్యుదుత్పత్తి చేస్తున్నా.. నెట్ మీటరింగ్ వ్యవస్థ సరిగా లేక.. దుర్గగుడికి బిల్లుల భారం పెరిగింది. దీనికి పరిష్కారంగా.. ప్రస్తుతం రెండు నెట్ మీటర్ల ఏర్పాటుకు టెండర్లను పిలిచారు. విద్యుత్తుశాఖ ఆధ్వర్యంలో వీటి ఏర్పాటుకు ఇరుశాఖలు ఒప్పందం చేసుకున్నాయి. దీనికి అవసరమైన ప్రక్రియ పూర్తిచేశారు. ఏప్రిల్‌కల్లా రెండు నెట్ మీటర్లు ఏర్పాటు చేసి.. సౌర ప్లాంట్ ద్వారా ఎంత విద్యుత్తు ఉత్పత్తి అవుతోందో లెక్కిస్తారు. తర్వాత ఉత్పత్తయ్యే విద్యుత్తును మినహాయించి.. మిగిలిన యూనిట్లకు బిల్లులను విద్యుత్తు శాఖ జారీ చేస్తుంది.

రేపటి నుంచి కృష్ణా వర్సిటీ మహిళా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల మహిళా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపిక ఈ నెల 24, 25 తేదీల్లో నందిగామలోని కేవీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్ రాయప్ప తెలిపారు. అంతర్ కళాశాలల పోటీలో తలపడే జట్లు మూడు సెట్ల అర్హతా పత్రాలతో పాటు గుర్తింపు కార్డులతో 24న ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరవ్వాలన్నారు. జట్టు లేకుండా వ్యక్తిగతంగా వర్సిటీ జట్టు ఎంపిక పోటీలో పాల్గొను క్రీడాకారిణులు అదే రోజు ఉదయం 11 గంటలకు తగు అర్హతా పత్రాలతో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 99080 83434 నంబరులో సంప్రదించాలన్నారు.

నకిలీ మద్యం కేసులో జినేష్, శిబులకు కస్టడీ

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో ఇద్దరు నిందితులను కోర్టు మూడు రోజులపాటు కస్టడీకి ఇచ్చింది. నిందితులు జినేష్, శిబులను కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్, సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం ఎక్సైజ్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈనెల 25 నుంచి 27 వరకు కస్టడీకి న్యాయాధికారి లెనిన్‌బాబు అనుమతించారు. వీరు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై పోలీసులు కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. సమయం కావాలని ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది కోరడంతో ఈనెల 27కు వాయిదా వేశారు.

త్వరలో బుడమేరు యూటీ విస్తరణ పనులు

మరికొద్ది రోజులే ఏలూరు కాల్వకు నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రకాశం బ్యారేజీ నుంచి ప్రవహించే కృష్ణా తూర్పు ప్రధాన కాలువ పరిధిలో పంట కాల్వల కట్టివేత తరుణం ఆసన్నమైంది. ఈక్రమంలో రైవస్ కాల్వకు గురువారం నీటిని నిలిపివేశారు. ఏలూరు కాల్వకు కూడా మరి కొద్ది రోజుల్లో నిలిపివేయనున్నారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల కోసం నీటిని ఇస్తున్నారు. విజయవాడ గ్రామీణ మండలం ఎనికేపాడు వద్ద ఏలూరు కాల్వకు బుడమేరు అండర్ టన్నెల్ (యూటీ) ఉంది. యూటీ వద్ద బుడమేరు వరద ప్రవాహ సామర్థ్యం పెంచేలా విస్తరణ పనులను త్వరలో ప్రారంభించనున్నారు. పనులు మొదలైతే ఏలూరు కాల్వకు నీటి విడుదల సాధ్యం కాదు. ఈ కారణంగా ఏలూరు కాల్వ పరిధిలో తాగునీటి చెరువులను నింపేందుకు నీటిని విడుదల చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఏలూరుకు దీని ద్వారానే తాగునీరు అందుతుంది. ఏలూరు కాల్వకు ప్రస్తుతం 708 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కృష్ణా జిల్లాలోని దివిసీమ వైపు వెళ్లే కేఈబీ కాల్వకు 403, బందరు కాల్వకు 101 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు. కేఈబీ, బందరు కాల్వలకు సాగునీటి అవసరాల దృష్ట్యా రైతుల విజ్ఞప్తులపై నీటిని ఇస్తున్నారు.

పరిశుభ్రమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా దుర్గగుడి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: పరిశుభ్రమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా దుర్గగుడిని తీర్చిదిద్దడంలో పారిశుద్ధ్య సిబ్బంది పాత్ర కీలకమని దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు. మల్లికార్జున మహా మండపంలో ఆరో అంతస్తులో పారిశుద్ధ్య సిబ్బందితో గురువారం నిర్వహించిన సమావేశంలో ఈవో మాట్లాడారు. ఆహ్లాదకర వాతావరణంలో అమ్మవారిని భక్తులు దర్శించుకోవాలన్నారు. ఆలయ ప్రతిష్ఠ వైభవం మనం నిర్వహించే పారిశుద్ధ్య నిర్వహణపైనే ఆధార పడుతుందన్నారు. దుర్గాఘాట్, క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, ఘాట్ రోడ్డు, కనకదుర్గా నగర్ మెట్ల మార్గంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. శ్రీపంచమి సందర్భంగా అమ్మవారి దర్శనానికి వేలాది విద్యార్థులు, భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది అలసత్వం లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. పారిశుద్ధ్య పరికరాలు వినియోగించడం, రసాయనాల వాడకంలో సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో రమేష్, పారిశుద్ధ్య విభాగం ఇన్‌స్పెక్టర్ రజనీప్రియ, ఏసీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈవో శీనానాయక్, పక్కన ఏసీ రంగారావు, ఏఈవో రమేష్

'మహిళా రక్షణ చట్టాలు పక్కాగా అమలు చేయాల్సిందే'

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద, రాజ్యాంగ విరుద్ధ పాలనకు వ్యతిరేకంగా మరిన్ని సమరశీల పోరాటాలు అవశ్యమని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సైదా సయ్యద్ హమీద్, నిషా సిద్ధు పిలుపునిచ్చారు. గురువారం గవర్నర్‌పేటలోని ఐ.ఎం.ఎ. హాలులో రెండు రోజుల పాటు నిర్వహించే ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. దేశం నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సైదా సయ్యద్ హమీద్ మాట్లాడుతూ.. మహిళలపై హింస భయంకర స్థాయికి చేరుకుందన్నారు. నేరస్థులు శిక్షకు బదులుగా రాజకీయ రక్షణ పొందుతున్నారని ధ్వజమెత్తారు. దేశ రాజకీయాలు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ, పౌరహక్కులను బలహీనపరిచే దశకు చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెనెజువెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యదర్శి నిషా సిద్ధు మాట్లాడుతూ.. భాజపా ప్రభుత్వం ప్రజలను శాశ్వతంగా భయం, ఉన్మాదం, కృత్రిమ గందరగోళంలో ఉంచి.. ఎలాంటి ప్రతిఘటన లేకుండా చేస్తోందన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఏదో ఒక జాతీయ సమస్యను సృష్టిస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రైవేటీకరణ, కార్మిక హక్కులు, మహిళల భద్రత, సామాజిక న్యాయం తదితర అంశాలను దారి మళ్లించే వ్యూహమిదని పేర్కొన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో పేదలు, వలస కార్మికులు, దళితులు, మైనార్టీలు, మహిళల పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఎన్నికల సంస్కరణ కాదన్నారు. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నాయకులు డాక్టర్ కొన్నికా రాయ్, డాక్టర్ కె. రజని, శ్యామ్‌శ్రీ భాస్, పెన్మత్స దుర్గాభవానీ, కన్వల్‌సిత్ కౌర్, శక్తిదేవి, పద్మావతి, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, కార్యనిర్వాహక కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైదా సయ్యద్ హమీద్. వేదికపై దుర్గాభవానీ, డాక్టర్ కొన్నికా రాయ్, డాక్టర్ రజని, శ్యామ్‌శ్రీ తదితరులు

ఎన్టీఆర్ జిల్లాలోనూ మ్యాజిక్ వీవ్స్

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఒక కుటుంబం-ఒక పారిశ్రామిక వేత్త లక్ష్య సాధనలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలోనూ మ్యాజిక్ వీవ్స్‌కు శ్రీకారం చుట్టనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం ఉపకరిస్తుందని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఎర్రబాలెం (మంగళగిరి)లో అమలవుతున్న మ్యాజిక్ వీవ్స్ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ జి.రేఖారాణితో మాట్లాడారు. కార్యక్రమ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.

బలహీనవర్గాలకు చేయూత.. పర్యావరణ హితంగా సంప్రదాయ చేనేత కళకు ఆధునిక డిజైన్లను జోడించి, విలువైన ఉత్పత్తులను రూపొందించడం.. తద్వారా అనాథలు, బలహీనవర్గాల వారికి చేయూత నివ్వడం ఈ కార్యక్రమ లక్ష్యమని రేఖారాణి తెలిపారు. ప్రస్తుతం 30 మంది అనాథ పిల్లలకు వస్త్రాన్ని గ్రేడింగ్ చేసి బ్యాగులు, పౌచ్‌లు, దుస్తులు, ఫైల్ కవర్లు, ఔషధ కిట్లు వంటి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చేందుకు అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ కాలుష్యానికి అడ్డుకట్ట వేస్తూ.. చిన్న వయసు నుంచే సృజనాత్మకత, పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపకరిస్తాయని ఆమె వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విలువ జోడింపుతో ఉపాధి అవకాశాలు విస్తృత మవుతాయన్నారు. ఆప్కో ద్వారా వస్త్రాలు, యంత్రాలు, మౌలిక సదుపాయాలు, శిక్షణ, మార్కెట్ లింకేజీ సౌకర్యాల సహకారంతో కార్యక్రమాన్ని జిల్లాలోనూ అమలు చేస్తామన్నారు. ఈమ్యాజిక్ వీవ్స్ కార్యక్రమం చేనేత వారసత్వ సంపద పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, ఉపాధి సృష్టి, సామాజిక భాగస్వామ్యంతో సుస్థిర అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు.



ఎర్రబాలెంలో మ్యాజిక్ వీవ్స్ కార్యక్రమాన్ని కలెక్టర్ లక్ష్మీశకు వివరిస్తున్న రేఖారాణి

పండిస్తారు.. విక్రయిస్తారు

పసుపు సాగులో ప్రభుకుమార్ వినూత్న ఆలోచన

కంకిపాడు, న్యూస్‌టుడే

కంకిపాడు మండలం కాసరనేనివారిపాలేనికి చెందిన ప్రభుకుమార్ (బాబు) సేంద్రియ సాగులో అధిక దిగుబడులు సాధిస్తూ శెభాష్ అనిపిస్తున్నారు. 'ఇండియన్ అకాడమీ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్' (ఐఏహెచ్ఎస్) సంస్థ గత నవంబరులో బెంగళూరులో నిర్వహించిన 11వ 'ఇండియన్ హార్టికల్చర్ కాంగ్రెస్- 2025'లో ప్రభుకుమార్‌కు ఉత్తమ ప్రగతిశీల, సేంద్రియ రైతు పురస్కారం లభించింది. ★ పదేళ్లుగా పసుపు సాగులో పూర్తిగా సేంద్రియ విధానాన్ని ఆయన అమలు చేస్తున్నారు. విత్తనం ఎంపిక నుంచి పసుపు పొడి విక్రయం వరకు ఆయనే చూసుకుంటారు. ఏడాది సరాసరిన నాలుగెకరాల్లో సాగు చేస్తారు. సేంద్రియ సాగులో దిగుబడి తగ్గినా నాణ్యమైన పంట చేతికి వస్తుంది. పసుపు తీత, వంటకం, ఆరబోత, నునుపు చేయడం అయ్యాక కొమ్ములను పొడి చేయిస్తారు. సరాసరిన ఎకరాకు పది క్వింటాళ్ల పసుపు పొడిని అర కిలో నుంచి ఐదు కిలోల బరువుండే పొట్లాలు చేయించి.. వీటిని మార్కెట్లో విక్రయిస్తారు. సాధారణ పసుపు పొడి ప్రస్తుతం కిలో రూ.200- 300 కాగా ప్రభుకుమార్ రూ.600 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ లెక్కన ఎకరాకు రూ.6 లక్షల మేర ఆదాయం పొందుతున్నారు. పెట్టుబడి, ఖర్చులు పోగా ఎకరాకు రూ.2.5 లక్షల వరకు లాభాన్ని ఆర్జిస్తున్నారు. పసుపు నాణ్యత 'కర్కుమిన్' శాతాన్ని ప్రామాణికంగా తీసుకుంటారని ఉద్యానశాఖాధికారి హరిచంద్ తెలిపారు. అది సాధారణ రకంలో 4 శాతం లోపు ఉంటే ప్రభుకుమార్ 'ప్రగతి' రకంలో 8- 9 శాతం వరకు నమోదవుతోందని చెప్పారు.


పసుపు తోటలో రైతు ప్రభుకుమార్, హెచ్ఓ హరిచంద్

రైతేరాజు

నమ్మకాన్ని పొందాను

సాగులో రెండు, మూడేళ్ల వరకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కొన్నిసార్లు సాధారణ ధరకే విక్రయించా. పట్టు వీడకుండా అదే సాగు విధానం కొనసాగించగా వినియోగదారులు, వ్యాపారుల నమ్మకం కుదిరింది. దీన్ని వమ్ము చేయకుండా వ్యవసాయం, వ్యాపారం చేస్తున్నా. - ప్రభుకుమార్

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త జవాబు

ప్రశ్న : క్యాబేజీలో గుండ్రని హెడ్ రకాలు, సావాయి రకాలు, పూసా డ్రమ్ హెడ్ రకాల గురించి వివరించండి?

-కె.రత్తయ్య, రైతు, యండపల్లి

సమాధానం : (1) గుండ్రని హెడ్ రకాలు : (ఎ) గోల్డెన్ ఏకర్ : క్యాబేజీ గుండ్రంగా ఉంటూ ముందుగా వేసేందుకు అనుకూలం. 60- 65 రోజుల్లో కోతకు వస్తుంది. తల లోపలి భాగం తెల్లగా నాణ్యతగా ఉంటుంది. (బి) ప్రైడ్ ఆఫ్ ఇండియా : క్యాబేజీ పెద్దగా గుండ్రంగా ఉండి 60-80 రోజుల్లో కోతకు వస్తుంది. (సి) కోపెన్ హేగన్ మార్కెట్ : దృఢమైన తల కలిగి త్వరగా కోతకు వస్తుంది. (2) సావాయి రకాలు : ఇవి పెద్ద గడ్డ కలిగి ముడతలు గల ఆకులు గల క్యాబేజీ రకాలు. ★ డ్రమ్ హెడ్ సావాయి : ఆకులు ఆకుపచ్చగా ముడతలు కలిగి ఉంటాయి. నాణ్యత గల రకం. (3) **పూసా డ్రమ్ హెడ్ రకాలు :** ఇది జపాన్ రకం. తల గట్టిగా ఉండి మధ్యభాగం వెడల్పుగా డోలు వలె ఉంటుంది. దీర్ఘకాలిక రకం. 100- 120 రోజుల్లో కోతకు వస్తుంది.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల. –ఘంటసాల, న్యూస్‌టుడే

కంద సాగు... లాభాలు బాగు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే

ఈ ఏడాది కంద సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో సుమారు 33,175 ఎకరాల్లో కంద పంట సాగు చేశారని ఉద్యానశాఖాధికారి మానస తెలిపారు. రావి శివరామకృష్ణ తోట్లవల్లూరులో మెట్ట ప్రాంతంలో 1.70 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని కంద సాగు చేశారు. ఈ ఏడాది తవ్వగా పంట దిగుబడి ఎకరాకు 80 పుట్టీల చొప్పున 1.70 ఎకరాలకు 136 పుట్టీలు రాగా, పుట్టి రూ.6,500కు అమ్మగా రూ.8.84 లక్షలు వచ్చాయి. ఖర్చులు రూ.5.10 లక్షలు పోగా, ఆదాయం రూ.3.74 లక్షలు వచ్చిందని రైతు శివరామకృష్ణ తెలిపారు. కంద పంట చాలాసార్లు సాగు చేశామని, ఎప్పుడు పంట అమ్మినా పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేవి కావని, ఈ ఏడాది కంద రేటు ఉండటంతో కొంతమేర లాభం పొందామని రైతు వివరించారు.


పండిన కందను చూపుతున్న రైతు శివరామకృష్ణ

సాగు ఇలా.. : ముందుగా పొలాన్ని దుక్కి దున్ని బోదులు వేశారు. కంద విత్తనం పుట్టి రూ.11,500 ఉండగా.. ఎకరంలో సాగుకు 20 పుట్టీలు పడతాయి. రైతు రూ.2.30 లక్షలు పెట్టి విత్తనం కొని నాటారు. కూలీలు, యూరియా తదితర ఖర్చులు పెట్టారు. చీడపీడలు రాకుండా జాగ్రత్తలు పాటించారు.

పుట్ట గొడుగులు.. భరోసా ఇచ్చాయ్

అవురుపూడి (కూచిపూడి), న్యూస్‌టుడే : చిన్న తరహా కుటీర పరిశ్రమల్లో ఒకటైన పాల పుట్ట గొడుగుల పెంపకంలో కృష్ణా జిల్లా మొవ్వ మండలం అవురుపూడికి చెందిన మేడిశెట్టి ప్రసన్న రాణిస్తున్నారు. చిన్న వయసులో భర్త దూరమైనా ధైర్యంగా ముందడుగు వేసి ఉపాధికి బలమైన పునాది ఆమె వేసుకున్నారు. ఏడేళ్ల కిందట స్త్రీనిధి కింద తల్లి వంగూరి రత్నకుమారితో కలసి చెరో రూ.లక్ష రుణం తీసుకున్నారు. మండల సమాఖ్య నుంచి సామాజిక పెట్టుబడి నిధిగా రూ.1.50 లక్షలు తీసుకుని పుట్ట గొడుగుల పెంపక కేంద్రం ప్రారంభించారు. మొదట్లో పెంపకంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా తట్టుకుని.. సాగులో మెలకువలు తెలుసుకుని ఆపై జాగ్రత్తలు పాటిస్తూ... ఉత్పత్తులు సాధిస్తున్నారు. నేడు ఖర్చులు పోగా నెలకు రూ.20 వేల వరకు ఆదాయం అందుకుంటున్నారు. గత ఏడాది ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం కింద రూ.5 లక్షల రుణం తీసుకుని సాగు విస్తరించారు. గతంలో విజయవాడ, బెంగళూరు, నరసాపురం వంటి ప్రాంతాలకు మార్కెటింగ్ చేసేవారు. ప్రస్తుతం పరిసర ప్రాంతాల నుంచి వచ్చి పుట్ట గొడుగులు తీసుకెళుతున్నారు. మచిలీపట్నం మార్కెట్‌కూ పంపుతున్నారు. ఇలా ఇంటి పట్టునే ఉండ ఆదాయం ఆర్జిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



ఎవరి మీద ఆధార పడకుండా..: నేను మూడు నెలల గర్భిణిగా ఉండగా భర్త మరణించారు. బయట చాలా ప్రాంతాల్లో పని చేసి చాలా ఇబ్బందులు పడ్డాను. నా కాళ్ల మీద నేను నిలబడాలని ఆలోచించా. విజయవాడలో నాన్న సాయంతో వెళ్లి పుట్టగొడుగుల సాగుపై శిక్షణ పొందా. తర్వాత స్వయం సహాయక సంఘం అందించిన రుణంతో చిన్నపాటి షెడ్డు ఇంటిపై ఏర్పాటు చేసుకుని పాల పుట్ట గొడుగులు సాగు ప్రారంభించా. అంచెలంచెలుగా ఈ రోజు నెలకు రూ.20 వేలు వరకు ఆదాయం వస్తోంది.

- మేడిశెట్టి ప్రసన్న

ఉద్యోగుల డిమాండ్లపై జాతీయ మహాసభల్లో చర్చిస్తాం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు మహారాష్ట్రలోని శిర్డీలో జరగనున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ మహాసభల్లో ఉద్యోగుల సమస్యలపై చర్చించి, తీర్మానాలు రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పిస్తామని ఆ సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు, ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తెలిపారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.విద్యాసాగర్, డి.వి.రమణ నేతృత్వంలో దాదాపు 100 మంది నేతల బృందం గురువారం విజయవాడ నుంచి రైలు మార్గంలో శిర్డీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద విద్యాసాగర్ మీడియాతో మాట్లాడారు. సమాఖ్య అధ్యక్షుడు సుభాష్ లాంబా, ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ నేతృత్వంలో జాతీయ మహాసభలు జరగనున్నాయని చెప్పారు. వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 1200 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా విదేశాల సమాఖ్య ప్రతినిధులు హాజరుకానున్నట్లు వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్నారు. సీపీఎస్, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వేతన సవరణలు, లేబర్ కోడ్లు, అంతర్జాతీయ పరిణామాలపై సమావేశాల్లో చర్చించి, పలు తీర్మానాలు చేస్తామన్నారు. సమాఖ్య జాతీయ కార్యవర్గానికి ఈ నెల 26న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో జాతీయ ఉపాధ్యక్షుడిగా తిరిగి పోటీచేస్తున్నట్లు విద్యాసాగర్ వెల్లడించారు. శిర్డీకి వెళ్లినవారిలో రాష్ట్ర సంఘ ప్రతినిధులు భారతీప్రసాద్, కె.జగదీశ్వరరావు, సుబ్బారెడ్డి, రంజిత్ నాయుడు, మహిళా ప్రతినిధులు జానకి, రాజ్యలక్ష్మి, శాంతిశ్రీ, సరస్వతి, సురేఖ, శివలీల, విజయశ్రీ, లలితాంబ, క్యాపిటల్ సిటీ అధ్యక్షుడు నాగభూషణం, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, నగర శాఖ ప్రతినిధులు ఉన్నారు.



రైల్వేస్టేషన్ వద్ద విద్యాసాగర్, రమణ, ఇతర నాయకులు

'మోకాళ్లపై యాత్ర చేసినా జగన్‌ను ప్రజలు నమ్మరు'

పటమట, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో జగన్ రాష్ట్ర ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేశారని.. ఇప్పుడు ఆయన పాదయాత్ర కాదు మోకాళ్లపై యాత్ర చేసినా ప్రజలు నమ్మబోరని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. మాజీ సీఎం జగన్ మరోసారి పాదయాత్ర చేస్తానంటూ ప్రకటించడంపై గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో వెంకన్న మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా జగన్ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉన్నప్పుడు పాదయాత్ర చేస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిన సీఎం చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని పేర్కొన్నారు. మంత్రి లోకేష్‌కు పద్మవ్యూహం ఛేదించడం తెలుసునని, అందుకే వైకాపా నేతలు లోకేష్‌ను చూసి భయపడుతున్నారన్నారు. రాష్ట్రంలో అరాచకాలు జరిగాయన్న జగన్ చేసిన ఆరోపణలపై దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. జగన్ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని, లేదంటే రానున్న ఎన్నికల్లో వైకాపా ఒక్క సీటుకే పరిమితమవడం ఖాయమన్నారు. సమావేశంలో తెదేపా రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకన్న, పక్కన గురునాథం

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోండి

రైల్వే జీఎంకు ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: కొండపల్లి రైల్వే స్టేషన్ నుంచి విజయవాడలోని కృష్ణామిల్క్ యూనియన్ వరకు రైల్వే ట్రాక్ వెంట మురుగునీరు, వర్షపు నీరు పేరుకుపోయే సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్ నిలయంలో గురువారం ఎంపీ కేశినేని శివనాథ్, భాజపా మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి నూతలపాటి బాల కోటేశ్వరరావు, ఇతర నాయకులు అధికారులతో కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ.. కొండపల్లి-విజయవాడ మధ్య కీలకమైన రైల్వే కారిడార్ వెంట శాస్త్రీయ డ్రెయినేజీ వ్యవస్థ, క్రాస్ డ్రెయినేజీ నిర్మాణాలు, ఛానెల్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల వర్షాకాలంలోనే కాకుండా చిన్న పాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోతుందని తెలిపారు. కొండపల్లి పారిశ్రామిక ప్రాంతం నుంచి సరకు రవాణా అధికంగా ఉండడం ఈ లైన్ వ్యూహాత్మకంగా ఎంతో ప్రాముఖ్యం ఉందని చెప్పారు. విజయవాడ రైల్వే స్టేషన్‌పై పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు శాటిలైట్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ ప్రస్తావించారు. భవిష్యత్తులో అమరావతి కొత్త రైల్వే లైన్‌కు దగ్గరగా ఉండటం వంటి అంశాలను వివరించారు. వీటిపై నివేదిక సిద్ధం చేసి సంబంధిత విభాగాలతో సంయుక్త తనిఖీ చేపట్టి ప్రజా సౌలభ్యం, లాజిస్టిక్స్ రవాణాను దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరగా జీఎం సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సి.ఎ.వో. ఆర్.ఎస్.పి సందీప్ కుమార్ జైన్, డి.జి.ఎం ఉదయనాథ్ కోట్ల, సెక్రటరీ జి.ఎం.మల్లాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


జీఎంకు వివరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

చదువు ఇష్టం లేక ఇంటి నుంచి వెళ్లిన బాలుడు

డ్రోన్ సాయంతో కనిపెట్టి అప్పగింత

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే: చదువుపై ఇష్టం లేక ఇంట్లో నుంచి వెళ్లిపోయిన బాలుడిని డ్రోన్ సాయంతో పట్టుకొని తల్లికి అప్పగించినట్లు విజయవాడలోని కొత్తపేట పోలీస్‌స్టేషన్ సీఐ చిన కొండలరావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమనేడి దుర్గాదేవి, శివ దంపతులు వించిపేట ఆబోతుపాకల వీధిలో ఉంటున్నారు. వారికి ఒక పాప, ఒక బాబు సంతానం. భర్త ఎలక్ట్రీషియన్‌గా చేస్తుండగా, భార్య దుస్తుల దుకాణంలో పని చేస్తుంది. వారి కుమారుడు కుషాల్ కుమార్ కంకిపాడులో అమ్మమ్మ ఇంట్లో ఉంటూ 5వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు వించిపేటలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. ఈనెల 21న ఆడుకునేందుకు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బాలుడి తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ.. సిబ్బందితో పాటుగా డ్రోన్ సహాయంతో కుషాల్‌కుమార్‌ను మహంతిపురంలోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల పక్క వీధిలో తిరుగుతున్నట్లు గుర్తించారు. బాలుడిని పట్టుకుని తల్లికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న సీఐ చిన కొండలరావు

☛ కుషాల్ కుమార్ బస్టాండ్, రైల్వేస్టేషన్, తదితర ప్రాంతాల్లో తిరుగుతూ ఆకలి తట్టుకోలేక చివరికి 22న సాయంత్రం ఇంటికి వెళ్దామని వస్తుండగా. . మహంతిపురంలో పోలీసులకు దొరికాడు. ఆ బాలుడు ఇల్లు చిరునామా తెలియక తప్పిపోవడం కాదని, చదువుపై ఆసక్తి లేక సంక్రాంతి సెలవులు పూర్తికాగానే అమ్మమ్మ ఇంటికి పంపిస్తారని మూడు రోజుల కిందట ఇంట్లో అటకెక్కి దాక్కున్నాడు. కుటుంబ సభ్యులు కంగారు పడి అన్ని చోట్ల వెతికారు. చివరికి ఇంట్లోనే గుర్తించారు. మళ్లీ 21వ తేదీన బయటకు వెళ్లిపోయాడని బాలుడికి సంబంధించిన వారు తెలిపారు.

'ప్రమాదంలో లౌకిక విలువలు'

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : దేశంలో లౌకిక విలువలు ప్రమాదంలో ఉన్నాయని.. సెక్యులరిజం బలహీనపడితే దేశం ప్రమాదంలో పడినట్టేనని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ మహిళా హక్కుల నాయకురాలు సైదా సయ్యద్ హమీద్ హెచ్చరించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ ఫర్ కమ్యునల్ హార్మోనీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవ్ సెక్యులరిజం' సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇది మతాల మధ్య తగాదా కాదని.. రాజ్యాంగం వర్సెస్ మతోన్మాదం అని అన్నారు. అంబేడ్కర్ నిర్మించిన భారత రాజ్యాంగం మతానికి కాకుండా మానవ గౌరవానికి ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పారు. కానీ నేడు మతాన్ని రాజకీయ ఆయుధంగా మార్చి దేశాన్ని విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కులమత ప్రసక్తి లేని వసుధైక కుటుంబంగా బతకాలని కోరారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. మతం పేరుతో రాజకీయాలు చేస్తే ప్రజల మధ్య ద్వేషం, విషం నింపినట్టేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు కొలను కొండ శివాజీ మాట్లాడుతూ.. లౌకికత లేకుండా సమాజంలో శాంతి సాధ్యం కాదన్నారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేడ్కర్) అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళుతూ.. సెక్యులరిజం రక్షణకు నిజమైన కాపలాదారులుగా నిలవాలన్నారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ.. ఈ దేశం అంబేడ్కర్ రాజ్యాంగం పునాదులపై నిలబడిందని చెప్పారు. దేశ సమైక్యత, సమగ్రతను విచ్ఛిన్నం చేయడం అసాధ్యమన్నారు. కార్యక్రమంలో బ్రైట్ హారిజోన్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.కె.ఎస్.మొహిద్దీన్, సీనియర్ న్యాయవాది అబ్దుల్ మతీన్, డాక్టర్ రహ్మాన్, బాబా హుస్సేనీ, మునీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైదా సయ్యద్ హమీద్. వేదికపై శోభనాద్రీశ్వరరావు, రామకృష్ణ తదితరులు

విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

కృష్ణలంక, న్యూస్‌టుడే: విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం తలెత్తిన ఘటన కృష్ణలంకలో సంభవించింది. అందిన వివరాల ప్రకారం ప్లైవుడ్ దుకాణంలో పనిచేసే సంగనం వెంకటరెడ్డి కుటుంబం 22వ డివిజన్‌లో గంగానమ్మ గుడి వీధిలోని భవనం రెండో అంతస్తులో అద్దెకుంటున్నారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో ఒక్కసారిగా రిఫ్రిజిరేటర్ ఉంచిన స్విచ్ బోర్డు నుంచి పొగతో కూడిన మంట రావడాన్ని గమనించి కుటుంబ సభ్యులు ఆందోళనతో బయటకు పరుగెత్తారు. నిమిషాల వ్యవధిలో పొగ ఇంటి మొత్తాన్ని చుట్టు ముట్టి ఏసీ, ఓవెన్ తదితర గృహోపకరణాలకు మంటలు వ్యాపించడాన్ని గమనించి పరుగున వెళ్లి ఫ్యూజు తీసేశారు. రెగ్యులేటర్‌ను ఊడదీసి గ్యాస్ సిలిండర్‌తో కిందకు చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది వచ్చి మంటలను పూర్తిస్థాయిలో ఆర్పివేసినప్పటికీ అప్పటికే ఇంట్లో ఉన్న గృహోపకరణాలు, దుస్తులు కాలి బూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం తలెత్తినట్లు భావిస్తున్నామని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొన్నారు.


కాలిబూడిదైన రిఫ్రిజిరేటర్, ఏసీ

బీఎల్ సంతోష్‌కు ఘన స్వాగతం

గన్నవరం గ్రామీణం: భారతీయ జనసంఘ్ స్థాపించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయవాడలో నిర్వహించే జాతీయ మహాసభల్లో పాల్గొనేందుకు భాజపా జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ గురువారం రాత్రి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. దిల్లీ నుంచి విమానాశ్రయం చేరుకున్న సంతోష్‌కు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి ఘన స్వాగతం పలికారు. సంతోష్‌తో పాటు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఉన్నారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడ వెళ్లారు.


సంతోష్‌కు స్వాగతం పలుకుతున్న మాధవ్, సుజనాచౌదరి తదితరులు


సిద్ధమైన మహాసభల వేదిక

అమరావతిలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ సేవలు

ఈనాడు డిజిటల్, అమరావతి : నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) పరిపాలన కార్యాలయం ఏర్పాటుతో బ్యాంకింగ్ సేవలు మెరుగుపడతాయని పీఎన్‌బీ సర్కిల్ హెడ్ పంకజ్‌కుమార్ తెలిపారు. అమరావతిలో పీఎన్‌బీ బ్యాంక్ పరిపాలన కార్యాలయ నిర్మాణానికి సంబంధించి సీఆర్‌డీఏతో గురువారం లీజు ఒప్పందం కుదిరింది. ఒప్పంద పత్రాన్ని ఏపీసీఆర్‌డీఏ జాయింట్ డైరెక్టర్ వి.డేవిడ్ రాజు.. పీఎన్‌బీ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా పంకజ్‌కుమార్ మాట్లాడుతూ.. అమరావతిని ఆధునిక ఆర్థిక, పరిపాలన కేంద్రంగా అభివృద్ధి చేయడంలో పీఎన్‌బీ, ఏపీసీఆర్‌డీఏ తమ సహకారాన్ని కొనసాగిస్తాయని చెప్పారు. కార్యాలయం నిర్మాణానికి పీఎన్‌బీ రూ.15 కోట్లు వెచ్చించనుంది. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు శ్రీకాంత్, నరసింహ రెడ్డి పాల్గొన్నారు.


సీఆర్‌డీఏ జాయింట్ డైరెక్టర్ డేవిడ్‌రాజు నుంచి ఒప్పంద పత్రం అందుకుంటున్న బ్యాంకు అధికారులు

'మానవ హక్కుల కమిషన్లు నిర్వీర్యం'

ఉప్పులూరు ఘటనపై న్యాయ విచారణ జరపాలి

ఈనాడు డిజిటల్, అమరావతి : మానవ హక్కుల కమిషన్లు బలంగా ఉంటే ప్రభుత్వాలను నిలదీస్తాయని, కానీ పాలకులు వాటిని నిర్వీర్యం చేస్తున్నారని వక్తలు ఆరోపించారు. ఉప్పులూరులోని కోడి పందేల్లో దళితులపై జరిగిన దాడిపై న్యాయ విచారణ జరపాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం విజయవాడ బాలోత్సవ భవన్‌లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పౌర హక్కుల సంఘం నాయకులు, సుప్రీం కోర్టు న్యాయవాది పి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. బలహీనులకు అండగా ఉండాల్సిన హక్కుల కమిషన్లను ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి మాట్లాడుతూ.. కూలి డబ్బులు అడిగినందుకు 11 మందిని అర్ధనగ్నంగా తాళ్లతో బంధించి, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు నష్టపరిహారం ఇవ్వడంతో పాటు రక్షణ కల్పించాలని కోరారు. ఈ నెల 27వ తేదీన దళిత, బీసీ, ప్రజాసంఘాలు తోట్లవల్లూరు వెళ్లి బాధితులను పరామర్శించనున్నాయని తెలిపారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు వై.నర్సింహరావు మాట్లాడుతూ.. ఈ ఘటనపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇలాంటి దాడులను ఎదుర్కోవడానికి దళిత, ప్రజాసంఘాలు సంయుక్తంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దాడి ఘటన బాధితుడు వల్లూరి సురేష్ మాట్లాడుతూ.. పనికి తీసుకెళ్లి.. డబ్బులు అడిగినందుకు మాపై దాడికి పాల్పడ్డారని వాపోయారు. కొంతమంది తీవ్రగాయాలై నడవలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి వి.సావిత్రి, ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెమెడ క్రాంతికుమార్, జేఏసీ అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

(కిలో జీ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -150 రిటైల్ ధర 177 చికెన్ విత్ స్కిన్ - 257 చికెన్ స్కిన్‌లెస్ - 292.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 172, 181, 192 చికెన్ విత్ స్కిన్ - 334 చికెన్ స్కిన్‌లెస్ - 344.

ఈనాడు బిజినెస్

రూ.4.43 లక్షల కోట్లు పెరిగిన సంపద

సెన్సెక్స్ ▲398	నిఫ్టీ ▲132
82307	25290

అంతర్జాతీయ మార్కెట్లు లాభాల బాట పట్టడంతో, మన స్టాక్ మార్కెట్లు కూడా అదే దారిలో నడిచాయి. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు గురువారం విరామం పడింది. గ్రీన్‌లాండ్ స్వాధీనతకు సంబంధించి, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజీ స్వరం వినిపించడంతో పాటు భారత్‌తో మంచి వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సూచనప్రాయంగా వెల్లడించడం మదుపర్లను మెప్పించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు లాభపడి 91.58 వద్ద స్థిరపడింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 1.1% తగ్గి 64.52 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4.43 లక్షల కోట్లు పెరిగి, రూ.458.52 లక్షల కోట్ల (5.01 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

సైయెంట్ లాభం రూ.92 కోట్లు



ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ సేవల సంస్థ సైయెంట్ లిమిటెడ్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.1,848.5 కోట్ల ఆదాయంపై రూ.91.8 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.1,926.4 కోట్లు, నికర లాభం రూ.122.3 కోట్లుగా ఉంది. వీటితో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో నికర లాభం 24.9% తగ్గింది. కొత్త లేబర్ కోడ్ అమలు కోసం రూ.42.3 కోట్లు కేటాయించడం, సంస్థ లాభాలపై ప్రభావం చూపింది.

✦ క్లిష్టమైన స్థూల ఆర్థిక పరిస్థితుల్లోనూ, కంపెనీ వృద్ధి పథంలోనే ఉందని సైయెంట్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ బొదనపు తెలిపారు. తమ నగదు నిల్వలు, లాభదాయకత భవిష్యత్తు వృద్ధికి భరోసానిస్తున్నాయని పేర్కొన్నారు. డీఈటీ విభాగంలో కొత్త నాయకత్వం వృద్ధిని నడిపిస్తోందని, ఈ త్రైమాసికంలో 8 కొత్త ఒప్పందాలు చేసుకున్నామని కంపెనీ సీఈఓ సుకమల్ బెనర్జీ తెలిపారు.

సోనీ - టీసీఎల్ చెట్టాపట్టాల్

టీవీ వ్యాపారంలో మార్జిన్లు తగ్గడంతో జట్టుకట్టిన జపాన్-చైనా కంపెనీలు



టీవీ వ్యాపారంలో మార్జిన్లు తగ్గుతున్న నేపథ్యంలో, అంతర్జాతీయ విపణిలో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. జపాన్‌కు చెందిన సోనీ, చైనాకు చెందిన టీసీఎల్ జట్టుకట్టి, సంయుక్త సంస్థను ఏర్పాటు చేస్తున్నాయి. సోనీ తమ టీవీ, హోమ్ వీడియో వ్యాపారంలో నియంత్రణ వాటాను టీసీఎల్‌కు సంయుక్త సంస్థ ద్వారా బదిలీ చేయడానికి అంగీకరించింది. ఈ ఒప్పందం ప్రకారం, సంయుక్త కంపెనీలో టీసీఎల్‌కు 51%, సోనీకి 49% వాటాలు ఉంటాయి. 2027 ఏప్రిల్‌లో కొత్త కంపెనీ కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉంది. ఇందుకు నియంత్రణ సంస్థల అనుమతులు లభించాల్సి ఉంటుంది.

ప్రత్యేక బ్రాండ్లు కొనసాగుతాయ్

సోనీ, బ్రావియా బ్రాండ్ల కింద ఉత్పత్తుల విక్రయించడం కొనసాగిస్తామని సోనీ స్పష్టం చేసింది. అయితే మొత్తం వ్యవహారాలను కొత్త (సంయుక్త) కంపెనీ నడిపించనుందని తెలుస్తోంది. ఉత్పత్తుల అభివృద్ధి నుంచి తయారీ, విక్రయాలు, డిస్ట్రిబ్యూషన్, కస్టమర్ తోడ్పాటు వంటి వాటిని కొత్త సంస్థ నిర్వహించనుంది. వినియోగదారులకు సేవల్లో ఎటువంటి తక్షణ మార్పులు ఉండవు. రాబోయే రోజుల్లో సోనీ బ్రాండెడ్ టీవీలు ఎక్కడ ఉత్పత్తి చేస్తారు, వాటి ధరలు ఎలా ఉంటాయి, కొత్త ఉత్పత్తుల విడుదల వంటి అంశాలపై మాత్రం ప్రభావం ఉంటుంది.

● ఒప్పందం ప్రకారం.. సోనీ తమ బ్రాండ్ పేర్లు, హక్కులను అట్టిపెట్టుకోనుంది. ఇమేజ్ ప్రాసెసింగ్, ఆడియో వ్యవస్థలు సహా మేధో సంపత్తి హక్కులు, సాంకేతికతను మాత్రం కొత్త కంపెనీకి అందిస్తుంది. సంయుక్త సంస్థ తయారు చేసి, విక్రయించే భవిష్యత్తు ఉత్పత్తులు, బ్రావియా బ్రాండ్ కింద కొనసాగుతాయి. అభివృద్ధి, తయారీ, విక్రయాలు, లాజిస్టిక్స్, కస్టమర్ సపోర్ట్ సహా నియంత్రణను సంయుక్త సంస్థకు సోనీ బదిలీ చేస్తుంది. మెజారిటీ వాటాదారుగా నిర్ణయాధికారాలు టీసీఎల్ చేతిలో ఉంటాయి.

సోనీ టీవీ వ్యాపారం తీరు ఇలా

ప్రీమియం ఉత్పత్తులను రూపొందించే సోనీ సంస్థకు చెందిన టీవీ వ్యాపారం కొన్నేళ్లుగా ఒత్తిడికి గురవుతోంది. అంతర్జాతీయంగా టీవీలను భారీగా తయారు చేస్తున్న సంస్థలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. గ్లోబల్ మార్కెటింగ్ రిసెర్చ్ సంస్థ ఓమ్డియా ప్రకారం.. అంతర్జాతీయ టీవీ మార్కెట్లో సోనీకి ఆదాయ పరంగా 4.2%, పరిమాణం పరంగా 1.7% వాటాలున్నాయి. 2025లో సోనీ టీవీ వ్యాపార ఆదాయం దాదాపు 9.6% క్షీణించింది. అమ్మకాలు నెమ్మదించడం, పలు దేశాల్లో ధరల ఒత్తిళ్లు ఇందుకు కారణమవుతున్నాయి. రూ.2 లక్షల పైబడిన టీవీల విభాగంలో సోనీ మూడో స్థానంలో ఉంది. ఈ విభాగంలో శామ్‌సంగ్‌కు 53.1%, ఎల్‌జీకి 26.1% వాటాలుండగా, సోనీ 15.7% వాటాకు పరిమితమైంది. ఓఎల్ఈడీ విభాగంలో కూడా 10.2% వాటాతో మూడో స్థానంలో సోనీ ఉంది. ఎల్‌జీ, శామ్‌సంగ్ ఇందులో ముందున్నాయి.

టీసీఎల్ పరిస్థితి ఇదీ

ప్రపంచంలో అతిపెద్ద టీవీ తయారీ సంస్థల్లో ఒకటిగా టీసీఎల్ ఉంది. 2024లో టీసీఎల్ దాదాపు 2.9 కోట్ల టీవీలను విక్రయించింది. అంతర్జాతీయ మార్కెట్లో ఈ సంస్థకు 14% వాటా ఉంది. అంతర్జాతీయ టీవీ సరఫరాల్లో చైనా కంపెనీలు టీసీఎల్, హైసెన్స్ వాటాలు పెరుగుతూ వస్తున్నాయి. 85 అంగుళాలు, అంతకంటే పెద్ద టీవీల విభాగంలో టీసీఎల్‌కు 22.1% వాటా ఉంది. మినీ ఎల్ఈడీ టీవీల్లో అత్యధికంగా 28.8% మార్కెట్ వాటా టీసీఎల్ సొంతం. అందుబాటు ధర ఉత్పత్తులను టీసీఎల్ విక్రయిస్తోంది.

ప్రయోజనాలతో పాటు సవాళ్లున్నాయ్

ఈ ఒప్పందం ఫలితంగా, ప్రీమియం విభాగంలో సోనీ బ్రాండ్‌కు ఉన్న విలువ ప్రయోజనాన్ని టీసీఎల్ పొందుతుంది. సోనీ బ్రాండ్ టీవీలు స్పష్టమైన చిత్రం, ఖచ్చితమైన ప్రసారం చేస్తున్నాయి. టీసీఎల్ తయారీ సామర్థ్యానికి సోనీ బ్రాండ్ విలువ కలవడం ద్వారా, సంయుక్త సంస్థ అమ్మకాలు పెరగొచ్చు. ప్రతి మార్కెట్లో ప్రీమియం బ్రాండ్‌ను ప్రారంభించడం ద్వారానే, అధిక ధర కలిగిన ఉత్పత్తులను టీసీఎల్ విక్రయించే సౌలభ్యం ఉంటుంది. సోనీ బ్రాండ్, టెక్నాలజీ సాయంతో టీసీఎల్ డిస్ట్రిబ్యూషన్, ధరల నిర్ణయ శక్తి బలోపేతం కానున్నాయి. అయితే నిర్వహణ ఖర్చుల భారాన్ని టీసీఎల్ ఎదుర్కోవచ్చు.

సోనీ బ్రాండ్‌ను నిలబెట్టుకోవడానికే..

టీవీ విభాగంలో లాభదాయకత క్షీణించడం, కొన్నేళ్లుగా జపాన్ ఎలక్ట్రానిక్స్ సంస్థ పానసోనిక్ టీవీల ఉత్పత్తుల్లో వినియోగించే విడిభాగాలను ఔట్‌సోర్సింగ్ విధానంలో తీసుకుంటోంది. కొన్ని విపణుల్లో మాత్రమే దృష్టి పెట్టింది. తయారీ - అమ్మకాల పరిమాణాన్ని తగ్గిస్తోంది. దీంతో పోలిస్తే సోనీ ఒప్పందం కొంత సహేతుకంగానే ఉంది. బ్రాండ్, కీలక టెక్నాలజీలపై నియంత్రణ కలిగి ఉంటూనే, సంయుక్త సంస్థలో వాటా ఉంచుకోవడం ద్వారా.. నిర్వహణ ఇబ్బందులు తప్పించుకుని, ప్రీమియం టీవీ మార్కెట్లో కొనసాగే ప్రయత్నం సోనీ చేస్తోంది.

- ఈనాడు వాణిజ్య విభాగం

ఫోన్‌పే రూ.13,500 కోట్ల ఐపీఓ!

వాటాలు విక్రయించనున్న వాల్‌మార్ట్, మైక్రోసాఫ్ట్, టైగర్ గ్లోబల్



డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా 1.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.13,500 కోట్లు) సమీకరించడానికి సిద్ధమవుతోంది. గత అక్టోబరులో టాటా క్యాపిటల్ రూ.15,512 కోట్ల ఐపీఓ తర్వాత ఇదే అతిపెద్దది కానుంది. ఐపీఓ కోసం ఫోన్‌పే విలువను 15 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.35 లక్షల కోట్లు)గా పరిగణించొచ్చని భావిస్తున్నారు. ఈ ఐపీఓ కింద ఫోన్‌పేలో దాదాపు 12% వాటాను వాల్‌మార్ట్ తగ్గించుకోనుంది. ప్రస్తుత వాటాదార్లయిన మైక్రోసాఫ్ట్, టైగర్ గ్లోబల్ సంస్థలు పూర్తిగా తమ వాటాలను విక్రయించనున్నాయి. ఇష్యూలో భాగంగా 5.07 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదార్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిలో విక్రయించనున్నట్లు ముసాయిదా పత్రాల్లో ఫోన్‌పే తెలిపింది. కంపెనీ కొత్తగా ఎటువంటి షేర్లు జారీ చేయదని సమాచారం. అందువల్ల పబ్లిక్ఇష్యూ ద్వారా సమీకరించే నిధులేమీ కంపెనీకి చేరవు. 2026 మధ్యలో స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఫోన్‌పే షేర్లు నమోదయ్యే అవకాశం ఉంది.

✦ ప్రస్తుతం ఫోన్‌పేలో అనుబంధ సంస్థ డబ్ల్యూఎం డిజిటల్ కామర్స్ హోల్డింగ్స్ ద్వారా 71.77% వాటాను వాల్‌మార్ట్ కలిగి ఉంది. ఐపీఓలో భాగంగా వాల్‌మార్ట్ 4.59 కోట్ల షేర్లు, మైక్రోసాఫ్ట్ గ్లోబల్ ఫైనాన్స్ 36.78 లక్షల షేర్లు, టైగర్ గ్లోబల్ 10.39 లక్షల షేర్లను విక్రయించనున్నాయి.

✦ 2022-23లో ఫోన్‌పే విలువను 12 బిలియన్ డాలర్లు (సుమారు రూ.లక్ష కోట్లు)గా పరిగణించి, రూ.7,021 కోట్లను జనరల్ అట్లాంటిక్, వాల్‌మార్ట్, రిబిట్ క్యాపిటల్, టీవీఎస్ క్యాపిటల్ ఫండ్స్, టైగర్ గ్లోబల్ అందించాయి. 2016లో స్థాపితమైన ఫోన్‌పే, ఇప్పటివరకు రూ.18,000 కోట్ల నిధులను సమీకరించింది.

గౌతమ్ అదానీకి ఇ-సమన్లు?

భారత ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఎస్ఈసీ చర్యలు!



భారత కుబేరుడు గౌతమ్ అదానీ, ఆయన సోదరుడి కుమారుడైన సాగర్ అదానీలకు 'మోసం, లంచం' కేసులో ఇ-సమన్లు ఇవ్వాలని అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (యూఎస్ ఎస్ఈసీ) భావిస్తోంది. ఇందుకోసం అమెరికా కోర్టును ఆశ్రయించింది. గతంలో ఎస్ఈసీ నుంచి సమన్లు ఇవ్వడానికి వచ్చిన విజ్ఞప్తులను రెండు సార్లు మనదేశం తిరస్కరించింది. ఈ హైప్రొఫైల్ కేసులో సమన్లు ఇవ్వడానికి ఎస్ఈసీ గత ఏడాది నుంచీ ప్రయత్నిస్తోంది. అదానీ గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తి చేసిన విద్యుత్ కొనుగోలు కోసం భారత్‌లో ప్రభావం చూపే నాయకులు, అధికారులకు లంచాలు ఇచ్చారని.. ఇందుకోసం అమెరికన్ల వద్ద పెట్టుబడి రూపంలో సమీకరించిన నిధులు వినియోగించారన్నది ఆరోపణ.

కోడి గుడ్లు

23న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	470
వరంగల్	472
విజయవాడ	500
తూ/ప గోదావరి	475
విశాఖపట్నం	475
చిత్తూరు	523

పలురకాల క్యాన్సర్ చికిత్సకు జైడస్ నుంచి బయోసిమిలర్

దిల్లీ: పలు రకాల క్యాన్సర్ చికిత్సల నిమిత్తం, దేశీయ విపణికి బయోసిమిలర్ ఔషధాన్ని ఆవిష్కరించినట్లు జైడస్ లైఫ్‌సైన్సెస్ గురువారం తెలిపింది. క్యాన్సర్ చికిత్సలో వినియోగించే నివోలుమ్యాబ్ ఔషధానికి చెందిన ప్రపంచంలోనే తొలి బయోసిమిలర్‌ను 'తిస్థా' బ్రాండ్ పేరిట భారత్‌కు పరిచయం చేస్తున్నట్లు వివరించింది. 100 ఎంజీ, 40 ఎంజీ మోతాదుల్లో లభించే తిస్థా ధరలు వరుసగా రూ.28,950; రూ.13,950గా ఉంటాయని తెలిపింది. రెఫరెన్స్ డ్రగ్‌తో పోలిస్తే ఈ ధరలు దాదాపు నాలుగో వంతు మాత్రమేనని పేర్కొంది. ఈ బ్రాండ్ ఆవిష్కరణతో ఇమ్యునో-ఆంకాలజీ విభాగంలో మరింత విస్తరించినట్లయిందని జైడస్ ఎండీ శర్విల్ పి.పటేల్ పేర్కొన్నారు.

78% క్షీణించిన ఇండిగో లాభం

విమాన సర్వీసుల రద్దు, కొత్త కార్మిక చట్టాల అమలు ప్రభావం



దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి రూ.549.10 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.2,448.80 కోట్ల కంటే ఇది 78% తక్కువ. గత నెలలో భారీగా విమాన సర్వీసుల రద్దు వల్ల రూ.577.20 కోట్ల మేర ప్రభావం పడిందని, కొత్త కార్మిక చట్టాల అమలు కోసం రూ.969.30 కోట్లు కేటాయించడమూ నికర లాభం క్షీణతకు కారణమైందని కంపెనీ తెలిపింది. విమాన సర్వీసుల అంతరాయాలకు గాను పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) విధించిన రూ.22.2 కోట్ల జరిమానాను కూడా అనుకోని వ్యయాల కింద కంపెనీ చూపించింది. రూపాయి విలువ క్షీణత నేపథ్యంలో, డాలరు రూపేణా చెల్లింపులకు రూ.1,035 కోట్ల భారం పడినట్లు తెలిపింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో ఇండిగో మొత్తం ఆదాయం రూ.24,540.60 కోట్లకు చేరింది. 2024-25 ఇదే త్రైమాసికం నాటి రూ.22,992.80 కోట్ల కంటే ఇది 7% అధికం.

✦ సమీక్షా త్రైమాసికంలో ఇండిగో మొత్తం 3.2 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చింది. 2025 మొత్తంమీద ఈ సంఖ్య సుమారు 12.40 కోట్లుగా ఉంది.

✦ డిసెంబరు చివరికి ఇండిగో వద్ద ఉన్న మొత్తం విమానాల సంఖ్య 440. నగదు, నగదు సమాన నిల్వలు రూ.51,606.90 కోట్లుగా ఉన్నాయి.

✦ శీతాకాలం షెడ్యూల్‌కు సంబంధించి ఇండిగో విమాన సర్వీసుల్లో డీజీసీఏ 10% కోత విధించడంతో.. ఆ స్లాట్స్‌లో సర్వీసులు నడిపేందుకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా మిగతా విమానయాన సంస్థలకు ప్రభుత్వం సూచించింది.

సాయి పేరెంటరల్స్ ఐపీఓకు సెబీ ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: ఔషధ తయారీలో నిమగ్నమైన హైదరాబాద్ సంస్థ సాయి పేరెంటరల్స్, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రతిపాదనకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతి లభించింది. ఈ ఐపీఓ ద్వారా రూ.425 కోట్లు సమీకరించాలన్నది కంపెనీ ప్రణాళిక. ఇందులో రూ.285 కోట్ల విలువైన తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ప్రస్తుత వాటాదార్లు విక్రయించే 35 లక్షల ఈక్విటీ షేర్లు ఉంటాయి. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా, ఫిబ్రవరి మూడో వారంలో ఇష్యూ ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. షేర్లను బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదు చేస్తారు. షేరు ధరల శ్రేణిని త్వరలో ప్రకటిస్తామని కంపెనీ తెలిపింది.

జనవరిలోనే వికసించిన 'రోడోడెండ్రాన్'



ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో ఉన్న లాటూ దేవతా అటవీ ప్రాంతంలో 'రోడోడెండ్రాన్ పుష్పాలు' ఈ ఏడాది జనవరిలోనే వికసించాయి. సాధారణంగా మార్చి-ఏప్రిల్ నెలల్లో ఇవి వస్తాయి. ఈ పరిణామంపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది హిమాలయాల్లో పెరుగుతున్న శీతాకాల వేడిమికి, వాతావరణ మార్పులకు కారణమని చెబుతున్నారు. గత దశాబ్ద కాలంగా మధ్య హిమాలయాల్లో శీతకాలపు సగటు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీన్నే 'వింటర్ వార్మింగ్ ట్రెండ్'గా పేర్కొంటున్నారు. నవంబరు నుంచి వర్షాలు లేకపోవడం, శీతాకాలపు ఉష్ణోగ్రతలు పెరగడమే ఈ పుష్పాలు ముందుగా వికసించడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. ఈ పుష్పాల మీద ఆధారపడే కీటకాలు, తేనెటీగలు, సీతాకోక చిలుకలు, పక్షుల జీవిత చక్రంలో సమన్వయం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర వృక్షమైన ఈ 'రోడోడెండ్రాన్' చెట్టు 1,500-3,600 మీటర్ల వరకు పెరుగుతుంది. ఈ చెట్టు పూలల్లో ఔషధ గుణాలు పుష్కలం. సిరప్, మందులు, ఆయుర్వేద వైద్యంలో వీటిని ఉపయోగిస్తారు.

ఈటీవీ భారత్

మూడు కిలోల వెండితో 'వివాహ ఆహ్వాన పత్రిక'

బంగారంతో పోటీపడుతూ వెండి ధర రోజురోజుకూ కొండెక్కుతున్న తరుణంలో రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన శివ్ జోహారీ.. తన కుమార్తె వివాహం కోసం మూడు కిలోల స్వచ్ఛమైన వెండితో ప్రత్యేక ఆహ్వాన పత్రికను తయారు చేయించడం విశేషం. మొత్తం 128 విడిభాగాలతో రూపొందిన ఈ పత్రికలో కనీసం ఒక్క మేకు లేదా స్క్రూ కూడా వాడలేదు. చేతితో దీని తయారీకి ఏడాది సమయం పట్టింది. దాదాపు రూ.25 లక్షలు ఖర్చు అయినట్లు అంచనా. వినాయకుడు, శివపార్వతులు, శ్రీరాముడు, తిరుమల బాలాజీ, అష్టలక్ష్ములతోపాటు 65 దేవతా విగ్రహాలు, దేవుడి ద్వార పాలకులను ఇందులో పొందుపరిచారు. 8x6.5 అంగుళాల కొలతలతో 3 అంగుళాల లోతు గల పెట్టెగా దీన్ని సిద్ధం చేశారు. తన కుమార్తె శ్రుతి జోహారీ పెళ్లి చిరస్మరణీయంగా ఉండాలని ఇలా తయారు చేయించినట్లు శివ్ జోహారీ తెలిపారు.



ఈసీ సేవలన్నీ ఇక నుంచి 'ఈసీఐనెట్'లో

దిల్లీ: ఓటర్లు, రాజకీయ పార్టీలు, అధికారుల సౌకర్యార్థం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) 'ఈసీఐనెట్' అనే కొత్త డిజిటల్ వేదికను అందుబాటులోకి తీసుకొచ్చింది. దిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ గురువారం దీన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన తప్పుడు సమాచారాన్ని అడ్డుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని, ఎన్నికల ప్రక్రియలో అధికారిక వివరాలన్నీ ఇందులో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ సదస్సుకు హాజరైన వివిధ దేశాల ఎన్నికల సంఘాలు కూడా తప్పుడు సమాచార నిరోధానికి వారి భాషలు, తమ చట్టాలకు అనుగుణంగా ఇలాంటి డిజిటల్ వేదికలను తీసుకురావడానికి సహకరిస్తామని తెలిపారు. ఓటరు హెల్ప్‌లైన్, ఓటరు టర్న్‌అవుట్, సీ విజిల్, సువిధ వంటి 40కు పైగా ఉన్న యాప్‌లు, పోర్టళ్లకు సమ్మిళితంగా 'ఈసీఐనెట్' ఉంటుందని.. ఓటర్లు, రాజకీయ పార్టీలు, అధికారులు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఏ సహాయం అయినా ఇక నుంచి సులువుగా దీని ద్వారా పొందొచ్చని ఈసీ వెల్లడించింది.



సమస్యలను మీరెలా చూస్తారు?

మన మనస్తత్వాన్ని బట్టే మనకెదురయ్యే పరిస్థితులను చూసే కోణం ఉంటుంది. బలహీన మనస్కులకు ప్రతి విషయంలోనూ సమస్యలే కనిపిస్తాయి. కానీ బలమైన మనస్తత్వంతో ఉండేవారు ప్రతికూల పరిస్థితులను సమస్యలుగా కాకుండా సవాళ్లలా భావిస్తారు. వాటిని పరిష్కరించడం ద్వారా కొత్త అవకాశాలను అందిపుచ్చుకొనే ప్రయత్నం చేస్తారు.

– హర్ష్ గోయెంకా, వ్యాపారవేత్త

ప్రపంచం కోసమే ఈ శాంతి మండలి

● దావోస్ వేదికగా 'గాజా పీస్ బోర్డు'ను ప్రారంభించిన ట్రంప్

దావోస్: ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందంలో కీలకమైన గాజా శాంతి మండలిని గురువారం లాంఛనంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించారు. ఛైర్మన్ హోదాలో ఆయన మండలి చార్టర్‌పై సంతకం చేశారు. ఐక్యరాజ్యసమితికి పోటీగా దీన్ని ట్రంప్ తెరపైకి తీసుకొస్తున్నారన్న వార్తల నేపథ్యంలో దావోస్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి భారత్ సహా పలు దేశాలు దూరంగా ఉండటం గమనార్హం. పశ్చిమాసియాలో కీలక దేశాలైన సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈలు హాజరయ్యాయి. ఈజిప్టు, తుర్కియే, అజర్‌బైజాన్, పాకిస్థాన్, మొరాకో, ఇండోనేసియా, పరాగ్వే, హంగేరి సహా మొత్తం 19 దేశాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. గాజా శాంతి మండలి (గాజా పీస్ బోర్డు) అమెరికా కోసం కాదు, ప్రపంచం కోసం అని పేర్కొన్నారు. ఈ మండలిలో చేరేందుకు చాలా దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయని తెలిపారు. ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా ఈ మండలిని ట్రంప్ ఏర్పాటు చేశారు. గాజా పునర్నిర్మాణాన్ని, పాలనను ఇది పర్యవేక్షించనుంది.

ఎవరు హాజరు కాలేదంటే..

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బ్రిటన్, చైనా, రష్యా, భారత్, జర్మనీ సహా పలు దేశాలు హాజరుకాలేదు. మండలిలో చేరాలని ప్రధాని నరేంద్ర మోదీకి ట్రంప్ ఇటీవల ఆహ్వానం పంపారు. దీనిపై భారత్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. గాజా పాలస్తీనియుల అంశంలో పలు సున్నిత అంశాలు ఉండటంతో ఈ ఆహ్వానంపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది. రష్యా, చైనా కూడా దూరంగానే ఉన్నాయి. మండలిలో చేరబోమని నాటో దేశాలైన నార్వే, స్వీడన్ ఇప్పటికే ప్రకటించాయి. ఫ్రాన్స్, బ్రిటన్, ఇటలీ, కెనడా కూడా బోర్డులో చేరడానికి సుముఖంగా లేవు. మండలిలో సభ్యులుగా చేరాలంటూ దాదాపు 60 దేశాలకు ట్రంప్ ఆహ్వానం పలికారు.

రక్తపాతం చాలు.. యుద్ధం ఆగాల్సిందే

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కచ్చితంగా ముగియాల్సిందే అని ట్రంప్ స్పష్టం చేశారు. ఇప్పటికే చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, ఈ రక్తపాతం ఆగాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం దావోస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ సమావేశమయ్యారు. "జెలెన్‌స్కీని కలిశాను. మా సమావేశం చాలా బాగా జరిగింది'' అని ట్రంప్ వెల్లడించారు.



దావోస్‌లో గాజా శాంతి మండలి చార్టర్‌ను ప్రదర్శిస్తున్న డొనాల్డ్ ట్రంప్

అద్భుత నగరంగా గాజా: జేర్డ్ కుష్నర్



దావోస్: ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో శిథిలాల కుప్పగా మారిన గాజాను అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దుతామని ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ పేర్కొన్నారు. దావోస్‌లో ఆయన గాజా మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఆకాశ హర్మ్యాలు, భారీ సంఖ్యలో నివాసాలు, పర్యాటక కేంద్రాలతో గాజా కళకళలాడనుందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వైద్య, విద్య సంస్థలను నెలకొల్పుతామని అన్నారు. మూడేళ్లలో ఈ మొత్తం నిర్మాణాలు పూర్తిచేస్తామని చెప్పారు.



గాయపడిన సైనికుడిని ఉధంపుర్ మిలిటరీ ఆసుపత్రికి తరలిస్తున్న సైనిక సిబ్బంది

లోయలో పడిన సైనిక వాహనం

10 మంది సైనికుల మృతి

భదేర్వా: జమ్మూ కశ్మీర్‌లోని డోడా జిల్లా ఖానీ టాప్‌వద్ద గురువారం సైనికులతో వెళ్తున్న వాహనం బోల్తాపడింది. ఈ దుర్ఘటనలో 10 మంది సైనికులు మరణించారు. మరో 11 మంది గాయపడ్డారు. గాయపడిన సైనికులకు ఉధంపుర్ మిలిటరీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల బృందం భదేర్వా-చంబా అంతర్రాష్ట్ర రహదారిపై వెళ్తుండగా 9,000 అడుగుల ఎత్తునున్న ఖానీ టాప్‌వద్ద 200 అడుగుల లోతునున్న లోయలో పడిపోయింది. ప్రమాద సమాచారం అందుకున్న సైనిక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో వాహనంలో 21 మంది సైనికులున్నారు.

ఆస్ట్రేలియాలో కాల్పులు

ముగ్గురి మృతి ● ఒకరికి గాయాలు

మెల్‌బోర్న్: సిడ్నీ ఉగ్ర దాడి ఘటన మరువక ముందే ఆస్ట్రేలియాలో మరోసారి కాల్పులు కలకలం రేపాయి. న్యూ సౌత్‌వేల్స్‌లోని లేక్ కార్గెలిగో పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలున్నారు. ఘటనానంతరం దుండగులు అక్కడినుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.

క్రొయేషియాలో భారత ఎంబసీలోకి ఖలిస్థానీ వేర్పాటువాదుల చొరబాటు!

దిల్లీ: ఐరోపా దేశమైన క్రొయేషియాలో ఖలిస్థానీ వేర్పాటువాదులు దుశ్చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. రాజధాని జాగ్రెబ్‌లోని భారత రాయబార కార్యాలయంలోకి చొరబడి విధ్వంసం సృష్టించినట్లు సమాచారం. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఐరోపా కూటమి ప్రతినిధులు త్వరలో భారత్‌లో పర్యటించనున్న వేళ ఈ ఘటన చోటుచేసుకుంది. దీన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ తీవ్రంగా ఖండించింది. "భారత వ్యతిరేక శక్తులు మా రాయబార కార్యాలయంలోకి చొరబడి, విధ్వంసం సృష్టించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ వ్యవహారాన్ని క్రొయేషియా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరాం'' అని ప్రకటనలో పేర్కొంది.

భోజ్‌శాలలోకి

హిందువులు, ముస్లింలకు సుప్రీం అనుమతి

దిల్లీ: మధ్యప్రదేశ్‌లోని గిరిజన ప్రాబల్య ధార్ జిల్లాలోని వివాదాస్పద భోజ్‌శాల-కమల్ మౌలా మసీదు ప్రాంగణంలోకి హిందువులు, ముస్లింల ప్రవేశం విషయంలో సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది వసంత పంచమి (ఈ నెల 23న) శుక్రవారం నాడు రావడంతో ఆ ప్రాంగణంలో హిందువుల సంప్రదాయ పూజల నిర్వహణకు, ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించింది. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం సరస్వతీ పూజలు, కార్యక్రమాలను హిందువులు నిర్వహించుకోవచ్చని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలి ధర్మాసనం తెలిపింది. మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు ముస్లింలు ప్రార్థనలు చేసుకోవచ్చని తన ఆదేశాల్లో పేర్కొంది. భోజ్‌శాలలోని మధ్యయుగం నాటి స్మారక కట్టడాన్ని హిందువులు వాగ్దేవి (సరస్వతి) దేవాలయంగా భావిస్తారు. ముస్లింలు దాన్ని కమల్ మౌలా మసీదుగా వ్యవహరిస్తుంటారు.

హైకోర్టు సీనియర్ జడ్జి అధ్యక్షతన ధర్మాసనం

భోజ్‌శాల వివాదంపై ఏఎస్ఐ శాస్త్రీయ సర్వే నిర్వహించి సీల్డ్‌కవర్‌లో సమర్పించిన నివేదికను ఇరుపక్షాల వారికి అందజేసి అభ్యంతరాలను స్వీకరించాలని మధ్యప్రదేశ్ హైకోర్టుకు గురువారం సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. హైకోర్టులోని అత్యంత సీనియర్ న్యాయమూర్తి అధ్యక్షతన ధర్మాసనం ఏర్పాటు చేసి విచారణను ప్రారంభించాలని ఆదేశించింది.

జనగణనలో గృహ జాబితా తయారీకి 33 ప్రశ్నలు

● నోటిఫై చేసిన కేంద్ర హోంశాఖ

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో భాగమైన గృహ జాబితా తయారీకి కేంద్ర హోంశాఖ 33 ప్రశ్నలు ఖరారు చేసింది. ఈ మేరకు గురువారం రాత్రి నోటిఫికేషన్ జారీచేసింది. 2020 జనవరి 9న విడుదల చేసిన నోటిఫికేషన్‌తో పోలిస్తే దీనిలోని ప్రశ్నలన్నీ ఒక్కటే. అయితే, ఇంటి గచ్చు, గోడలు, పైకప్పు కోసం వినియోగించిన మెటీరియల్‌ను తెలుసుకోవడానికి ఇది వరకు ఒకే ప్రశ్న అడిగితే, ఇప్పుడు మూడుగా విడగొట్టింది. దీంతో ప్రశ్నల సంఖ్య 31 నుంచి 33కి పెరిగింది. 2011లో మొత్తం ప్రశ్నలు 29 మాత్రమే. జనగణన-2027కు ముందుగా గణకులు ఇళ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) తయారు చేసి, ఈ ప్రశ్నలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా సేకరించాలని కేంద్ర హోంశాఖ ఇందులో నిర్దేశించింది. 2027 జనాభా లెక్కల సేకరణ రెండు దశల్లో జరుగుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 మధ్య కాలంలో నిర్దేశించిన 30 రోజుల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో హౌస్ లిస్టింగ్ కార్యక్రమం పూర్తి చేస్తారు.

వసుంధర

vasundhara@eenadu.in



కాలేజీకి బయలుదేరబోతున్న విద్యకు పూజ గదిలోంచి వాళ్లమ్మ ఆలపిస్తోన్న 'సరస్వతీ నమస్తుభ్యం' అన్న ప్రార్థనాగీతం వినిపించింది. చదువుకుంటున్న తను కదా... ఈ శ్లోకాన్ని చదవాలి, అమ్మ ఎందుకు రోజూ స్మరిస్తోందన్న సందేహం వచ్చిందా అమ్మాయికి. అదే విషయాన్ని అమ్మని అడిగింది. అప్పుడు తల్లి... ఆ అమ్మవారి సుగుణాలు ప్రతి అమ్మాయికీ ఎందుకు అవసరమో... ఆమె నుంచి ఏం నేర్చుకోవచ్చో చెప్పుకొచ్చిందిలా...

సరస్వతీ దేవిలా సంతోషంగా!

'నిశ్శేష జాడ్యాపహా' అని ఆ చదువుల తల్లిని ప్రార్థిస్తుంటాం. భ్రమ, ఆలస్యం, ఏమరుపాటు, నియంత్రణలేని మాటలు, అసూయ, భయం... వంటి జాడ్యాలన్నీ ప్రగతికి ఆటంకాలు. వీటన్నింటినీ మనస్సులోంచి తొలగించుకునేందుకే ఈ ప్రార్థన. సరస్వతిని 'వాగ్దేవి, వాగీశ్వరి, వాక్కాంత' అంటుంటాం. వాక్కు మధురంగా ఉండాలి. అప్పుడే అందరితో సత్సంబంధాలు నెలకొంటాయి. 'నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది' అని పెద్దలన్నదీ ఇందుకే.

ఆ రూపమూ ఆదర్శమే!

స్వచ్ఛత, నిర్మలత్వం... ఆ విద్యాదేవి తత్వం. అందుకే సరస్వతీ దేవిని ధవళ రూపంలో ధ్యానిస్తాం. మల్లెలు, చంద్రకాంతి, మంచు, ముత్యాలహారం... వంటి వాటితో ఆ తల్లిని పోలుస్తాం. కపటత్వం, హిపోక్రసీ వ్యక్తిత్వానికి మాయని మచ్చలనీ, స్వచ్ఛ మనస్కులే మనశ్శాంతిగా ఉంటారనీ... కాబట్టి మనసుని ఎప్పుడూ నిర్మలంగా ఉంచుకోవాలనీ చెబుతుందామె రూపం.

ఆ శారదాదేవి వాహనమైన హంస... పాలనూ నీళ్లనూ వేరుచేస్తుందని చెబుతారు. ఆ విచక్షణ ప్రతి యువతిలో ఉండాలని తన వాహన రూపంలో సూచిస్తుంది సరస్వతీ దేవి. ఎవరు ఎలాంటివారో తెలుసుకొని అప్రమత్తంగా వ్యవహరించడం అమ్మాయిలకు ఎంత అవసరమో తెలియజేస్తుందా మరాళం. ఆ దేవి స్వరూపాన్ని అభివర్ణిస్తూ 'శాంతరూపే, నిత్యానందే, సదానందే...' అని పూజిస్తుంటాం. ఆ చదువుల తల్లి ఆరాధకులుగా మనం కూడా శాంత స్వరూపిణులమై, నిత్య సంతోషిణులుగా ఉండాలి. అమ్మవారికి 'నిరాధారే' అన్న నామం కూడా ఉంది. ఎవరిపైనా ఆధారపడకుండా ఆత్మస్థైర్యాన్ని అలవరచుకోవాలన్నది దీనర్థం.

విశాల భావాలకు నెలవైనప్పుడే...

ఆ అమ్మవారిని 'విశాలాక్షి' అనీ వర్ణిస్తాం. ఆమె విశాలమైన నయనాలు మనో వికాసానికీ విశాల భావాలకూ ప్రతీక. రోజువారీ వ్యవహారాల్లో మహిళలకు ఉండాల్సిన గొప్ప గుణం విశాల దృక్పథం. సంకుచితంగా ఆలోచిస్తే పురోగమించలేం. ఆ దేవిని 'మేధావిని, సర్వజ్ఞే' అనీ కీర్తిస్తాం. మగువకు మేధస్సు ఎంత అవసరమో స్త్రీ సర్వజ్ఞురాలు కావడం ఎంత ప్రధానమో ఆ చదువులమ్మ చెప్పకనే చెప్పింది. ప్రతిభ, శ్రద్ధ, ధారణ, స్ఫురణ... ఆ పలుకుల తల్లి ప్రధాన శక్తులు. యువతులు ఏ విభాగంలో రాణించాలన్నా అవి ముఖ్య లక్షణాలు అని నిరూపించింది. అలాగే ఆ దేవికి 'భాషా లక్ష్మి' అని కూడా పేరు. విద్యారంగంలో ముందుకెళ్లాలంటే భాషాజ్ఞానం అత్యవసరమే కదా.

కళాకాంతులు!

మన జీవితాల్ని కళలు ఎలా సుసంపన్నం చేస్తాయో చెబుతుంది ఆ లలితాదేవి చేతిలోని వీణ. చదువులు, ఉద్యోగాలు, ఇంటిపనులతో ఒత్తిడికి గురయ్యే మనకు లలిత కళలు ఉత్తేజాన్నీ ఉల్లాసాన్నీ అందిస్తాయి. బాల్యం నుంచే ఏదో ఒక కళను అభ్యసిస్తే భవిష్యత్తులో అది మానసిక ఆలంబన అవుతుంది. 'నదీమతల్లి' గానూ పూజిస్తాం. స్తబ్దతకు తావివ్వకుండా జీవితాన్ని చైతన్య ప్రవంతిలా మార్చుకోవాలని తరంగిణి రూపంలో సరస్వతి సందేశమిస్తోంది. అందుకే ఈ వసంత పంచమిరోజున ఆ దేవిని స్మరించి... ఆ తల్లి తత్వాన్ని మన జీవితాలకు అన్వయించుకుందాం!

– చైతన్య

(నేడు వసంత పంచమి)



రూన్సీ

చేతినిండా డబ్బు.. విదేశాల్లో విలాసవంతమైన జీవితం.. ఇవేమీ తృప్తినివ్వలేదు.. 'మనం తినేదీ పిల్లలకు పెడుతున్నదీ విషం' అన్న ఆవేదన ఆమెను నిద్రపోనివ్వలేదు. అంతే... విదేశాల నుంచి విమానం దిగారు. 'సాగు చేయడం నీ వల్ల కాదు' అని భయపెట్టినచోటే.. ఎకరాకు రూ.లక్షల ఆదాయం గడిస్తూ... ఔరా అనిపిస్తున్నారు... గొంది ఝాన్సీ లక్ష్మి. తన ప్రయాణాన్ని పంచుకున్నారిలా!

సాగు కోసం స్వదేశం వచ్చా!

పుట్టి పెరిగిందంతా తిరుపతిలోనే. నాన్నకు వ్యవసాయమంటే ఇష్టం. అమ్మ చిన్నప్పటి నుంచీ ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చేది. 2008లో పెళ్లయ్యాక అమెరికా వెళ్లాం. పదేళ్లు అక్కడే ఉన్నాం. కానీ నా మనసు ఎప్పుడూ పల్లెటూరి చుట్టూనే తిరిగేది. నా ఇద్దరు పిల్లలు క్రీడాకారులు. వాళ్లకి మంచి ఆహారం ఇవ్వలేకపోతున్నా అన్న బాధ ఉండేది. ఆ సమయంలోనే రాజీవ్ దీక్షిత్, ప్రకృతి వ్యవసాయ నిపుణులు విజయరామ్ మాటలు నా ఆలోచనలకి ఓ రూపాన్నిచ్చాయి. అల్యూమినియం పాత్రలు, రసాయన ఎరువుల వెనకున్న నిజాలు తెలుసుకున్నాక... ప్రకృతి వ్యవసాయం చేయాలనుకున్నా.

మూడెకరాల పొలంలో...

అమెరికాలో ఉన్నప్పుడే మట్టి పాత్రలు తెప్పించుకుని వంట చేయడం ప్రారంభించాను. మన ఆరోగ్యం మన వంటింట్లోనే, మన మట్టిలోనే ఉందని అర్థమైంది. 2018లో ఇండియాకు తిరిగొచ్చేశాం. వ్యవసాయం చేయాలన్న కోరిక ఉంది కానీ, భూమి దొరకడమే కష్టమైంది. ఎంతో తిరిగితే చివరికి వికారాబాద్ జిల్లా తాండూరు దగ్గర మూడెకరాలు దొరికింది. పొలం పనులకు ఎవరూ వచ్చేవారు కాదు. కొత్త ప్రదేశంలో ఒక మహిళ వ్యవసాయానికి దిగితే సమస్యలు ఎలా ఉంటాయో అర్థమైంది. మానసికంగా ఎంతో ఆవేదనకు గురయ్యా. అలాగని వెనకడుగేయలేదు. డ్రాగన్ ఫ్రూట్ వేస్తానంటే హార్టీకల్చర్ అధికారులు... 'ఇక్కడ పండదు' అన్నారు. కానీ నాకు చూద్దామనిపించింది. రెండున్నర ఎకరాల్లో 'హైడెన్సిటీ' పద్ధతిలో సాగు మొదలుపెట్టాను. ఎత్తు మడులు కట్టి, దగ్గర దగ్గరగా దాదాపు 6,344 మొక్కలు నాటాను. మొక్కల మధ్యలో మెంతి, కొత్తిమీర... వంటి అంతర పంటలూ వేశా. ఎరువుల్లేకుండా పంట ఎలా వస్తుందని చాలామంది అడిగారు. సమాధానంగా 35 గిర్ జాతి ఆవుల్ని కొన్నా... జీవామృతం, ఘన జీవామృతం తయారు చేసి ఎరువుగా వేస్తున్నా. తెగుళ్లకి పురుగు మందులు వాడకుండా వెన్న తీసిన మజ్జిగను 15-20 రోజులు పులియబెట్టి, ఇంగువ కలిపి మొక్కలకి స్ప్రే చేస్తాను. దీనివల్ల మొక్క బలంగా ఎదుగుతుంది.

శ్రమను నమ్ముకున్నా..

రసాయన ఎరువులు వేసే రైతులకు ఎకరానికి 17 టన్నుల వరకు దిగుబడి వస్తే నాకు మూడున్నర టన్నులే వచ్చింది. అయినా బాధపడలేదు. గ్రామస్థులకు సేంద్రియ పంటమీద సరైన అవగాహనలేక మొదట్లో నా దగ్గర కొనేవారు కాదు. దాంతో తాండూరు దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో 500 కిలోలు ఉచితంగా పంచాను. క్రమంగా సేంద్రియ ఉత్పత్తులపట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగింది. ప్రస్తుతం మార్కెట్ రేటుకంటే ఎక్కువకు విక్రయిస్తున్నా నాణ్యత ఉండటంవల్ల కొంటున్నారు. దీంతో పాటు రోజూ 65-70 లీటర్ల స్వచ్ఛమైన దేశీ ఆవు నెయ్యినీ విక్రయిస్తున్నాను. నెలకు రూ.7 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. మొదట్లో కూలీలు దొరక్క చాలా ఇబ్బందిపడ్డా. ఆవుపాలు పితకడం, పెరుగు చిలికి నెయ్యి తీయడం వరకు అన్నీ నేనే చేసేదాన్ని. పేడ తీసి జీవామృతం కలిపేదాన్ని.. ఆ తర్వాత మెషీన్ తెచ్చుకున్నా. ప్రస్తుతం తెలంగాణ గోశాల సేవాసమితికి జాయింట్ సెక్రటరీగా పని చేస్తున్నా. నాలాంటి ఆలోచనలున్న రైతులను కలుపుకొంటున్నా.. నాలాగా మరో పదిమంది రైతులు గో ఆధారిత వ్యవసాయం వైపు రావాలనేదే నా ఆశయం...

– వేల్పూరి వీర గంగాధర శర్మ, తిరుపతి

పాలు పడ్డాయి కానీ...

నాకు డెలివరీ అయ్యి వారం అవుతోంది. పాలు పడ్డాయి కానీ... చాలా తక్కువగా వస్తున్నాయి. దీంతో బాబుకి పౌడర్ పాలు సూచించారు డాక్టర్. పోతపాలు పట్టడం నాకేమో ఇష్టం లేదు. పాల ఉత్పత్తి పెరగాలంటే ఏం చేయాలి? మందులేమైనా వాడాలా? – ఓ సోదరి

పాలు ఉత్పత్తి అవ్వడానికి కొందరికి వారం నుంచి పదిహేను రోజులవరకూ పట్టొచ్చు. ప్రసవం అవ్వడం ఆలస్యం తల్లి శరీరంలో చాలా మార్పులు చోటు చేసుకుంటాయి. వాటితోపాటే పాలను ఉత్పత్తి చేసే హార్మోన్లూ విడుదలవుతాయి. దీన్ని సరిగ్గా నిర్వహించేలా చేసేది మాత్రం తల్లీ బిడ్డల ప్రేరణే. అంటే ఇప్పుడు బిడ్డకి పాలు సరిపోవట్లేదని పోతపాలు పడుతున్నా... ముందు పాపాయికి చనుమొనని అందించాలి. ఇది తల్లికి పాలు ఉత్పత్తి అవ్వడానికి సాయపడుతుంది. దీన్ని 'బేబీ బ్రెస్ట్ బ్రెయిన్ రిఫ్లెక్స్' అంటారు. ఇలా ప్రతిసారి చేస్తే పాలు ఉత్పత్తి అవ్వడమే కాదు... నిరంతరం కొనసాగడంలోనూ సాయపడుతుంది. ఇంకా పాలు పడట్లేదు అని ఒత్తిడి తీసుకుంటే అది ఈ ప్రక్రియ మీద ప్రభావం చూపుతుంది. కాబట్టి, పాపాయిని పట్టుకునే, తాగించే విధానాలతో పాటు ఈ మధ్యలో ఒత్తిడికి గురవ్వకుండా చూసుకోవడమూ ముఖ్యమే. అలాగే ప్రసవం తరవాత తల్లికి పాలు, బ్రెడ్ లాంటివి ఇస్తుంటారు. కానీ ప్రొటీన్‌తోపాటు పోషకాహారం, తగినన్ని నీళ్లు తీసుకోవడం కూడా తప్పనిసరి. అప్పుడే పాలు బాగా పడతాయి. ముఖ్యంగా వెల్లుల్లి, ఆకుకూరలు, మునక్కాయ వంటివాటికి ఆహారంలో ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి చూడండి. ఇవన్నీ తీసుకున్నా సమస్య ఉందంటే... వైద్యులను కలవండి. కొన్నిరకాల మందులు ఇస్తారు. చాలావరకూ పాలు పడకపోవడం, సరిపోకపోవడం అనేది అరుదు. మన ఒత్తిడే దీని మీద ప్రభావం చూపుతుంది. సరిగా విశ్రాంతి తీసుకుంటూ ఒత్తిడికి దూరంగా ఉండండి. తప్పక సానుకూల ప్రభావం ఉంటుంది.

డియర్ వసుంధర



డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

నిజంగా ర్యాషేనా?



ఈ కాలంలో వాతావరణంలో తేమ తగ్గడంవల్ల చర్మం పొడిబారినట్లుగా ఉంటుంది. ఇంకా ఎర్రబడటం, పొలుసుల్లా రాలడం, బిగుతుగానూ అవుతుంటుంది. అయితే ఇది తాత్కాలికమే. తగిన తేమను అందించినా, వాతావరణంలో మార్పు మొదలైనా ఇవన్నీ తగ్గుతాయి. కానీ జెంటిల్ ఫేస్‌వాష్, మాయిశ్చరైజర్‌ను తరచూ వాడటం వంటివి చేస్తుండాలి. ఇంత చేసినా తగ్గకపోతే... ఎగ్జిమా అయ్యుండొచ్చు. స్కిన్ బారియర్ సరిగా పనిచేయకపోతే ఇది వస్తుంది. దీనిలోనూ దురద, ఇన్‌ఫ్లమేషన్ వంటివి ఉంటాయి. మిగతా కాలాలతో పోలిస్తే చలికాలం ఎక్కువగా కనిపిస్తుంది. దీనిలోనూ చర్మం ఎర్రబడటం, దురద, పొలుసుల్లా రావడం కనిపిస్తాయి. వాటిని గీకితే మందమైన ప్యాచ్‌ల్లానూ మారతాయి. ముఖ్యంగా అలర్జీలు, ఆస్తమా వంటివి వచ్చేవారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి, దద్దుర్లు, ఎరుపుదనం వంటి వాటిని తేలిగ్గా తీసుకోకూడదు. మొదట... ఎక్కువ వేడినీటితో స్నానం చేయకపోవడం, త్వరగా ముగించడం, మాయిశ్చరైజర్ రాయడం, హ్యూమిడిఫయర్లు వాడటం... వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. వారం, రెండు వారాల్లో పరిస్థితి అదుపులోకి వస్తుంది. అయినా రాకపోతే ఎగ్జిమా అయ్యుండొచ్చు. అప్పుడు దీనికి తగిన చికిత్స తీసుకోవడం తప్పనిసరి.



బంగారం - వెండి

22న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,54,750	1,41,850	3,40,000
విజయవాడ	1,49,380	1,41,450	3,10,000
ప్రొద్దుటూరు	1,55,800	1,43,340	3,15,000
రాజమహేంద్రవరం	1,54,310	1,41,450	3,40,000
విశాఖపట్నం	1,54,310	1,41,450	3,13,000
తమిళనాడు	-----	1,42,000	3,40,000



3-3-3 బ్రషింగ్ తెలుసా..!

ఫ్యాషన్ నుంచి ఆరోగ్యం వరకూ ప్రతిదాంట్లోనూ వెల్‌నెస్ ట్రెండ్లు అనుసరిస్తుంటారు కొరియన్లు. వాటిల్లో ఒకటే ఈ బ్రషింగ్ ట్రెండ్. నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి 3-3-3 పద్ధతిని అనుసరిస్తారట. రోజుకి మూడుసార్లు... అంటే మూడు పూటలా తిన్న తరవాత మూడు నిమిషాలు బ్రష్ చేసుకుంటారు. దీనివల్లే అక్కడ చేసిన ఓ సర్వేలో నోటి అనారోగ్యాలు తగ్గినట్లు తేలింది. ముఖ్యంగా నిద్రకి ముందు పళ్లు తోముకోవడంవల్ల చిగుళ్ల ఇన్‌ఫెక్షన్, వాపు... వంటివి అదుపులోకి వచ్చాయట. మూడుసార్లు బ్రష్ చేయడంవల్ల పంటిపై ఉండే ఎనామిల్ పోతుందనే భయం అవసరం లేదంటున్నారు నిపుణులు. ఆహారం అవశేషాలు పళ్ల మధ్యలో ఇరుక్కుని బ్యాక్టీరియాను వృద్ధి చేయడంతో పంటినొప్పి, నోటి అల్సర్లు వచ్చే అవకాశం ఎక్కువ. కాబట్టి, ఈ పద్ధతివల్ల నోటి ఆరోగ్యం మెరుగవుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

సిరి

siri@eenadu.net

కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంటులో ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. దానికి ఒక రోజు ముందే ప్రభుత్వ ఆర్థిక సమీక్ష (ఎకనామిక్ సర్వే)ను విడుదల చేయడం ఆనవాయితీ. అంటే.. గతేడాది దేశం ఆర్థికంగా ఎలా ఉంది? ఎక్కడ పొరపాట్లు జరిగాయి? ఏయే రంగాలు బాగున్నాయి? అని లెక్కలు వేసుకున్నాకే.. కొత్త ఏడాది ప్రణాళికలు రచిస్తారు. దేశానికే సర్వే అవసరమా? మన ఇంటికి అవసరం లేదా? అందుకే, ఈ ఆదివారం ఓ గంట కేటాయించి.. మీ ఆర్థిక పరిస్థితిపై ఓ వ్యక్తిగత ఆర్థిక సమీక్ష చేసుకోండి.

మీ ఇంటి ఆర్థిక సర్వే సిద్ధమేనా?



ఆదాయం.. పెరిగిందా? తగ్గిందా?

దేశం తన జీడీపీ లెక్కలు వేసుకున్నట్లే.. మీరు మీ వార్షికాదాయాన్ని లెక్కించండి. గతేడాది జనవరితో పోలిస్తే ఈ జనవరిలో మీ ఆదాయం కనీసం 10 శాతం పెరిగిందా? చూడండి. ఎందుకంటే ప్రస్తుతం ద్రవ్యోల్బణం 6-7 శాతంగా ఉంది. మీ ఆదాయం అంతకంటే ఎక్కువగా పెరగకపోతే.. వాస్తవంగా మీ కొనుగోలు శక్తి తగ్గినట్లే.. కేవలం జీతం ఒక్కటే కాదు.. మీ పెట్టుబడులపై వచ్చే వడ్డీలు, డివిడెండ్లు, అద్దెలు ఇలా పాసివ్ ఆదాయమూ రావాలి. ఇవన్నీ కాలక్రమేణా పెరుగుతూ ఉంటేనే మనం ఆర్థికంగా వృద్ధి సాధించగలం.

ఖర్చులు అధికంగా ఉన్నాయా

ఆదాయాన్ని మించి ఖర్చులుంటే.. ప్రభుత్వం ద్రవ్యలోటుతో సతమతమవుతుంది. మీదీ అదే పరిస్థితా? గత ఆరు నెలల బ్యాంకు స్టేట్‌మెంట్లు, క్రెడిట్ కార్డు బిల్లులు తీయండి. మీ ఖర్చులను తప్పనిసరి (అద్దె, ఈఎంఐ, సరకులు), విలాసాలు అని రెండుగా విభజించండి. మీ ఆదాయంలో 50 శాతానికి మించి ఖర్చులకే పోతోందా? వెంటనే మీరు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. అవసరం లేని, అత్యవసరం కాని ఖర్చులను తగ్గించేయండి. ఆటో పేమెంట్లను ఒకసారి తనిఖీ చేయండి. మొత్తం నిలిపివేయండి. వాటి పునరుద్ధరణ వేళ వచ్చినప్పుడు.. తగిన నిర్ణయం తీసుకోండి. రాయితీ ఇస్తున్నారు కదా అని ఏడాదికి ఒకేసారి చెల్లింపులు చేయడం విషయంలో కాస్త ఆలోచన అవసరం.

ఆస్తులు-అప్పులు...

ఇదే మీ అసలైన ఆర్థిక ఆరోగ్య పట్టిక. మీకున్న ఆస్తులను (బ్యాంకు నిల్వలు, పీఎఫ్, షేర్లు, బంగారం, ఇల్లు) ఒకవైపు, మరోవైపు మీకున్న అప్పులు (గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు, కార్డు బాకీలు) రాయండి. మొత్తం ఆస్తుల నుంచి అప్పులను తీసేయగా మిగిలిందే మీ నికర విలువ. పోయిన ఏడాదితో పోలిస్తే మీ నికర విలువ పెరిగితే మంచిది. తగ్గితే అప్పుల వల్ల తగ్గిందా? ఆస్తుల విలువ పడిపోవడం వల్లనా అనేది విశ్లేషించుకోండి. అప్పుల వల్ల తగ్గితే మాత్రం.. మీరు కాస్త అప్రమత్తంగా ఉండాల్సిందే.

పెట్టుబడుల పనితీరు

దేశ ఆర్థిక సర్వేలో వ్యవసాయం, పారిశ్రామిక రంగాల పనితీరును విశ్లేషించినట్లే.. మీ పెట్టుబడులను సమీక్షించుకోండి. స్టాక్ మార్కెట్ బాగా పెరిగినందున.. మీ పోర్ట్‌ఫోలియోలో ఈక్విటీ వాటా 80 శాతం దాటిందా? నష్టభయాన్ని తగ్గించుకోవడానికి కొంత లాభాన్ని స్వీకరించి, ఆ డబ్బును సురక్షితమైన డెట్ ఫండ్లు లేదా బంగారంలోకి మార్చుకోండి. ఉదాహరణకు.. అయిదేళ్లలో పిల్లల చదువుకు రూ.10లక్షలు కావాలి వంటి లక్ష్యాలకు అనుగుణంగా మీ ఫండ్ పనితీరు ఉందా లేదా అని సరిచూసుకోవాల్సిన సమయం ఇదే. ఒకసారి అన్ని పెట్టుబడుల జాబితా తీసి, మళ్లీ తాజా వివరాలను అప్‌డేట్ చేసుకోండి.

రక్షణ కవచం ఉందా?

ఆర్థిక వ్యవస్థకు అనుకోని ముప్పు వస్తే తట్టుకునే శక్తి ఉందా అనేది సర్వే చూస్తుంది. మరి, మీ కుటుంబానికి ఆ శక్తి ఉందా? ఉద్యోగం పోయినా, ఆపద వచ్చినా 6 నెలలు కుటుంబం గడవడానికి సరిపడా అత్యవసర నిధి ఉండాలి. గతేడాది దీన్ని వాడేస్తే, మళ్లీ భర్తీ చేయండి. పెరిగిన వైద్య ఖర్చుల దృష్ట్యా మీ ఆరోగ్య బీమా కవరేజీ సరిపోతుందా చూసుకోండి. కుటుంబంలో కొత్తగా చేరిన వారి పేర్లను పాలసీలో చేర్పించండి. ఆదాయానికి తగినంత బీమా పాలసీలూ ఉండాలి.

మీ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో చూసుకోకపోతే.. రేపు మీరు వేసుకునే బడ్జెట్ కేవలం కాగితాలకే పరిమితం అవుతుంది. ఈ వ్యక్తిగత ఆర్థిక సమీక్ష ద్వారా మీ బలాలేంటో, బలహీనతలేంటో తెలుసుకోండి. మీ ఇంటికి మీరే ఆర్థిక మంత్రిగా మారండి. ఆర్థిక ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయండి.

కొంతకాలంగా వెండి ధరలు భారతీయ మార్కెట్లలో 160 శాతానికి మించి పెరిగాయి. దీంతో మదుపరులందరూ ఒక్కసారిగా వెండిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కేవలం ఈ ర్యాలీని చూసి, భావోద్వేగంతో నిర్ణయాలు తీసుకోవద్దని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. వెండి, వెండి ఈటీఎఫ్‌లలో మదుపు చేసేముందు కొన్ని విషయాలపై అవగాహన తప్పనిసరి అని అంటున్నారు.

వెండి ఈటీఎఫ్‌లో మదుపు చేస్తుంటే



వెండి ధరలు ఎప్పుడూ ఒకే తరహాలో ఉండవు. చాలాకాలం పాటు స్తబ్ధతగా ఉండి, ఒక్కసారిగా దూసుకెళ్లడం దీని నైజం. 2010 నుంచి లెక్కలు వేస్తే.. వెండి వార్షిక వృద్ధి రేటు 10 శాతంగా కనిపిస్తోంది. 2025 నుంచి ఇప్పటి వరకూ ఉన్న పెరుగుదలను మినహాయిస్తే.. 2024 వరకూ దీని వృద్ధి రేటు కేవలం 4శాతం లోపే. అంటే, దీర్ఘకాలంలో ఇది పెద్దగా రాబడిని ఇవ్వకపోవచ్చు అనే విషయాన్ని మదుపరులు గుర్తించాలి.

ప్రస్తుతం వెండిలో కనిపిస్తున్న ధరల పరుగుకు కొన్ని కారణాలున్నాయి..

- ✦ **పారిశ్రామిక గిరాకీ:** హరిత ఇంధన సాంకేతికతలు, విద్యుత్ వాహనాలు, సౌర విద్యుత్ ప్యానెళ్ల తయారీలో వెండి వినియోగం విపరీతంగా పెరిగింది.
- ✦ **ఉత్పత్తి పెరగకపోవడం:** వెండికి గిరాకీ పెరిగినంత వేగంగా గనుల నుంచి ఉత్పత్తిని పెంచకపోవడం వల్ల సరఫరా తగ్గి, ధరలకు రెక్కలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో వెండిలో మదుపు చేయాలనుకునే దీర్ఘకాలిక మదుపరులకు అందుబాటులో ఉన్న మార్గం **సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు (సిల్వర్ ఈటీఎఫ్).**

ఇవి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడ్ అవుతాయి. ప్రతి యూనిట్ భౌతిక వెండికి ప్రాతినిధ్యం వహిస్తుంది. డీమ్యాట్ ఖాతా ద్వారా షేర్లలాగానే సులభంగా కొనొచ్చు, అమ్మొచ్చు.

ఎలా ఎంచుకోవాలంటే

మార్కెట్లో ఎన్నో సిల్వర్ ఈటీఎఫ్‌లు అందుబాటులో ఉన్నాయి. అన్నీ ఒకే విధంగా ఉండకపోవచ్చు...

- ✦ మీరు అమ్మాలనుకున్నప్పుడు కొనేవారు సిద్ధంగా ఉండాలి. ఫండ్‌ను ఎంచుకునేటప్పుడు దాని 'ట్రేడెడ్ వాల్యూ' నిశితంగా పరిశీలించాలి. నిపుణుల సూచన ప్రకారం మీ పెట్టుబడికి కనీసం 50 రెట్లు ఎక్కువ ట్రేడింగ్ వాల్యూ ఉన్న ఫండ్‌ను ఎంచుకోవడం సురక్షితం.
- ✦ ఫండ్ నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండాలి. వెండి అసలు ధరకూ, ఈటీఎఫ్ ధరకూ మధ్య వ్యత్యాసం (ట్రాకింగ్ ఎర్రర్) తక్కువగా ఉన్న ఫండ్‌నే ఎంచుకోవాలి. ఈ రెండింటినీ సమతుల్యం చేసుకోవడం ముఖ్యం.

చిన్న మొత్తంతోనూ..

వెండి ఈటీఎఫ్‌లలో మదుపు చేయడానికి ఒక్క యూనిట్‌నూ కొనుగోలు చేయొచ్చు. కొన్ని ఫండ్ల యూనిట్లు ఇప్పుడు రూ.290-రూ.310 మధ్యనే ఉన్నాయి. ఇటీవలే ప్రారంభం అయిన కొన్ని ఫండ్ సంస్థల సిల్వర్ ఈటీఎఫ్‌ల యూనిట్ రూ.30 దరిదాపుల్లోనే ఉంది.

నష్టభయమూ ఉంటుంది: మన దేశంలో సిల్వర్ ఈటీఎఫ్‌లు అందుబాటులోకి వచ్చి నాలుగేళ్లే అవుతోంది. ట్రేడింగ్ తక్కువగా ఉంటే.. కొనుగోలు, అమ్మకం ధరల మధ్య అంతరం పెరిగి మదుపరులు నష్టపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఫండ్ నిర్వహణ ఖర్చులు, నగదు నిల్వల కారణంగా వెండి ధర పెరిగినంత స్థాయిలో ఈటీఎఫ్‌లపై రాబడి అందకపోవచ్చు. మరోవైపు ధరలో నిలకడ ఎంత వరకూ ఉంటుందనేదీ వీటిపై వచ్చే లాభాలను ప్రభావితం చేస్తాయి. కనీసం 8-10 ఏళ్ల దీర్ఘకాలిక లక్ష్యంతోనే వీటిని ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

10 శాతమే: వెండిని ప్రధాన పెట్టుబడి వనరుగా చూడొద్దు. పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యం కోసం మాత్రమే ఎంచుకోవాలి. మీ మొత్తం పెట్టుబడిలో బంగారం, వెండి కలిపి 10 శాతానికి మించకూడదు. బంగారంతో పోలిస్తే వెండి హెచ్చుతగ్గులు ఎక్కువ. కాబట్టి, ఆ 10 శాతంలోనూ వెండి వాటా తక్కువగా ఉంటేనే మంచిది. నష్టభయం భరించగలిగిన వారే దీనివైపు చూడాలి.

రాబడి హామీతో రక్షణ

మార్కెట్ హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా కచ్చితమైన రాబడి, జీవిత బీమా రక్షణ ఉండాలని కోరుకునే వారికోసం **ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్.. స్మార్ట్ ప్లాటినా అడ్వాంటేజ్** పాలసీని తీసుకొచ్చింది. ఎంచుకున్న 15, 20, 30 ఏళ్ల కాలపరిమితికి ఇప్పుడే రాబడి హామీ లభిస్తుంది. పాలసీకి 7 లేదా 10 ఏళ్లపాటు ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. వార్షిక ప్రీమియం, పాలసీ కాలాన్ని బట్టి.. ఏడాది చివరన క్యుములేటివ్ ప్రీమియంపై 6 నుంచి 11 శాతం వరకూ గ్యారంటీడ్ అడిషన్స్ ఖాతాలో జమ అవుతాయి. 30 రోజుల చిన్నారి నుంచి 60 ఏళ్ల వ్యక్తుల వరకూ ఈ పాలసీని తీసుకోవచ్చు. పాలసీ వ్యవధి తీరేనాటికి 75 ఏళ్లకు మించకుండా వ్యవధిని ఎంచుకోవాలి. కనీస ప్రీమియం రూ.50,000. దురదృష్టవశాత్తూ పాలసీదారుడికి ఏదైనా జరిగితే.. పాలసీ విలువ.. చెల్లించిన ప్రీమియానికి 105 శాతం (ఏది ఎక్కువైతే అది)తో పాటు, అప్పటి వరకూ జమైన గ్యారంటీడ్ అడిషన్స్ కలిపి చెల్లిస్తారు. పిల్లల చదువులు, పెళ్లి, పదవీ విరమణ కోసం నష్టభయం లేని పాలసీని కావాలనుకునే వారికి ఇది సరిపోతుందని సంస్థ అంటోంది. పాత పన్ను విధానం ఎంచుకున్న వారికి.. చెల్లించిన ప్రీమియానికి పన్ను మినహాయింపు లభిస్తుంది. పాలసీ పూర్తయిన తర్వాత జమైన మొత్తాన్ని ఒకేసారి తీసుకోవచ్చు. ఏడేళ్ల పాటు వాయిదాల పద్ధతిలో తీసుకునే వెసులుబాటూ ఉంటుంది.

స్కాన్ చేస్తూ అప్పుల ఊబిలోకి

బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. కేవలం ఖాతాలో డబ్బు ఉన్నప్పుడే చెల్లింపులు చేసే రోజులు పోయాయి. ఇప్పుడు బ్యాంకులు నేరుగా యూపీఐ యాప్‌లలోనే ముందస్తుగా మంజూరు చేసిన రుణాన్ని అందిస్తున్నాయి. దీనివల్ల కిరాణా కొట్టులో రూ.10 దగ్గర్నుంచి.. చిన్న చిన్న ఖర్చులనూ ఈ 'యూపీఐ క్రెడిట్'ను ఉపయోగించి చెల్లించేస్తున్నారు చాలామంది. ఇది చూడ్డానికి ఎంతో సౌకర్యంగానే అనిపించినా.. సామాన్యులను రోజువారీ అప్పుల ఊబిలోకి నెట్టేసే ప్రమాదముంది.

సాధారణంగా యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్)తో చెల్లించినప్పుడు బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉండాలి. ఈ చెల్లింపుల యాప్‌లలో క్రెడిట్ కార్డునూ జత చేసుకునే వీలు చాలా రోజుల క్రితమే వచ్చింది. దీంతోపాటు బ్యాంకులూ తమ ఖాతాదారులకు కార్డుల అవసరం లేకుండానే కొంత మొత్తం క్రెడిట్‌గా ఇస్తున్నాయి. నిర్ణీత తేదీ నాడు.. బ్యాంకు పొదుపు ఖాతాలో నుంచి ఆ మొత్తం డెబిట్ అవుతుంది. వెంటనే బ్యాంకు ఖాతా నుంచి డబ్బు వెళ్లదు కాబట్టి, చాలామంది దీనిపై ఆసక్తి చూపిస్తున్నారు. సులభంగా అప్పు దొరకడంతో, తమకు తెలియకుండానే ప్రజలకు రోజువారీ అప్పు అలవాటుగా మారుతుంది.

సంప్రదాయ క్రెడిట్ కార్డులు కేవలం స్వైపింగ్ యంత్రాలున్న చోట మాత్రమే పనిచేస్తాయి. కానీ, యూపీఐతో ఈ చిక్కు లేదు. చిన్న దుకాణాల మొదలు.. టీ కొట్టుల్లోనూ పనిచేస్తుంది. ఇలా రూ.10, రూ.20 వంటి చిన్న మొత్తాలకూ అప్పు చేసే అవకాశం పెరుగుతోంది. ఇలాంటి చిన్న మొత్తాలే నెల తిరిగేసరికి కొండంత భారంగా మారి, వినియోగదారుడిని ఇబ్బందుల్లోకి నెట్టే ఆస్కారం ఉంది. కాబట్టి, కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి..

- డబ్బు చెల్లించేందుకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్నప్పుడు.. డబ్బు పొదుపు ఖాతా నుంచి వెళ్తోందా? క్రెడిట్ నుంచా అనేది చూసుకోండి.
- మీకు నిజంగా అవసరం ఉన్నప్పుడు మాత్రమే క్రెడిట్ లైన్/క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించండి.
- కేవలం ఖర్చుల కోసం అప్పు చేస్తే, తిరిగి చెల్లించడంలో ఇబ్బందులు తప్పవు.
- క్రెడిట్ కార్డును వాడినప్పుడు నగదు వాపసు, డిస్కౌంట్లవంటి సదుపాయాలుంటాయి. యూపీఐకి అనుసంధానించిన క్రెడిట్ కార్డుతో చెల్లింపులు చేసినప్పుడు ఇలాంటివి లభించకపోవచ్చు. కాబట్టి, ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా ఆలోచించాకే యూపీఐ క్రెడిట్‌తో చెల్లింపులు చేయండి.

చాంపియన్స్

ఇదీ పట్టేయాలని..

నేడే న్యూజిలాండ్‌తో భారత్ రెండో టీ20

రాత్రి 7 గంటల నుంచి


సూర్యకుమార్

న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో గెలిచిన టీమ్‌ఇండియా.. ఆ తర్వాత రెండు వన్డేల్లో ఓడి సిరీస్ కోల్పోయింది. ఇప్పుడు టీ20 సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. సూర్య సేన తొలి మ్యాచ్‌లో సమష్టిగా చెలరేగి కివీస్‌ను చిత్తు చేసింది. మరి అదే జోరు కొనసాగిస్తుందా..? శుక్రవారం రెండో టీ20కి రాయ్‌పుర్ ఆతిథ్యమివ్వనుంది.

రాయ్‌పుర్

తొలి టీ20లో మన విజయం సాధించినా.. భారత జట్టు ఆటలో కొన్ని లోపాలు కనిపించాయి. త్వరలో టీ20 ప్రపంచకప్ ఆరంభం కానున్న నేపథ్యంలో ఈ లోపాలను టీమ్‌ఇండియా సరిదిద్దుకోవాల్సిందే. టాపార్డర్లో సంజు శాంసన్, ఇషాన్ కిషన్ చాలా తేలిగ్గా వికెట్లు అప్పగించేశారు. పేలవ షాట్ సెలక్షన్‌తో సంజు, కిషన్ ఔటయ్యారు. అవకాశాలు ఇస్తున్నా సద్వినియోగం చేసుకోలేకపోతున్న శాంసన్.. మరోసారి ఓ అవకాశాన్ని వృథా చేసుకున్నాడు. మరోవైపు రెండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్ ఆడిన కిషన్ సైతం పట్టుదల చూపించలేకపోయాడు. రెండో టీ20లో శాంసన్, కిషన్ గాడిలో పడడం భారత్‌కు ఎంతో అవసరం. కెప్టెన్ సూర్యకుమార్ (22 బంతుల్లో 32) కాస్త మెరుగ్గా ఆడినా.. పెద్ద స్కోరు చేయలేకపోయాడు. రెండో మ్యాచ్‌లో అతడు చెలరేగాలని జట్టు కోరుకుంటోంది. ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసక బ్యాటింగ్, రింకు సింగ్ మెరుపులు భారత్‌కు సానుకూలాంశాలు.

కుల్‌దీప్ వస్తాడా?: తొలి టీ20లో రిజర్వ్ బెంచ్‌కే పరిమితమైన చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ రెండో టీ20లో తుది జట్టులో ఆడే అవకాశముంది. తొలి టీ20లో వేలికి గాయం కావడంతో బౌలింగ్‌ను పూర్తిచేయలేకపోయిన అక్షర్ పటేల్ ఈ మ్యాచ్ ఆడటం అనుమానమే. వరుణ్ చక్రవర్తి లేదా కుల్‌దీప్ బంతిని పంచుకోవచ్చు. పవర్ ప్లేలో అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్య వికెట్లు తీస్తుండడంతో మిడిల్ ఓవర్లలో బుమ్రాను ప్రయోగించే అవకాశం దక్కుతుంది. రెండో టీ20లోనూ భారత్ ఇదే ప్రణాళికతో బరిలో దిగే అవకాశం ఉంది. తొలి టీ20లో ఓడినా.. బాగానే పోరాడిన న్యూజిలాండ్‌ను తక్కువ అంచనా వేస్తే సూర్య సేనకు చేదు అనుభవం తప్పదు. కసితో బరిలో దిగుతున్న కివీస్‌ను ఆపాలంటే టీమ్‌ఇండియా మరింత మెరుగ్గా ఆడాల్సి ఉంది. సూపర్ ఫామ్‌లో ఉన్న మిచెల్, ఫిలిప్స్ నుంచే భారత్‌కు ప్రమాదం పొంచి ఉంది. మిడిల్ ఓవర్లలో కివీస్‌కు కళ్లెం వేయడం కీలకం.

పరుగుల పిచ్

రాయ్‌పుర్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. రాత్రి వేళ మంచు ప్రభావం చూపొచ్చు. ఇక్కడ పెద్ద లక్ష్యాలను కూడా కాపాడుకోవడం కష్టమే. గత నెలలో ఇక్కడ జరిగిన వన్డే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 359 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్‌కు మొగ్గు చూపే అవకాశం ఉంది.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, శాంసన్, ఇషాన్ కిషన్/శ్రేయస్ అయ్యర్, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, కుల్‌దీప్ యాదవ్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి, రింకు సింగ్, అర్ష్‌దీప్.

న్యూజిలాండ్: శాంట్నర్ (కెప్టెన్), కాన్వే, మిచెల్, ఫిలిప్స్, రాబిన్సన్, సోధి, చాప్‌మన్, రచిన్, జేమీసన్, డఫీ, హెన్రీ

భారత్‌లో ఆడం

తేల్చిచెప్పిన బంగ్లాదేశ్

ఢాకా: బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఐసీసీ హెచ్చరికను ఖాతరు చేయలేదు. భారత్‌లో ఆడకూడదన్న తమ నిర్ణయాన్ని మార్చుకోకపోతే టీ20 ప్రపంచకప్‌లో మరో జట్టుకు అవకాశం ఇస్తామని ఐసీసీ స్పష్టం చేసినా వెనక్కి తగ్గలేదు. భద్రత కారణాల దృష్ట్యా తమ జట్టును భారత్‌కు పంపే ప్రసక్తే లేదని బీసీబీ తేల్చిచెప్పింది. భారత్‌లో తమ మ్యాచ్‌లన్నీ శ్రీలంకకు మార్చాలన్న అభ్యర్థనను ఐసీసీ తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్ ప్రభుత్వం, క్రికెటర్లతో చర్చించిన అనంతరం ఐసీసీకి తమ నిర్ణయాన్ని తెలియజేసింది. పొట్టి కప్పునకు బంగ్లా దాదాపుగా దూరమవడంతో.. ర్యాంకింగ్ ఆధారంగా ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం లభిస్తుంది. మరి ఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. "ప్రపంచకప్‌కు అర్హత సాధించడానికి మా ఆటగాళ్లు ఎంతో కష్టపడ్డారు. అయితే భారత్‌లో మాకు భద్రత ముప్పు పొంచి ఉంది. ఇది కేవలం ఊహాజనిత ఆందోళన కాదు. మొత్తం జట్టు, విలేకరులు, అభిమానుల భద్రతపై మాకు నమ్మకం కలగడం లేదు. ఐసీసీ ముప్పు అంచనా నివేదిక ఆమోదయోగ్యంగా లేదు. అయినా మేమింకా ఆశలు వదులుకోలేదు. ప్రపంచకప్‌లో ఆడేందుకు మా జట్టు సిద్ధంగా ఉంది. భద్రత సమస్యను వాస్తవికంగా పరిగణనలోకి తీసుకుని శ్రీలంకలో ఆడేలా ఐసీసీ న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయానికి గల కారణాలు, అందుకు దారితీసిన పరిస్థితులు ఆటగాళ్లకు వివరించాం. వాళ్లు అర్థం చేసుకున్నట్లు అనిపించింది. క్రికెట్‌ను అభిమానించే సుమారు 20 కోట్ల జనాభా కలిగిన దేశం బంగ్లా. ఒక వేళ ఐసీసీ మాకు అవకాశం ఇవ్వకుంటే అది ప్రపంచ క్రికెట్‌కు తీరని నష్టం. ఆతిథ్య దేశం వైఫల్యం అవుతుంది" అని బంగ్లాదేశ్ క్రీడల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ తెలిపాడు. షెడ్యూల్ ప్రకారం భారత్‌లో బంగ్లా నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అందులో కోల్‌కతాలో మూడు, ముంబయిలో ఒక మ్యాచ్ ఉన్నాయి. ఫిబ్రవరి 7న పొట్టి ప్రపంచకప్ ఆరంభంలోనే బంగ్లాదేశ్.. వెస్టిండీస్‌తో మ్యాచ్ ఆడాల్సి వుంది. మరో 15 రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో టోర్నీలో బంగ్లా భవితవ్యంపై ఐసీసీ శుక్రవారం నిర్ణయం తీసుకునే అవకాశముంది.

సింధు @ 500


సింధు

జకార్తా: భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు అరుదైన ఘనత సాధించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో 500 మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన ఆరో క్రీడాకారిణిగా ఘనత అందుకుంది. ఈ రికార్డు నమోదు చేసిన తొలి భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించింది. ఇండోనేసియా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో సింధు ఈ చిరస్మరణీయ విజయంతో క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. గురువారం ప్రిక్వార్టర్స్‌లో భారత స్టార్ 21-19, 21-18తో లైన్ హోయ్‌మార్క్ (డెన్మార్క్)పై గెలుపొందింది. మహిళల సింగిల్స్‌లో సింధు కంటే ముందు ఇంతానన్ రచనోక్ (థాయ్‌లాండ్), తై జు యింగ్ (చైనీస్ తైపీ), అకానె యమగుచి (జపాన్), కరోలినా మారిన్ (స్పెయిన్), పెత్యా నెదెల్చెవా (బల్గేరియా) మాత్రమే 500 విజయాలు నమోదు చేశారు. డబుల్స్ మ్యాచ్‌లను జోడిస్తే సింధు ఖాతాలో మొత్తం 516 విజయాలున్నాయి. ఇక పురుషుల సింగిల్స్‌లో మరో స్టార్ క్రీడాకారుడు లక్ష్యసేన్ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. ప్రిక్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 21-10, 21-11తో జేసన్ (హాంకాంగ్)పై నెగ్గాడు. కిదాంబి శ్రీకాంత్ 11-21, 10-21తో చౌ తీన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడాడు. మహిళల సింగిల్స్‌లో అన్మోల్ 21-16, 6-15 (రిటైర్డ్)తో నొజొమి ఒకుహర (జపాన్) చేతిలో పరాజయం చవిచూసింది.

గుజరాత్ గెలుపు బాట

యూపీపై విజయం


సోఫి డివైన్

వడోదర: డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ మళ్లీ గెలుపుబాట పట్టింది. బంతితో అదరగొట్టిన ఆ జట్టు 45 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌ను ఓడించింది. గురువారం మొదట గుజరాత్ 8 వికెట్లకు 153 పరుగులు చేసింది. సోఫి డివైన్ (50 నాటౌట్; 42 బంతుల్లో 2×4, 3×6) టాప్‌స్కోరర్. బెత్ మూనీ (38; 34 బంతుల్లో 5×4) కూడా రాణించింది. క్రాంతి గౌడ్ (2/18), ఎకిల్‌స్టోన్ (2/22) ఆకట్టుకున్నారు. ఛేదనలో రాజేశ్వరి గైక్వాడ్ (3/16), సోఫి డివైన్ (2/16) రేణుక సింగ్ (2/20) ధాటికి యూపీ 17.3 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌటైంది. లిచ్‌ఫీల్డ్ (32; 27 బంతుల్లో 5×4), ట్రయాన్ (30 నాటౌట్; 22 బంతుల్లో 3×4, 1×6) మాత్రమే రాణించారు. 11 ఓవర్లకు 68/5తో ఓటమి దిశగా సాగిన యూపీ తర్వాత కోలుకోలేకపోయింది. హ్యాట్రిక్ పరాజయాల తర్వాత గుజరాత్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం.

గుజరాత్ కట్టడి: అంతకుముందు ఆరంభంలో దూకుడుగా ఆడిన గుజరాత్ తర్వాత వికెట్లు కోల్పోయి ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది. మొదట ఓపెనర్లు బెత్ మూనీ, డానీ వ్యాట్ (14) జట్టుకు మెరుపు ఆరంభం అందించారు. వ్యాట్‌తో పాటు అనుష్క శర్మ (14)ను ఔట్ చేసిన క్రాంతి గౌడ్.. గుజరాత్‌ను దెబ్బ కొట్టింది. ఆష్లీ గార్డ్‌నర్ (5) సైతం నిలవలేకపోయింది. ఈ స్థితిలో సోఫి డివైన్, బెత్ మూనీ జంట ఇన్నింగ్స్‌ను నడిపించింది. 12 ఓవర్లకు గుజరాత్ 86/3తో కాస్త మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే మూనీని ఎకిల్‌స్టోన్ ఔట్ చేయడం.. తర్వాత యూపీ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో గుజరాత్ రన్‌రేట్ పడిపోయింది. ఆఖరిదాకా నిలిచిన డివైన్.. స్కోరును 150 దాటించింది.

గుజరాత్ జెయింట్స్: 153/8 (సోఫి డివైన్ 50 నాటౌట్, బెత్ మూనీ 38; క్రాంతి గౌడ్ 2/18, ఎకిల్‌స్టోన్ 2/22)

యూపీ వారియర్స్: 17.3 ఓవర్లలో 108 ఆలౌట్ (లిచ్‌ఫీల్డ్ 32, ట్రయాన్ 30 నాటౌట్; రాజేశ్వరి గైక్వాడ్ 3/16, సోఫి డివైన్ 2/16, రేణుక సింగ్ 2/20)

జకోవిచ్ జోరు

- మూడో రౌండ్లోకి ప్రవేశం
- సినర్, స్వైటెక్ ముందంజ


జకోవిచ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్లో వెటరన్ స్టార్ నొవాక్ జకోవిచ్ జోరు కొనసాగుతోంది. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురిపెట్టిన ఈ సెర్బియా దిగ్గజ ఆటగాడు మూడో రౌండ్‌కు దూసుకెళ్లాడు. గురువారం పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో నాలుగో సీడ్ జకోవిచ్ 6-3, 6-3, 6-2తో ఫ్రాన్సిస్కో మాస్ట్రెల్లి (ఇటలీ)ని ఓడించాడు. జకోవిచ్ కెరీర్‌లో ఇది 399వ గ్రాండ్‌స్లామ్ విజయం. రెండో సీడ్ సినర్ (ఇటలీ) ముందంజ వేశాడు. అతడు 6-1, 6-4, 6-2తో డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)ను చిత్తు చేశాడు. మ్యాచ్‌లో సినర్ 18 ఏస్‌లు, 31 విన్నర్లు కొట్టాడు. మాజీ ఛాంపియన్ స్టానిస్లాస్ వావ్రింకా (స్విట్జర్లాండ్) అతి కష్టంగా రెండో రౌండ్ దాటాడు. అతడు 4-6, 6-3, 3-6, 7-5, 7-6 (10-3)తో ఆర్థర్ గియా (ఫ్రాన్స్)పై గెలిచాడు. నాలుగున్నర గంటలకుపైగా సాగిన ఈ పోరులో వావ్రింకా 11 ఏస్‌లు, 63 విన్నర్లు కొట్టాడు. 1978లో కెన్ రోజ్‌వెల్ (43 ఏళ్లు) తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మూడో రౌండ్ చేరిన పెద్ద వయస్కుడిగా వావ్రింకా (40 ఏళ్లు) ఘనత సాధించాడు. అయిదో సీడ్ ముసెటి (ఇటలీ), 12వ సీడ్ రూడ్ (నార్వే), 8వ సీడ్ షెల్టన్ (అమెరికా) ముందంజ వేశారు.

స్వైటెక్ ముందుకు: పోలెండ్ స్టార్ ఇగా స్వైటెక్ మూడో రౌండ్ చేరింది. రెండో రౌండ్లో స్వైటెక్ 6-2, 6-3తో బజ్కోవా (చెక్)ను ఓడించింది. 16వ సీడ్ ఒసాకా (జపాన్) 6-3, 4-6, 6-2తో క్రిస్టియా (రొమేనియా)ను ఓడించింది. డిఫెండింగ్ ఛాంపియన్ మాడిసన్ కీస్ (అమెరికా) 6-1, 7-5తో క్రూగర్ (అమెరికా)ను ఓడించగా.. పెగులా (అమెరికా) 6-0, 6-2తో కెస్లర్ (అమెరికా)పై, రిబకినా (కజకిస్థాన్) 7-5, 6-2తో గ్రెచెవా (ఫ్రాన్స్)పై, అనిసిమోవా (అమెరికా) 6-1, 6-4తో సినియాకోవా (చెక్)పై గెలిచారు.

విజృంభించిన రాజు

విదర్భ 267/7

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: విదర్భతో రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఆంధ్ర మెరుగైన ప్రదర్శన చేసింది. కలిదిండి రాజు (4/51) విజృంభించడంతో గురువారం తొలి రోజు ఆటలో విదర్భను 267/7కు కట్టడి చేసింది. ఫాస్ట్ బౌలర్ రాజు ధాటికి ఆరంభంలో విదర్భ తడబడింది. ఆ జట్టు 45కే 4 వికెట్లు కోల్పోయింది. అమన్ (21), డానిష్ (0), అథర్వ (13), రవికుమార్ (9)లను రాజు పెవిలియన్ చేర్చాడు. అయితే యశ్ రాఠోడ్ (104 నాటౌట్) అజేయ శతకంతో ఆ జట్టును ఆదుకున్నాడు. రోహిత్ బింకర్ (37), దర్శన్ నల్కండే (36) అతడికి అండగా నిలిచారు. నితీశ్ కుమార్ రెడ్డి, సాయితేజ, సౌరవ్ కుమార్ తలో వికెట్ తీశారు.

ఈనాడు సినిమా

ఆస్కార్ నామినేషన్లలో 'సిన్నర్స్' రికార్డు





ప్రపంచ సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 98వ ఆస్కార్ నామినేషన్ల జాబితాని అకాడమీ బృందం గురువారం అధికారికంగా ప్రకటించింది. ఇందులో ర్యాన్ కూగ్లర్ దర్శకత్వం వహించిన 'సిన్నర్స్' ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు, ఉత్తమ ఎడిటింగ్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైనింగ్‌తో సహా పలు విభాగాల్లో అత్యధికంగా 16 నామినేషన్లు సొంతం చేసుకొని సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఇప్పటి వరకూ 14 నామినేషన్స్‌తో 'ఆల్ అబౌట్ ఈవ్', 'టైటానిక్', 'లాలా ల్యాండ్' పేరిట ఈ రికార్డు ఉండేది. ఇప్పుడా రికార్డును అధిగమించి చరిత్ర సృష్టించిందీ చిత్రం. హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాలో మైఖేల్ బి. జోర్డాన్ ప్రధాన పాత్ర పోషించారు. స్మోక్, స్టాక్ అనే ఇద్దరు కవల సోదరుల చుట్టూ తిరిగే ఈ కథ.. మలుపులు, సస్పెన్స్‌తో సినీప్రియుల్ని సీటు అంచున కూర్చోబెట్టింది. దీని తర్వాత అమెరికన్ బ్లాక్ కామెడీ చిత్రం 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' ఎక్కువ నామినేషన్లను దక్కించుకుంది. దీనితో పాటు 'బుగోనియా', 'ఎఫ్ 1', 'ఫ్రాంకెన్ స్టైయిన్', 'హామ్నెట్', 'ది సీక్రెట్ ఏజెంట్' తదితర చిత్రాలు పలు విభాగాల్లో నామినేషన్లను అందుకొని బరిలోకి దిగాయి. వీరితో పాటు భారతీయ-అమెరికన్ దర్శకనిర్మాత గీతా గాండ్బీర్ రెండు ఆస్కార్ నామినేషన్లను గెలుచున్నారు. ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ విభాగంలో...ఆమె దర్శకనిర్మాణంలో రూపొందిన 'ది పర్ఫెక్ట్ నైబర్' అనే లఘు చిత్రం, ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ కేటగిరిలో 'ది డెవిల్ ఈజ్ బిజీ' నిలిచాయి. మార్చి 15న ఆస్కార్ వేడుక జరగనుంది.

మన 'హోమ్‌బౌండ్'కు నిరాశే

ఈ ఏడాది మన దేశం తరపున ఆస్కార్ పురస్కారాల్లో పోటీకి సిద్ధమైన 'హోమ్‌బౌండ్'కు నిరాశ ఎదురైంది. 'ది బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్' విభాగంలో షార్ట్ లిస్ట్ జాబితాలో చోటు దక్కించుకున్న ఈ సినిమా తాజాగా వెల్లడించిన ఆస్కార్ జాబితాలో నామినేషన్‌ను సొంతం చేసుకోలేకపోయింది. జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్ జంటగా నటించిన చిత్రమిది. నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించారు. కరణ్ జోహార్ నిర్మాత.


అనిల్ రావిపూడి

"ప్రేక్షకుల చిరునవ్వే నా విజయ రహస్యం. వాళ్లు థియేటర్లకు వచ్చి నవ్వుతున్నంత కాలం అదే నాకు శక్తిని, విజయాన్నిస్తుంటుంది" అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. గతేడాది ముగ్గుల పండక్కి 'సంక్రాంతికి వస్తున్నాం'తో ఘన విజయాన్ని సొంతం చేసుకున్న ఆయన.. ఈ పండక్కి 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాతో హిట్ కొట్టారు. చిరంజీవి - వెంకటేశ్ కలిసి నటించిన ఈ చిత్రం ప్రస్తుతం బాక్సాఫీస్ బరిలో మంచి వసూళ్లు రాబడుతోంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు అనిల్ రావిపూడి.

ఈసారి టైటిల్ ప్రకటన నుంచే ఓ విచిత్రమైన ప్రయాణం

"మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర విజయం పట్ల చాలా ఆనందంగా ఉన్నాం. థియేటర్లన్నీ ఫ్యామిలీస్‌తో జాతరలా కనిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్ల తర్వాత చిరంజీవిని మళ్లీ ఇలా చూసుకోగలిగామని చాలా మంది ఫ్యాన్స్ నా దగ్గర భావోద్వేగానికి గురయ్యారు. ప్రస్తుతం వసూళ్లు చాలా నిలకడగా ఉన్నాయి. రూ.400కోట్ల వసూళ్లు సాధిస్తుందని అంచనా వేస్తున్నాం'

"నా తర్వాతి కొత్త సినిమాకి సంబంధించి నటీనటులు ఎవరనేది ఇంకా నిర్ణయించలేదు. స్టోరీ లైన్ మాత్రమే ఫిక్సయ్యా. జూన్, జులై నాటికి సినిమా సెట్స్‌పైకి వెళ్తుంది. నేను పవన్ కల్యాణ్‌ని ఇటీవల కాలంలో కలవలేదు. ఆయనతో సినిమా చేయాలని నాకూ ఉత్సాహంగా ఉంది. ప్రస్తుతం ఆయన ఏపీ డిప్యూటీ సీఎంగా చాలా బిజీగా ఉన్నారు. ఒకవేళ మా కాంబినేషన్ కుదిరితే సంతోషమే. ఏం జరుగుతుందో చూద్దాం. ఇప్పటివరకైతే మా కాంబోపై ఎలాంటి ఆలోచనా లేదు".

"ఇది నాకు కాస్త క్లిష్టమైన సమయం. రెండు భారీ హిట్‌ల తర్వాత చేయబోయే సినిమా అంటే కచ్చితంగా తికమక ఉంటుంది. సరైన నిర్ణయాలు తీసుకోకపోతే దారి తప్పుతాం. అందుకే వారం పది రోజులు విరామమిచ్చా. ఇటీవలే వైజాగ్ పర్యటనలో ఉన్నప్పుడు మంచి కథాలోచన వచ్చింది. ఈసారి సినిమా టైటిల్ ప్రకటన నుంచే ఒక విచిత్రమైన జర్నీ ప్రారంభమవుతుంది".

'అరుంధతి' స్థాయిలో కానిస్టేబుల్ కనకం 3


సాయికృష్ణ, రాజీవ్, సత్యసాయిబాబా, వర్ష బొల్లమ్మ, కె.రాఘవేంద్రరావు, సి.అశ్వనీదత్, ప్రశాంత్ కుమార్

ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్ నుంచి రెండు సీజన్లుగా వచ్చిన 'కానిస్టేబుల్ కనకం' సిరీస్ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణని సొంతం చేసుకుంది. వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో నటించగా, ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించారు. కోవెలమూడి సత్యసాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. ఘన విజయం సాధించిన ఈ సిరీస్ త్వరలోనే ఓ సినిమాగా ముస్తాబై ప్రేక్షకుల ముందుకు రానుంది. దాంతోపాటు, ఈ సిరీస్‌కు కొనసాగింపుగా 'కానిస్టేబుల్ కనకం - కాల్ షూట్ 3' పేరుతో మరో చిత్రం రూపొందనుంది. ఈ కొత్త ప్రాజెక్టుల్ని ప్రకటిస్తూ గురువారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రముఖ దర్శక నిర్మాతలు కె.రాఘవేంద్రరావు, సి.అశ్వనీదత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ "ముప్పయ్యేళ్ల కిందట 'శాంతినివాసం' ధారావాహికతో ఈటీవీతో నా ప్రయాణం మొదలైంది. ఆ ధారావాహికతో పాటు, నేను తీసిన ఎన్నో సినిమాల్లో భాగం పంచుకున్నారు ఈ సిరీస్ నిర్మాతలు సాయిబాబా, హేమంత్. వాళ్ల అనుభవాన్నంతా మేళవించి, కొత్తతరం దర్శకుడు ప్రశాంత్, ఈటీవీ విన్‌తో కలిసి విజయవంతంగా 'కానిస్టేబుల్ కనకం' సిరీస్ రెండు సీజన్లను రూపొందించారు" అన్నారు. నిర్మాత సి.అశ్వనీదత్ మాట్లాడుతూ "కానిస్టేబుల్ కనకం విజయపరంపర ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నా" అన్నారు. వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ "ఈ సిరీస్ ప్రయాణాన్ని ఎంతగానో ఆస్వాదించా" అన్నారు. మూడో భాగంగా రాబోతున్న సినిమా ప్రేక్షకులపై చాలా ప్రభావం చూపిస్తుందన్నారు దర్శకుడు. ఈటీవీ విన్ సాయికృష్ణ మాట్లాడుతూ "సిరీస్ రెండు సీజన్‌లు అద్భుతమైన విజయాల్ని సాధించాయి. మూడో భాగాన్ని నేరుగా థియేటర్లలో విడుదల చేస్తాం. 'అరుంధతి' తరహాలో భారీస్థాయిలో ఆ సినిమాని రూపొందిస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజీవ్ కనకాల, సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి ఇతర నటీనటులు, సాంకేతిక బృందం పాల్గొంది.


గాయని ఎస్.జానకి కుమారుడి మృతి


మురళీ కృష్ణ

ప్రముఖ గాయని ఎస్.జానకి కుమారుడు మురళీ కృష్ణ (65) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సన్నిహిత వర్గాలు తెలిపాయి. 'వినాయకుడు', 'మల్లెపువ్వు' లాంటి పలు చిత్రాల్లో నటించిన మురళీ కృష్ణకు భరతనాట్యంలో కూడా ప్రావీణ్యం ఉంది. ఆయన మరణం తనను షాక్ గురి చేసిందంటూ విచారం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు ప్రముఖ గాయని చిత్ర. "ఈరోజు ఉదయం మా ప్రియమైన జానకమ్మ ఏకైక కుమారుడు మురళీ అన్నయ్య ఆకస్మిక మరణం నన్ను ఎంతో బాధించింది. ఈ భరించలేని బాధ, దుఃఖాన్ని తట్టుకునేందుకు జానకమ్మకు ఆ దేవుడు అపారమైన శక్తిని ఇవ్వాలని కోరుకుంటున్నా" అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. మురళీ కృష్ణ మృతి పట్ల నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

మళ్లీ యుద్ధ భూమిలోకి?


విక్కీ కౌశల్


బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్ 'ధురంధర్ 2'లో భాగం కానున్నారా? ఈ సినిమాతో ఆయన మళ్లీ యుద్ధ భూమిలోకి అడుగుపెట్టబోతున్నారా? అంటే అవుననే అంటున్నాయి సినీవర్గాలు. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రమే 'ధురంధర్ 2'. ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే విడుదలై బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించిన 'ధురంధర్'కి సీక్వెల్ ఇది. తాజాగా ఇందులో విక్కీ కౌశల్ ఓ కీలక పాత్రలో మెరవనున్నట్లు సమాచారం.

హ్యాపీరాజ్ ఆట


జీవీ ప్రకాశ్, శ్రీ గౌరిప్రియ

పెళ్లి చేసుకుంటావా? అని అమ్మాయి అడగడమే ఆలస్యం... 'నేనుగనక నిన్ను పెళ్లి చేసుకుంటే ఈ ప్రపంచంలో నేనే హ్యాపీ' అంటూ ఎగిరి గంతేశాడు హ్యాపీరాజ్. కానీ అసలు ఆట ఆ తర్వాతే మొదలైంది. మరి వీరి పెళ్లి ఎలా జరిగిందో తెలియాలంటే 'హ్యాపీరాజ్' చూడాల్సిందే. జీవీ ప్రకాశ్‌కుమార్, శ్రీ గౌరిప్రియ జంటగా తెరకెక్కుతున్న చిత్రమిది. మారియా ఎలాంచెజియన్ దర్శకత్వం వహిస్తున్నారు. జైవర్ధన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు ప్రచార చిత్రాన్ని ప్రముఖ కథానాయకుడు విజయ్ దేవరకొండ గురువారం విడుదల చేశారు.

అపార్థం వల్ల ఎదురైన ఇబ్బందులేంటి?


షగ్నశ్రీ, వరుణ్ సందేశ్

"అసభ్యతకు తావులేని మంచి కుటుంబ కథా చిత్రం 'హలో ఇట్స్ మీ'. యువతీ యువకులు ఒకరినొకరు అపార్థం చేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనేది ఈ సినిమాలో అందంగా చూపిస్తున్నాం" అన్నారు వరుణ్ సందేశ్. ఆయన హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కథానాయిక షగ్నశ్రీ వేణున్ స్వయంగా తెరకెక్కిస్తోంది. దర్శన్ మదమంచి మరో హీరో. వీఎస్‌కే సంజీవ్, వి.సందీప్, వి.సంకీర్త్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. "ప్రతి అమ్మాయి, అబ్బాయికి ఈ సినిమా రిలేట్ అవుతుంది. యూత్ అంతా దీనికి కనెక్ట్ అవుతారు" అన్నారు కథానాయిక, దర్శకురాలు షగ్న శ్రీ.

తెలుగు వారి గుండెల్లో నిలిచేలా.. 'గొల్ల రామవ్వ'


రాఘవేంద్రవర్మ, ముళ్లపూడి వరా, ప్రభాకర్ రావు, సురభి వాణీదేవి

దివంగత భారత ప్రధాని పీవీ నరసింహారావు రాసిన తెలంగాణ సాయుధ పోరాటగాథ 'గొల్ల రామవ్వ'ను దృశ్య రూపంగా తెరపైకి తీసుకొస్తున్నారు దర్శకుడు ముళ్లపూడి వరా. తాళ్లూరి రామేశ్వరి టైటిల్ పాత్ర పోషించిన ఈ వీరగాథను రామ్ విశ్వాస్ హనూర్కర్ - రాఘవేంద్రవర్మ నిర్మించారు. ఇది ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో ఈ నెల 25నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. పీవీ నరసింహారావు కుమారుడు పీవీ ప్రభాకర్ రావు, కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాళ్లిద్దరూ మాట్లాడుతూ.. ' 'మా నాన్న రాసిన గొప్ప కథల్లో 'గొల్ల రామవ్వ' ఒకటి. దాన్ని వరా ఎంతో గొప్పగా తెరకెక్కించార'ని ప్రశంసించారు. "ఈ సినిమా కచ్చితంగా తెలుగు వారి గుండెల్లో శాశ్వత స్థానం దక్కించుకుంటుంది" అని చిత్ర బృందం పేర్కొంది. ఈ కార్యక్రమంలో చిత్ర బృందంతో పాటు కాసర్ల శ్యామ్, మౌనశ్రీ మల్లిక్, రాజీవ్ కనకాల, ఏటా సత్యనారాయణ, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



స్టార్ 3.0 స్ప్రింట్ 1 సాంకేతికతను ప్రారంభిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

తమిళనాడులో కాగితరహిత రిజిస్ట్రేషన్ సేవలు

ప్రారంభించిన ముఖ్యమంత్రి స్టాలిన్

ఈనాడు–చెన్నై: రిజిస్ట్రేషన్ శాఖలోని ప్రజాసేవలను పూర్తిస్థాయి కాగితరహితంగా మార్చేందుకు తమిళనాడు ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని తీసుకొచ్చింది. సీఎం స్టాలిన్ 'స్టార్ 3.0 స్ప్రింట్ 1' సాంకేతిక వ్యవస్థను గురువారం ప్రారంభించారు. ఆధార్ కార్డు ఓటీపీ, బయోమెట్రిక్ అథెంటికేషన్ ద్వారా తొలివిడతగా 18 రకాల సేవలను పొందేలా ఏర్పాట్లు చేశారు.

● భూముల రిజిస్ట్రేషన్లను ఆధార్ వెరిఫికేషన్ పూర్తయ్యాక సబ్‌రిజిస్ట్రార్ డిజిటల్ సంతకంతో రిజిస్టర్ అయ్యేలా, ఆన్‌లైన్ ద్వారా ఎలక్ట్రానిక్ పత్రాన్ని పొందేలా చేస్తున్నారు. ● అనుమతి పొందిన లేఅవుట్లలో ప్లాట్ల అమ్మకందారులు, కొనుగోలుదారులు కార్యాలయాలకు రాకుండానే ఆన్‌లైన్‌లోనే పత్రాలు సమర్పించడం, ఆన్‌లైన్ పేమెంట్ చేయడం ద్వారా రిజిస్ట్రేషన్ పొందే విధానాన్ని కూడా అందుబాటులోకి తెస్తున్నారు.

జులై 11, 12 తేదీల్లో తెలుగు రచయిత్రుల మహాసభలు

ఈనాడు డిజిటల్, అమరావతి: తెలుగు రచయిత్రుల మహాసభలకు విజయవాడ వేదిక కానుంది. జులై 11, 12 తేదీల్లో వీటిని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణా జిల్లా రచయితల సంఘం గురువారం ప్రకటించాయి. పాతికేళ్ల సాహిత్య ప్రగతిపై సమీక్ష, రాబోయే పాతికేళ్లకు తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతుల అభ్యున్నతికి రచయిత్రులు ఎలాంటి పాత్ర పోషించాలనే దానిపై ఈ మహాసభలు జరగనున్నాయని ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి జి.వి.పూర్ణచందు వెల్లడించారు. సాహిత్య రంగంలో విశేషంగా కృషి చేస్తున్న మహిళలకు గౌరవ సత్కారాలు, ప్రతిభా పురస్కారాలను ఈ మహాసభల్లో అందిస్తామని తెలిపారు.



చిలగడ దుంపతో ప్రయోజనాలు

- రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.
- కంటి ఆరోగ్యానికి దోహదం చేస్తుంది.
- రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది.

– క్రిస్టెన్ జకోబిట్జ్, న్యూట్రిషన్ కోచ్

అంతరిక్ష రంగంలో స్టార్టప్‌ల విప్లవం రావాలి

- హైదరాబాద్ ఎన్‌ఆర్‌ఎస్‌సీ డైరెక్టర్ ప్రకాశ్ చౌహాన్ ఆకాంక్ష
- విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఏపీ స్పేస్ టెక్ సమిట్–2026
- 'సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్–2026' పోటీలు





సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాశ్ చౌహాన్ ★ ఏపీ స్పేస్ టెక్ స్పెక్ట్రమ్ జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న ప్రకాశ్ చౌహాన్, ఎంటీ కృష్ణబాబు, లావు రత్తయ్య, పావులూరి సుబ్బారావు తదితరులు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, పొన్నూరు: దేశంలో అంతరిక్ష సాంకేతిక రంగం వేగంగా పురోగమిస్తోందని, ప్రభుత్వం త్వరితగతిన అనుమతులు ఇస్తున్నందున సుమారు 300 స్టార్టప్‌లు రూపుదిద్దుకున్నాయని హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ చౌహాన్ తెలిపారు. ఈ రంగంలో స్టార్టప్‌ల విప్లవం రావాలని ఆకాంక్షించారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో విజ్ఞాన్, అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ స్పేస్‌టెక్ అకాడమీ, హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 'ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ సమిట్-2026' ప్రారంభమైంది. మరో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును 'లివరేజింగ్ స్పేస్ టెక్నాలజీ ఫర్ వికసిత్ భారత్-2047' ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఏపీ స్పేస్ టెక్ అకాడమీ ముద్రించిన తొలి 'స్పేస్ టెక్ స్పెక్ట్రమ్ జర్నల్'ను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం 'సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్-2026' పోటీలను ప్రారంభించారు. కాలేజీ స్థాయి విద్యార్థులు కెమికల్ రాకెట్రీ, స్కూల్ పిల్లలు హైడ్రో రాకెట్రీ విభాగాల్లో పోటీపడ్డారు. రాకెట్ డిజైన్, ఉపగ్రహ భాగాల తయారీపై విద్యార్థులు రూపొందించిన నమూనాలు, స్టార్టప్‌ల ప్రదర్శన ఆకట్టుకుంది.



రాకెట్ ప్రయోగాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

పల్లెల్లోకి అంతరిక్ష పరిశోధనల సేవలు

ఎన్‌ఆర్‌ఎస్‌సీ డైరెక్టర్ ప్రకాశ్ చౌహాన్ మాట్లాడుతూ 'మూడేళ్ల క్రితం దేశవ్యాప్తంగా మూణ్నాలుగు స్పేస్ స్టార్టప్‌లు ఉంటే, ఇప్పుడు వాటిసంఖ్య 300కు చేరింది. ఈ స్టార్టప్‌లు ఉపగ్రహాల తయారీ, డేటా విశ్లేషణ, కమ్యూనికేషన్, నావిగేషన్ సాంకేతికతల్లో వినూత్న ఆవిష్కరణలు తీసుకొస్తున్నాయి. భవిష్యత్తులో భూ పరిశీలన, సమాచార, నావిగేషన్ ఉపగ్రహాలు దేశ అభివృద్ధిలో కీలకంగా మారనున్నాయి. దేశ అంతరిక్ష కార్యకలాపాలకు తెలుగు రాష్ట్రాల్లోని మూడు ప్రముఖ సంస్థలు వెన్నుముకలా పనిచేస్తున్నాయి. ప్రపంచ స్థాయి ప్రయోగ కేంద్రం శ్రీహరికోట నుంచి పంపిస్తున్న సమాచార ఉపగ్రహాల ద్వారా గ్రామీణ ప్రాంతాలకూ ఇంటర్‌నెట్, టెలికాం సేవల్లో వేగం, నాణ్యత పెరిగాయి' అని వివరించారు. అంతరిక్ష రంగంలోనూ ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నందున 2040 నాటికి ప్రపంచ అంతరిక్ష ఉత్పత్తుల్లో భారత్ వాటా 10 శాతానికి చేరనుందని చౌహాన్ వివరించారు

పరిశోధకులకు అంతర్జాతీయ అవకాశాలు

అంతరిక్ష సంబంధిత కోర్సుల్లో చేరే యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలున్నాయని రాష్ట్ర మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. దేశ సాంకేతిక రంగంలో ఏపీ వాటా 20% ఉండటం మన రాష్ట్ర యువత ప్రతిభకు నిదర్శనమన్నారు. విద్యార్థులు ప్రయోగాత్మక ఆవిష్కరణలపై దృష్టి పెడితే, రాష్ట్రంలో స్టార్టప్‌లకు విస్తారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. అంతరిక్ష పరిశోధనలు జరిగే దేశంలో అభివృద్ధి సాధ్యమవుతుందన్న నానుడికి భారత్ మంచి ఉదాహరణ అని విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. వ్యవసాయం, పర్యావరణం, జల వనరుల నిర్వహణలో అంతరిక్ష పరిజ్ఞానాన్ని వాడుతున్న తీరును ఉదహరించారు. దీనికి కృత్రిమ మేధ, క్వాంటమ్ టెక్నాలజీ తోడైతే.. శక్తిమంతమైన సమ్మేళనమవుతుందని, ఈ మూడు రంగాలకూ ఏపీలో మంచి ప్రోత్సాహం ఉందని గుర్తుచేశారు. సదస్సులో ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు, డాక్టర్ మేఘన కూరపాటి, యూనివర్సిటీ ఛాన్స్‌లర్ పావులూరి సుబ్బారావు, ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్స్‌లర్ కేవీ కృష్ణకిశోర్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ రెండో రద్దీ నగరంగా బెంగళూరు

టామ్‌టామ్ ట్రాఫిక్ సూచీలో వెల్లడి

ఈనాడు, బెంగళూరు: బెంగళూరు నగరం ప్రపంచ అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటిగా వార్తల్లోకెక్కింది. ఏటా ప్రపంచ మెట్రో నగరాల్లో ట్రాఫిక్‌ను సమీక్షించే నెదర్లాండ్స్‌కు చెందిన లొకేషన్ టెక్నాలజీ సంస్థ 'టామ్‌టామ్ ఇండెక్స్- 2025' ఈ ఏడాది వివరాలను వెల్లడించింది. ఈ సూచీలో ప్రపంచంలోనే అత్యంత ట్రాఫిక్ రద్దీ ఉండే నగరాల్లో మెక్సికో తొలి స్థానంలో ఉండగా, బెంగళూరు రెండో స్థానంలో నిలిచింది. పుణె 5వ స్థానంలో, ముంబయి 18, దిల్లీ 23, కోల్‌కతా 29, జైపుర్ 30, చెన్నై 32, హైదరాబాద్ 47వ స్థానంలో నిలిచాయి. 2024లో మూడో స్థానంలో ఉన్న బెంగళూరు.. ఏడాదిలోనే రెండో స్థానానికి వచ్చేయడం ఇక్కడ పెరుగుతున్న ట్రాఫిక్ తీవ్రతకు నిదర్శనం. టామ్‌టామ్ సూచీ ప్రకారం బెంగళూరు అత్యంత నెమ్మదిగా రాకపోకలు సాగే ఆసియా నగరాల్లో ఒకటి. ఇక్కడ రద్దీ సమయంలో గంటకు ప్రయాణించే దూరం 16.6 కి.మీ.లకు మించడం లేదు. ఉదయం ఈ దూరం గంటకు 14.6 కి.మీ. పడిపోగా సాయంత్రానికి కేవలం 13.2 కి.మీ. మాత్రమే ప్రయాణించే వీలుంది. భారత మెట్రో నగరాల సగటు ప్రయాణ వేగం గంటకు 21.9 కి.మీ. కావడం గమనార్హం.


ప్రైవేటు వాహనాలే కారణం

పెరుగుతున్న నగర జనసంఖ్యకు అనుగుణంగా రోడ్లు విస్తరించలేదు. కోటిన్నరకు చేరిన నగర జనసంఖ్యకు దాదాపు సమానంగా ప్రైవేటు వాహనాలు రోడ్లపై పరుగులు తీస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ నియంత్రణ ప్రభుత్వానికి సవాలుగా మారింది. బస్సులు, మెట్రో వ్యవస్థల ద్వారానే నగర ట్రాఫిక్ నియంత్రణ సాధ్యం.

–ఆశిష్ వర్మ, కన్వీనర్, ఐఐఎస్‌సీ సస్టైనబుల్ ట్రాన్స్‌పోర్ట్ ల్యాబ్



బెంగళూరులో వాహనాల రద్దీ



తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి విరాళం డీడీ అందిస్తున్న భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ తదితరులు

తితిదేకు రూ.44 లక్షల విరాళం

లోకేశ్ పుట్టినరోజున అన్నదానానికి భాష్యం అధినేత అందజేత

తిరుమల, న్యూస్‌టుడే: తితిదేకు భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ రూ.44 లక్షల విరాళాన్ని గురువారం అందజేశారు. మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజైన శుక్రవారం (ఈ నెల 23) ఒక్క రోజు అన్నప్రసాద వితరణకు ఈ విరాళాన్ని ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడిని కలిసి విరాళం డీడీ అందజేశారు.



ప్రగతి శకటాలతో శుభాకాంక్షలు!

మంత్రి లోకేశ్ విద్యా రంగంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. మంత్రి ముందస్తు జన్మదిన వేడుకలను గుంటూరులో గురువారం వినూత్నంగా నిర్వహించారు. ఆయన చేపట్టిన సంస్కరణలు వివరిస్తూ శకటాలు రూపొందించి నగరంలో భారీ ప్రదర్శన చేపట్టారు. ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, మహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, తెదేపా జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, గుంటూరు (పట్టాభిపురం)

ఒడిశాలో మత మార్పిడి పేరిట వ్యక్తిపై దాడి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: మత మార్పిడికి పాల్పడుతున్నారన్న ఆరోపణలతో ఓ వ్యక్తిపై కొంతమంది అమానుషంగా దాడి చేశారు. ఈ కేసులో పోలీసులు గురువారం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాలోని ఢెంకనాల్ ఎస్పీ అభినవ్ సోంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బిపిన్ నాయక్ అనే పాస్టర్ మత మార్పిడికి పాల్పడుతున్నారని ఓ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆయనపై దాడి చేశారు. మెడలో చెప్పుల దండతో ఊరేగిస్తూ కర్రలతో కొట్టారు. జనవరి 4న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై నాయక్ భార్య పరజంగ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు 20 మంది వరకు దాడిలో పాల్గొన్నట్లు ఆమె పేర్కొన్నారు. మురుగు కాలువలో నీటిని బాధితుడి చేత బలవంతంగా తాగించేందుకు నిందితులు ప్రయత్నించినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఎస్పీ వెల్లడించారు.

EENADU Vol: 52, Issue: 163 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao


A TATA PRODUCT
Buy 2 Get 50% off*
TANEIRA
Sarees | Kurtas | Kurta Sets | Blouses | Dress Materials
Shop online at TANEIRA.com TATACLiQ Myntra +91 8147 349 464 Shop on call 1800 266 0123
VIJAYAWADA: MG Road, Beside Lifestyle, Labbipet, Ph: 7036363366
Enquire about our purchase plan
Golden Cocoon
Own Your Dream Weave


Hero
VIDA
ప్రతి ఇంట్లో EVOOTER
VIDA VX2 | మారుతున్న INDIA యొక్క స్కూటర్
THE ALL NEW GO 3.4 kWh
ఎక్కువ Range. ఎక్కువ Savings.
VX2 ఇప్పుడు 3 వేరియంట్లలో అందుబాటులో ఉంది
STARTING @JUST ₹84 990*/- (EXCLUDING STATE SUBSIDY)
WITH BaaS @JUST ₹44 990*/- & PER KM COST ₹1.24
REMOVABLE BATTERIES CONVENIENCE OF INDOOR CHARGING
VIDA | BaaS BATTERY AS A SERVICE 5-YEAR COMPREHENSIVE WARRANTY**
4700+ FAST CHARGING STATIONS
600+ OUTLETS FOR SALES AND SERVICE
Hero MotoCorp Limited (CIN: L35911DL1984PLC017354)
Additional benefits available: extended battery warranty (up to 5 years/60k kms for VX2 Plus & 5 years/50k kms for VX2 Go), warranty on critical components up to 5 years/75k kms; access to the fast-charging network & MY VIDA App during the BaaS period; option to avail assured buyback of up to 67.5% of the effective showroom price of the VX2 series. *Limited-period offer. T&C apply. BaaS offer is subject to the terms & conditions of respective financiers. Visit us at: www.vidaworld.com
Visit us in VIJAYAWADA: MG road opp Vivant Hotel – RM PREMIA, 9211448262 | NTR Colony - R.M. MOTORS PVT LTD, 9289232360 | Kanuru - SAI SWARNIKA MOTORS, 7428480526 | GUNTUR: Lakshmipuram Main Road, Phoenix Padmavathi Building - ASSOCIATED AUTO SERVICE PVT. LTD, 7428481733 | Phase4, Autonagar main road, ANNAPURNA HERO, 9441427152 | NELLORE: Mini Bypass Road, Ram Murthy Nagar - SARAYU AUTO, 7428481186 | CHIRALA: Thomaspet,Wood Nagar Colony - Srinivasa Motors,9289922707 | TANUKU: V Soma Sundara Rao Motors Hero Showroom,Tanuku, 7093940501


సేవకుడై నడిచే..
నాయకుడై వెలిగే..
ప్రత్యర్థుల గుండెల్లో సింహస్వప్నమై..
ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని పొందిన యువసారథి,
రాష్ట్ర విద్య, ఐటి శాఖామాత్యులు
శ్రీ నారా లోకేష్ గారికి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు..
యరపతినేని నిఖిల్
గురజాల నియోజకవర్గ యువనాయకులు
యరపతినేని శ్రీనివాసరావు
గురజాల నియోజకవర్గ శాసనసభ్యులు